ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ fb.com/vaartha
PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
10-5-2023 బుధవారం సంపుటి : 29 సంచిక : 99 పేజీలు : 10+4 వెల : 6.50




# ఫస్టియర్‌లో మేడ్చల్ సెకండియర్‌లో ములుగు టాప్

## ఇంటర్‌లో బాలికలదే ఆధిక్యం

### ఫలితాలు విడుదల చేసిన విద్యామంత్రి సబిత

### అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రెండువారాల్లోనే



మంగళవారం హైదరాబాద్‌లో ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తున్న మంత్రి సబిత

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో ఈ ఏడాది కూడా బాలికలే టాప్‌లో ఉన్నారు. బాలుర కంటే బాలికల ఉత్తీర్ణతా శాతం ఎక్కువగా ఉంది. ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలను విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి మంగళవారం నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో విడుదల చేశారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్, సీఈవో జయప్రదబాయి, జాయింట్ సెక్రటరీ (ఎగ్జామ్స్) వై శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ(అడ్మినిస్ట్రేషన్) భీంసింగ్, జాయింట్ సెక్రటరీ(అకడమిక్స్) వసుంధర, సీజీజీ డైరక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో 61.68 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 63.49 శాతం మంది పాసయ్యారు. రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు 9,48,153 మంది హాజరయ్యారు. పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1473 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 26000 మంది ఇన్విజిలేటర్లను పరీక్షలకు వినియోగించారు. జవాబు పత్రాల మూల్యాంకనంను 15 కేంద్రాల్లో 13000 మందితో నిర్వహించారు. జూన్ 4 నుంచి ఇంటర్ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను రెండు సెషన్స్‌లలో నిర్వహించనున్నట్టు తెలిపారు. రీకౌంటింగ్‌కు పేపర్‌కు రూ. 100, రీవెరిఫికేషన్‌కు పేపర్‌కు రూ. 600 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈ నెల 10 నుంచి 16లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ≫2

## నేడు టెన్త్ ఫలితాలు 2లో

## నదిలో పడిన ప్రైవేటుబస్సు

### మధ్య ప్రదేశ్‌లో విషాదం

### 22 మంది మృతి, 20మందికిపైగా గాయాలు



**ఇండోర్, మే 9:** మధ్యప్రదేశ్‌లో ఘోరమైన రోడ్డుప్రమాదం జరిగింది. ఖర్గోన్ జిల్లాలోని ఓ నదీ వంతెనపైనుంచి ప్రైవేటు బస్సు ఒకటి అదుపు తప్పి నదిలో పడింది. ఈ ≫2



## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టు

5లో

## నేటి నుంచి ఎంసెట్ పరీక్షలు

### నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్న నిబంధన

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం నిర్వహిస్తున్న ఎంసెట్-2023 పరీక్షలు నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. 14 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. అయితే నేడు(బుధవారం), రేపు(గురువారం)అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో ≫2

## యధావిధిగా పంచాయతీ కార్యదర్శుల సమ్మె

2లో

## సిఎం కెసిఆర్ ముఖ్య సలహాదారుగా సోమేశ్

3లో

# 'ఉగ్ర' కలకలం!

### హైదరాబాద్‌లో ఐదుగురు, భోపాల్‌లో 11 మంది అరెస్టు

### పట్టుబడిన వారంతా హెచ్‌యుటి మద్దతుదారులే

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి ఉగ్రకలకలం రేగింది. తెలంగాణరాష్ట్రం ఏర్పాటయ్యాక రెండవసారి హైదరాబాద్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలు వెలుగు చూశాయి. హైదరాబాద్‌లో పాటు మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో హిజ్బ్ ఉత్ తహరీర్ (హెచ్‌యుటి) అనే ఉగ్రవాద సంస్థకు చెందిన టెర్రరిస్టులు కార్యకలాపాలు సాగిస్తున్నట్లు, యువతను జిహాదీ వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కేంద్ర నిఘా వర్గాలు అందించిన సమాచారంతో మధ్యప్రదేశ్ యాంటి టెర్ర రిస్టు వింగ్ (ఎటిఎస్), తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ పోలీసులు శివార్లలోని జగద్గిరిగుట్టతో పాటు నగరంలోని దక్షిణ, పశ్చిమ మండల పరిధుల్లో దాడులు నిర్వ హించి ఐదుగురు ఉగ్రవాదులను అరెస్టు చేశారు. ఇదే సమయంలో భోపాల్‌లో అక్కడి ఎటిఎస్ పోలీసులు దాడులు చేసి ఇదే సంస్థకు చెందిన మరో 11 మందిని అరెస్టు చేశారు. కాగా హైదరాబాద్‌లో పట్టుబడ్డ వారిలో మధ్య మండలంలోని ఓ రాజకీయ నేతకు చెందిన వైద్య కళాశాలలో హెచ్‌ఓడిగా వున్న మహమ్మద్ సలీంతో పాటు ద క్షిణ మండల పరిధిలో డెంటిస్ట్‌గా వున్న షేక్ జునైద్, మరో బడా కంపెనీలో క్లౌడ్ ఇంజనీర్‌గా వున్న అబ్దుల్ రహమాన్, రోజువారి ≫2



## బిజెపి, కాంగ్రెస్‌కు అగ్ని పరీక్ష నేడే

### పోలింగ్‌కు కర్ణాటక రెడీ

**బెంగళూరు, మే 9:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలవరకూ పోలింగ్‌నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లుచేసారు. 224 స్థానాలకుగాను ఒకే విడతలో బుధవారం పోలింగ్ జరుగుతుంది. గతంలో 113 స్థానాలు గెలిచిన పార్టీ అధికారంకోసం మరోసారి పట్టుబిగిస్తోంది. ఇప్పటికే ఎన్నికల పోలింగ్‌కుసంబంధించి అన్ని రకాల ఏర్పాట్లుపూర్తిచేసిన యంత్రాంగం ఇవిఎంలను పోలింగ్‌కేంద్రాలకు తరలించారు. బెంగళూరులోని ప్యాలెస్ రోడ్డులోని పోలింగ్‌కేంద్రాల్లో ముఖగుర్తింపును సైతం అమలుచేస్తున్నారు. మొత్తం 5.21 కోట్లమంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 2.59కోట్లమంది మహిళా ఓటర్లు కాగా 2.62 కోట్ల మంది పురుషులున్నారు. కర్ణాటకలో తొలిసారి 9.17 లక్షలమంది ఈసారి ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 58,282 పోలింగ్‌స్టేషన్లను సిద్ధంచేసింది. వీటిలో 1320 ≫2

## కన్నడ ఎన్నికలపై తెలుగు రాష్ట్రాల్లో జోరుగా బెట్టింగ్ 7లో




E-book today at www.marutisuzuki.com or visit your nearest Maruti Suzuki dealership. | Maruti Suzuki vehicles are now available under CSD & CPC* | For bulk order, mail at: nishant.vijayvergia@maruti.co.in.

**AUTHORISED DEALERS: TELANGANA STATE: ADARSHA:** (KARIMNAGAR) CALL: 9133308022, (WARANGAL) CALL: 7799790501. **VARUN:** (NIZAMBAD) CALL: 8462236236, (KARIMNAGAR) CALL: 0878- 2950555. **PAVAN:** (NALGONDA) CALL: 8790902131. **SRI JAYARAMA:** (MEHABUBNAGAR) CALL: 8096998841. **WIN MOTORS:** (WARANGAL) CALL: 8688828002. **E-OUTLETS: ADARSHA:** (MANCHERIAL) CALL: 8886006633, (NIRMAL) CALL: 9133307720, (JAGITYAL) CALL: 8886776633, (GODAVARIKHANI) CALL: 8886556633, (ADILABAD) CALL: 7799784536, (JANGAON) CALL: 8886256633, (SIDDIPET) CALL: 9581656633. **VARUN:** (KAMAREDDY) CALL: 9966111132, (ARMUR) CALL: 9052022990, (KOTTAGUDEM) CALL: 9885260333. **PAVAN:** (MIRYALAGUDA) CALL: 8790902154, (KODADA) CALL: 8790902135. **SRI JAYARAMA:** (SHADNAGAR) CALL: 8096998841, (WANAPARTHY) CALL: 8096998841. **MITHRA AUTO:** (KHAMMAM) CALL: 8886063524. **SAI SERVICE:** (ZAHEERABAD) CALL: 7331168888. **HYDERABAD: ADARSHA:** (ATTAPUR) CALL: 8897973366, (KARMANGHAT) CALL: 8297576633. **KALYANI MOTORS:** (NACHARAM) CALL: 9100102157, (LB NAGAR) CALL: 9100102157. **GEM MOTORS:** (KONDAPUR) CALL: 9272506060. **ACER:** (TIRUMALGIRI) CALL: 9154073240. **AUTOFIN:** (BOWENPALLY) CALL: 040-67292222. **JAYABHERI:** (GACHIBOWLI) CALL: 8100823456. **PAVAN:** (SERILINGAMPALLY) CALL: 7093711199. **VARUN:** (BEGUMPET) CALL: 040-44607676, (BANJARA HILLS) CALL: 040-44887676, (KUKATPALLY) CALL: 040-44587676, (VANASTHALIPURAM) CALL: 040-24029979, (GACHIBOWLI) CALL: 040-49497676. **RKS:** (SOMAJIGUDA) CALL: 9848898488, (MALAKPET) CALL: 9848898488, (SECUNDERABAD) CALL: 9848898488, (KUSHAIGUDA) CALL: 9848898488. **MITHRA:** (HIMAYATHNAGAR) CALL: 040-27634444, (MEHDIPATNAM) CALL: 7799884949. **SAI SERVICE:** (ERRAGADDA) CALL: 7331168888, (MIYAPUR) CALL: 7331168888. **E-OUTLETS: SAI SERVICE:** (SANGAREDDY) CALL: 7331168888. **ADARSHA:** (SIDDIPET) CALL: 9581656633. **VARUN:** (MEDAK) CALL: 9703656111. **AUTOFIN:** (MEDCHAL) CALL: 8885040034. **PAVAN:** (IBRAHIMPATNAM) CALL: 7093711199.

*Offer includes consumer offer, retail support, exchange bonus and ISL/ Corporate offer (wherever applicable) on select models/variants. *Terms and conditions apply. Creative Visualization. The terms and conditions are subject to change without any prior notice. All offers are brought to you by Maruti Suzuki dealers only. Offers may vary from variant to variant. All offers shown are valid for limited period & for limited stock only. For more details, please contact your nearest ARENA dealership. Accessories and features shown in the pictures may not be a part of the standard equipment and may vary according to the variant. Black glass shade on the vehicle is due to lightening effect. Colors shown may vary from actual body colors due to printing on paper. Images used are for illustration purposes only. Cumulative sales. Maruti Suzuki India Limited reserves the right to discontinue offers without notice. Maruti Suzuki Subscribe is available in Hyderabad only. Above offer is valid till 31st May 2023.



బుధవారం కర్ణాటక ఎన్నికల్లో ఓటువేసినట్టు చూపుతున్న సుధా నారాయణమూర్తి దంపతులు

# పోలింగ్ ప్రశాంతం

≫దాఖలుచేసారు. మొత్తం 5,31,33,054 మంది ఓటర్లు ఉంటే 58,545 పోలింగ్‌స్టేషన్లలో వారంతా ఓటు హక్కువినియోగించుకున్నారు. వివరాలు బరిలో 2615 మంది అభ్యర్థులునిలిచారు. ఓటర్లలో 2,67, 28,053 మందిపురుషులు, 2,64,00,074 మంది మహిళలున్నారు. 4927 మంది ఇతరులున్నారు. పోటీచేస్తున్న అభ్యర్థుల్లో 2430 మంది పురుషులు, 184మంది మహిళలు ఉన్నారు. మరోవైపు హిజ్రాకూడా పోటీలో నిలిచారు. మొత్తం 11,71,558 మంది యువఓటర్లు ఉంటే 5,71,281 మంది దివ్యాంగులున్నారు. 12,15,920 మంది 80ఏళ్లకుపైబడిన వారు కూడా ఉన్నారు. కెపిసిసి చీఫ్ డికె శివకుమార్, కర్ణాటక సిఎం బసవరాజ్ బొమ్మై, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్‌జోషి,మాజీ సిఎం బిఎస్ యెడియూరప్ప, డిఎ ఇసదానంద గౌడ, కాంగ్రెస్ వైపు నుంచి మాజీ సిఎం సిద్ధరామయ్య, జగదీష్ షెట్టార్, ఐటి రంగ నిపుణులు ఎన్‌ఆర్ నారాయణమూర్తి, ఆయన భార్య సుధామూర్తిలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా పోలింగ్‌కు సంబంధించి అనేకచోట్ల అర్ధరాత్రివేళల్లో బిజెపి కార్యకర్తలు ఓటర్లకు డబ్బులు పంచుతుండగా వీడియోచిత్రీకరించి మరీ అరెస్టుచేసారు. గంగావతి, బళ్లారి రూరల్ నియోజకవర్గాల్లో అధికార విపక్షాలమధ్య తీవ్ర వాగ్యుద్ధానికి దారితీసి ఉద్రిక్తతలకు తావిచ్చింది. విజ్జాపూర్‌నియోజకవర్గంలో ఒక మహిళ ఓటును బోగస్ ఓటరు ప్రత్యర్థికి ఓటువేసిందన్న ఫిర్యాదులపై విచారణజరిపి పోలింగ్ అధికారిని మార్పుచేసారు. ప్రధాని మోడీ ఎన్నికల నియమావళిని ఉల్లం ఘించారని, కర్ణాటక ఓటర్లకు సందేశం ఇస్తూ వీడియో విడుదలచేసారని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులుచేసింది.కాగా పోలింగ్ మధ్యాహ్నం మూడు గంటల సమయానికి 50శాతానికి చేరింది. రామనగర నియోజకవర్గంలో 63.36శాతం పోలింగ్ అత్యధికంగా నమోదయింది. బెంగళూరు నగరంలో మాత్రం 40.28శాతంగా ఉండటం ఎన్నికల అధికారులు చెప్పారు.

**ఎన్నికల అధికారులపై దాడి 23 మంది అరెస్టు**

ఇదిలా ఉంటే విజయపుర జిల్లాలోని మసాబినాల గ్రామంలో ఎన్నికల విధులకు వెళుతున్న వాహనాన్ని అడ్డగించి దౌర్జన్యానికి దిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈవిఎంలను తీసుకువెళుతున్న వాహనాన్ని అడ్డగించి పోలింగ్ అధికారిపై చేయిచేసుకున్నారని బ్యాలట్ యూనిట్లుధ్వంసంచేసారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన వెళ్లిన పోలీస్ బృందాలు 23 మందిని అరెస్టుచేసారు. ఈమేరకు నివేదికను ఎన్నికల కమిషన్‌కుకూడా పంపించారు. గ్రామస్తులు ఇవిఎంలు తీసుకువెళుతున్న సెక్షన్ ఆఫీసర్ వాహనాన్ని అడ్డగించి రెండు బ్యాలట్‌యూనిట్లను ధ్వంసంచేసారని, మరోమూడు వివిపాట్‌లు కూడా ఉన్నాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. అలాగే పద్మనాభనగర్ నియోజకవర్గంలో కొందరు యువకులు కర్రలు, రాడ్లతో వారి రాజకీయ ప్రత్యర్థులపై దాడికి దిగారు. పాపయ్య గార్డెన్‌లోని పోలింగ్‌బూత్‌లో ప్రత్యర్థులపై దాడిచేసారు. యువకులు వీరంగంచేయడంతో ఓటువేసేందుకు క్యూలోనిలుచున్న కొందరు మహిళలు కూడా గాయపడ్డారు.

# ఇక 'ప్లాంట్ డాక్టర్' విధానం

≫సమయాల్లోను అండగా ఉంటుందిప్లాంట్ డాక్టర్స్ అంటే వ్యవసాయ శాఖాధికారులు రైతులకు పంటల ఉత్పత్తిలో మంచి ఫలితాల సాధనకు సహాయకారులకు అండగా నిలుస్తారు.ప్రతి రైతు భరోసా కేంద్రానికి వ్యవసాయాధికారి(ప్లాంట్) తరచు వెళ్లాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు.భూసార పరీక్షలు వేసే పరికరాలను ప్రతి రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు.ఈ పరికరాలను అన్ని ఆర్బీకెల్లో అందుబాటులో ఉంటుంది లేని కచ్చితంగా వ్యవసాయాధికారులు గమనించి చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం ధరల విషయంలో రైతుకు తక్కువ ధరకు అమ్ముకునే అవకాశం వచ్చిందనే మాట ఎక్కడా రాకూడదన్నారు.దీనిపై అధికారులు సవాల్‌గా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని కోటి ఎకరాలను పంటల బీమా పరిధిలోకి తీసుకుని వచ్చామన్నారు.రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాన్ని కల్పిస్తున్నామన్నారు. రైతులకు పంట సాగు ప్రణాళిక, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించు,మార్కెటింగ్ వ్యవస్థ విషయంలో పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నామన్నారు.రైతులు తాము పండించిన పంటను స్థానికంగా మార్కెటింగ్ కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన, సాగు చేసేవారికి తగిన తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బోర్ల కింద వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు అయ్యేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల వల్ల రైతులకు మంచి ఆదాయం వచ్చేలా చూడాలి. వరి పండిస్తే.. వచ్చే ఆదాయం మిల్లెట్స్ పండిస్తే కూడా వచ్చేలా చూడాలి. దీనికోసం రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఈ అంశంపై సరైన అధ్యయనం చేసి రైతులకు అండగా నిలవాలి. మిల్లెట్స్ పండించినా రైతులకు మంచి ఆదాయం వచ్చే విధానాలు ఉండాలి. మిల్లెట్స్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి. మిల్లెట్స్‌ను అధికంగా సాగుచేస్తున్న ప్రాంతాల్లో ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి. దీంతోపాటు సహజ పద్ధతుల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వాలని" సిఎం వైఎస్ జగన్ అన్నారు. "సేంద్రియ, ప్రకృతి సేద్యంపై రైతుల్లో అవగాహన పెంచాలి. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సహజ పద్ధతుల్లో సేంద్రియ పద్ధతుల ద్వారా పంటసాగును ప్రోత్సహించాలి. రసాయనాలు లేని సాగువైపు మంచి విధానాలను తీసుకురావాలి. ఆర్బీకే యూనిట్‌గా ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి.ఆర్బీకే పరిధిలో ఏర్పాటు చేస్తున్న సిహెచ్‌సిలో కూడా ఆర్గానిక్ వ్యవసాయానికి అవసరమైన పరికరాలు ఉంచాలి. సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన పరికరాలు, మందులు, సేంద్రియ ఎరువుల తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు.ధాన్యం కొనుగోలులో మిల్లరుల పాత్రను పూర్తిగా తీసివేసామన్నారు.రైతుగోళ్లు కల్పించిన రైతు భరోసా కేంద్రాల ద్వారా జరుగుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాలన్నింటికి డ్రోన్లు అందుబాటులోకి తీసుకుని వచ్చే దిశలో ప్రభుత్వం కార్యచరణ చేపట్టిందని తెలిపారు.దశల వారిగా రైతు భరోసా కేంద్రాలన్నింటి పరిధిలో కిసాన్ డ్రోన్లు వస్తాయని తెలిపారు.

# దర్యాప్తు నిగ్గుతేల్చుతారా!

≫అధికారుల్లో కలవరపర్స్తోంది. నిశిత తనిఖీలు చేయకపోవడం వల్లే ఏకంగా భక్తుడు సెల్‌ఫోన్‌ను (స్పైకెమెరా అంటున్న విజిలెన్స్‌వర్గాలు)తీసుకుని వైకుంఠం-1లోని చెక్‌పాయింట్ కూడా దాటుకుని ఆలయ మహద్వారం కూడా దాటేసి ఆలయ బంగారువాకిలి నుంచి విమానవేంకటేశ్వరుని వరకు వీడియోచిత్రీకరించిన సిసికెమెరాల పరిశీలిస్తే కమాండ్ కంట్రోల్ కేంద్రం (24 గంటలూ అనుక్షణం అప్రమత్తంగా దేశక్షలతో ఉండాల్సి)నిసిబ్బంది గమనించలేని పరిస్థితి అంటే ఉదాసీనత ఏ పాటిదో కొట్టొచ్చినట్లు తెలుస్తోంది. అంతేగాక ఈ ఘటనపై తిరుమలలో ఆలయ భద్రతపై నిఘాభద్రత విభాగం (ఎస్‌పిఎఫ్,విజిలెన్స్,టిటిడి సెక్యూరిటీ)వైఫల్యం,నిర్లక్ష్యం కారణమని తేటతెల్లమవుతోంది. లక్షలమంది భక్తులు వస్తున్న ఆలయంలోనికి నిశితంగా తనిఖీలు చేయడంలో భద్రత విభాగం సిబ్బంది నిర్లక్ష్యమేననేది భక్తులు ,టిటిడి వర్గాలు వ్యక్తం చేస్తున్న ఆందోళన. ఈ నేపథ్యంలో ఆలయం లోపల పూర్తిగాపట్టు కలిగివుండే ఎస్‌పిఎఫ్ సిబ్బంది బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. ఆ రోజు ఆ సమయంలో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో విమానాశ్రయం తరహాలో తనిఖీ చేసే చెక్‌పాయింట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందిపై వేటు పడే అవకాశం ఉంది. అంతేగాక ఇది నిజంగా వీడియో చిత్రీకరించిన భక్తుడు కరడుగట్టిన నేరస్తుడు, నేరప్రవృత్తితో సంబంధం ఉన్న వ్యక్తులే అయితే పరిణామాలు ఏంటనే ఆందోళన కూడా భక్తుల్లో వ్యక్తమవుతోంది.

**దర్యాప్తు నిగ్గుతేల్చుతారా!?:**

సాక్షాత్తు ఏడుకొండల వేంకటేశ్వరుడు కొలువైన తిరుమల ఆలయం ప్రాంగణం, పరిసరాల్లో లోపల ఆనందనిలయం తదితర ప్రాంతాల చిత్రీకరణ టిటిడి ఆధీనంలో ఉండే ప్రజాసంబంధాలవిభాగంకు కూడా అనుమతిలేదు. ఆలయ భద్రత దృష్ట్యా భక్తులకు ఆలయంలోపలకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలుగానీ, ఆయుధాలు గానీ తీసుకెళ్లే అవకాశం లేదు. దేశంలోని ప్రముఖులు రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్ర, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు వెంకన్న దర్శనానికి వచ్చిన సమయంలో కూడా భద్రత సిబ్బందిని ఆయుధాలతో ఆలయంలోపలకు అనుమతించడం లేదు. పైగా వ్యక్తిగత ఫోటోగ్రాఫర్లను మహద్వారం దాటి అనుమతించరు. అలాంటిది ఆలయంలోపలకు ప్రవేశించే మహద్వారం, వెండివాకిలి, బంగారువాకిలి దాటుకుని ఏకంగా భక్తుడి మునుగులో వీడియోచిత్రీకరించిన ఘటన మాత్రం సర్వత్రా ఆందోళన, అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇంతటి వ్యాపకదేది కనుక్కోలేని పరిస్థితిలో టిటిడి నిఘాభద్రత వ్యవస్థ ఉండటం విచారకరం. మరీ మూడురోజులు కావస్తున్నా ఈ వైఫల్యానికి కారకులైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనే అనుమానాలు భక్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఏకంగా నిఘాభద్రత అధికారులు సాధారణ విషయంలా దర్యాప్తుచేసి కట్టుకథలు చెప్పేస్తారా?లేక వీడియో చిత్రీకరణ వెనుక అసలైన వాస్తవాలు వెలుగుచూసేలా నిగ్గుతేల్చుతారా అనేది మాత్రం లక్షలాదిమంది భక్తుల్లో ఆసక్తికరంగా మారింది.



బుధవారం తిరుమలలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న తెలంగాణ గవర్నర్ తమిళిసై

# ఇంటి అద్దె అలవెన్స్ పెంపు

విజయవాడ, మే10,ప్రభాతవార్తప్రతినిధి: ఏపి ప్రభుత్వ ఉద్యోగులకు సిఎం జగన్ మంచి కబురు తెలిపారు.సుదీర్ఘకాలం నుంచి వారు డిమాండ్ చేస్తు న్నట్టుగానే జిల్లా హెడ్ క్వార్టర్లలో పనిచేసే ఉద్యోగు లకు ఇంటి అద్దెఅలవెన్సు (హెచ్‌ఆర్‌ఏ)ను పెంచారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ ఉత్తర్వులు జారీ చేసింది.కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్లు పార్వతీపురం, పాడేరు, అమలాపురం, బాపట్ల, రాజమండ్రి, భీమవరం, నరసరావుపేట, పుట్టపర్తి, రాయచోటిల్లో ఉద్యోగులకు కూడా పెంచిన హెచ్‌ఆర్‌ఏవర్తింపచేయనున్నారు.పెంచి హెచ్‌ఆర్‌ఏ ఇకపై 16శాతం ఉంటుంది.ఇప్పటి వరకు 12శాతం మాత్రమే హెచ్‌ఆర్‌ఏ ఇస్తున్నారు.గత కొంత కాలం నుంచి ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్‌లను పరిష్క రించాలని కోరుతున్నారు.అయితే ఈనెల 1 నుంచి డిమాండ్లన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని మంత్రివర్గ ఉపసంఘం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2020 జనవరి నుంచి ఇవ్వాల్సిన డీఏను 2.73శాతం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన జీవోను జారీ చేసింది.ఇదే రీతిలో పలు సమస్యలను పరిష్కరిస్తు వస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరిస్తున్న విషయంలో కొన్ని ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్త ం చేస్తుంటే, మరి కొన్ని ఉద్యోగ సంఘాలు దశల వారిగా ఆందోళన చేస్తున్నాయి.తమ సమస్యలన్నిం టిని పరిష్కరిస్తూ, ఉత్తర్వులు జారీ అయినప్పుడే ఆందోళన విరమిస్తాయని ప్రకటించాయి.

# వడగాడ్పులు

≫దాటే సమయంలో తుపాను గాలుల వేగం గంటకు 130 కిలోమీటర్ల మేర ఉండే అవకాశం ఉందని వివరించింది. ఇప్పటి వరకు ఉన్న సమాచారాన్ని బట్టి తుపాను ప్రభావం రాష్ట్రం పడే అవకాశం లేదని స్పష్టం చేసింది. అయితే కోస్తాంధ్ర, రాయలసీమలపై ఉన్న తేమ గాలులు తీవ్ర వాయుగుండం వైపు పయనించడంతో వాయువ్య భారత్ నుంచి ఉష్ణగాలులు ఈ ప్రాంతాలపై పడే అవకాశం ఉందని తెలిపింది. ఫలితంగా రాగల 4, 5 రోజుల్లో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి పెరుగుతాయని వివరించింది. ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41-46 డిగ్రీల మధ్య నమోదు అయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ప్రజలు వడగాలుల నుంచి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండలో తిరగరాదని, అత్యవసరం అయితే తప్పనిసరిగా వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

SINGAM KUIL RED WEDNESDAY
DrawDate on:10/05/23

DAY - SINGAM SERIES Dr No:186
1st Prize Rs.100000/- 138682
2nd Prize Rs.7000/- 94839
3rd Prize Rs.3500/-
02124 06627 23604 46382 52556
58590 68373 83189 88684 93902
4th Prize Rs.200/-
1347 1527 2142 3057 3745 3819 5017
5307 7302 9097
5th Prize Rs.100/-
0248 0848 3028 4689 5136 6241 6467
8547 8914 9994
6th Prize Rs.50/-
0010 1621 3797 4751 5914 7784 8891
0199 1637 3857 4826 5952 7790 9019
0251 1698 3880 4914 6011 7795 9100
0315 1782 3956 5031 6099 7802 9287
0359 1804 3991 5078 6379 7961 9355
0635 1810 4085 5103 6447 8027 9584
0805 2156 4086 5179 6454 8091 9611
0946 2158 4110 5189 6529 8213 9727
1106 2270 4288 5191 6531 8242 9866
1248 2466 4435 5250 6708 8249 9937
1336 2529 4581 5551 6791 8352
1349 2670 4582 5567 6843 8357
1400 2989 4636 5572 7145 8553
1429 3212 4665 5716 7239 8671
1511 3242 4704 5813 7377 8872

DAY - KUIL SERIES Dr No:186
1st Prize Rs.100000/- 494268
2nd Prize Rs.7000/- 12537
3rd Prize Rs.3500/-
06959 17196 27433 36844 40135
40611 64806 75189 83654 95954
4th Prize Rs.200/-
0658 1503 1692 2580 2793 3669 4392
5472 5787 8741
5th Prize Rs.100/-
0999 1306 2449 3836 4344 5385 6339
6791 6977 7519
6th Prize Rs.50/-
0087 1795 3472 4730 6246 7744 9360
0432 1824 3502 5026 6418 7916 9394
0464 1961 3574 5039 6616 8214 9419
0492 2064 3695 5145 6626 8409 9435
0531 2117 3839 5149 6720 8435 9527
0655 2250 3854 5168 6980 8522 9562
0797 2453 4028 5255 7152 8659 9699
0889 2639 4282 5398 7239 8797 9874
1077 2689 4284 5446 7250 8923 9890
1285 2811 4312 5718 7256 9014 9914
1392 2838 4436 5726 7335 9018
1510 2888 4446 5881 7349 9045
1534 2890 4559 5951 7547 9295
1594 3183 4692 5964 7631 9324
1712 3413 4716 6159 7691 9353

ROSA DEAR PEARL WEDNESDAY
DrawDate on:10/05/23

DAY - ROSA SERIES Dr No:186
1st Prize Rs.100000/- 685326
2nd Prize Rs.7000/- 23788
3rd Prize Rs.3500/-
10340 17260 20125 26550 46136
55988 56269 56409 75719 97236
4th Prize Rs.200/-
1575 1651 4184 5076 6264 6648 7920
8954 9432 9893
5th Prize Rs.100/-
0072 0629 0828 0830 1329 1376 1664
1809 2445 6767
6th Prize Rs.50/-
0080 1752 3989 4850 6321 7775 8905
0260 1821 4047 4971 6463 7843 8914
0298 2069 4050 5019 6526 7846 8981
0458 2076 4213 5278 6675 7887 9051
0501 2270 4224 5319 6827 8015 9384
0513 2518 4227 5334 6887 8017 9587
0536 2553 4252 5383 6978 8142 9836
0696 2662 4360 5781 6993 8185 9849
0819 2733 4438 5784 7323 8271 9944
0893 3048 4497 5928 7324 8309 9963
0971 3094 4501 5976 7366 8315
1140 3162 4554 6071 7451 8485
1701 3255 4577 6082 7524 8568
1728 3542 4713 6135 7597 8593
1739 3889 4784 6315 7673 8881

DAY - DEAR SERIES Dr No:186
1st Prize Rs.100000/- 353295
2nd Prize Rs.7000/- 17232
3rd Prize Rs.3500/-
01057 01723 13039 42385 44084
49561 56817 56859 61008 76609
4th Prize Rs.200/-
0978 1224 1609 2389 3086 3314 5580
5763 6795 9220
5th Prize Rs.100/-
1758 3160 3822 5245 5524 5546 6478
7205 7568 9159
6th Prize Rs.50/-
0064 2234 3389 4575 5866 7375 8918
0181 2307 3418 4613 5984 7540 9125
0696 2343 3457 4641 6143 7576 9217
0704 2430 3531 4784 6377 8242 9278
0781 2488 3634 4791 6555 8293 9475
0921 2711 3953 4871 6577 8402 9529
1236 2755 4027 4873 6796 8421 9669
1482 2807 4110 4975 6868 8482 9760
1570 2996 4176 5113 6982 8494 9773
1619 3017 4191 5161 7061 8547 9972
1725 3136 4200 5251 7197 8563
1776 3138 4281 5350 7226 8662
1818 3158 4320 5593 7286 8689
1839 3237 4508 5603 7314 8771
1875 3250 4562 5731 7368 8837

THANGAM VAIRAM FORTUNE WEDNESDAY
DrawDate on:10/05/23

DAY - THANGAM SERIES Dr No:186
1st Prize Rs.100000/- 589174
2nd Prize Rs.7000/- 86415
3rd Prize Rs.3500/-
06270 12816 36604 39924 55620
59326 74423 78383 82884 92719
4th Prize Rs.200/-
0014 1789 3055 3507 3610 5306 5857
6069 7855 8704
5th Prize Rs.100/-
1162 2360 2821 3442 3718 3939 6856
7024 7715 7993
6th Prize Rs.50/-
0108 1598 2515 4370 5684 7169 8549
0162 1611 2552 4593 5753 7349 8709
0473 1704 2696 4598 5881 7560 8749
0519 1713 2882 4618 5965 7719 8840
0553 1770 2892 4850 6103 7814 9164
0569 1916 3032 4955 6117 8105 9489
0582 1936 3079 5057 6135 8119 9504
0628 1957 3138 5096 6143 8187 9684
0765 1980 3412 5239 6202 8276 9804
0898 2156 3558 5274 6278 8312 9992
1072 2194 3642 5297 6342 8314
1201 2309 3886 5449 6893 8317
1224 2341 4070 5502 7099 8344
1289 2395 4175 5573 7116 8356
1534 2407 4242 5645 7144 8390

DAY - VAIRAM SERIES Dr No:45
1st Prize Rs.50000/- 864649
2nd Prize Rs.7000/- 49771
3rd Prize Rs.3500/-
05593 27653 30528 32691 35492
46273 60277 60318 61151 91404
4th Prize Rs.200/-
0333 1678 2335 5670 6016 6509 7969
8856 9287 9930
5th Prize Rs.100/-
0713 2887 4847 5434 5604 5972 6267
6295 7286 9604
6th Prize Rs.50/-
0001 2209 3520 4771 6093 7853 9013
0095 2407 3521 4867 6106 7860 9101
0136 2470 3668 4886 6374 8178 9235
0823 2534 3687 4995 6483 8432 9392
0993 2683 3691 4998 6522 8454 9447
1209 2891 3783 5013 6613 8478 9495
1213 2964 3966 5124 7081 8496 9514
1355 2975 4150 5206 7098 8634 9596
1393 3040 4184 5284 7196 8649 9694
1460 3043 4478 5369 7222 8655 9816
1629 3097 4518 5464 7318 8662
1641 3155 4523 5502 7457 8770
1776 3169 4538 5582 7475 8965
1972 3425 4610 5854 7553 8970
2083 3432 4662 5983 7804 9012

NALLANERAM MANI FORTUNE WEDNESDAY
DrawDate on:10/05/23

DAY - NALLANERAM SERIES Dr No:186
1st Prize Rs.50000/- 166148
2nd Prize Rs.7000/- 99311
3rd Prize Rs.3500/-
08566 12157 39190 55005 60958
70740 76957 79273 91445 96512
4th Prize Rs.200/-
0150 1832 2749 3890 4570 6023 6579
7389 7542 9352
5th Prize Rs.100/-
0704 1541 2184 4192 5142 5290 5615
8440 8780 9983
6th Prize Rs.50/-
0162 1667 2490 4402 5502 6847 9008
0207 1669 2761 4445 5799 6969 9115
0363 1674 2811 4461 5810 7049 9136
0488 1770 2920 4500 5856 7095 9204
0565 1906 2993 4507 5862 7300 9246
0833 1919 3356 4551 6012 7490 9296
0840 1936 3401 4599 6053 7769 9331
0906 1951 3821 4888 6265 7808 9456
0917 2023 3837 4903 6285 8031 9745
1084 2024 3992 5100 6375 8120 9777
1140 2107 4011 5182 6384 8377
1170 2229 4049 5282 6457 8379
1339 2248 4135 5356 6559 8416
1409 2355 4205 5378 6619 8737
1493 2382 4309 5488 6828 8738

DAY - MANI SERIES Dr No:45
1st Prize Rs.50000/- 499838
2nd Prize Rs.7000/- 51103
3rd Prize Rs.3500/-
08829 11335 22841 32549 54146
64024 64045 73746 82097 89280
4th Prize Rs.200/-
1809 1889 2075 3697 4743 5839 6434
6621 7077 7210
5th Prize Rs.100/-
0045 1067 1888 2744 5066 5109 5616
6042 8993 9353
6th Prize Rs.50/-
0017 1317 3236 5037 7081 7695 9020
0121 1605 3351 5266 7344 7699 9038
0214 1685 3425 5369 7352 7744 9098
0227 2073 3449 5739 7374 7950 9204
0259 2236 3565 5752 7376 8083 9267
0661 2284 3749 5831 7398 8157 9269
0663 2445 3758 5876 7436 8198 9324
0743 2460 3787 6032 7440 8318 9725
0770 2671 3831 6301 7535 8376 9760
0797 2698 3949 6312 7543 8541 9777
1101 2731 3968 6576 7580 8585
1187 2753 4264 6642 7605 8828
1204 2811 4521 6728 7612 8963
1206 3216 4663 7048 7630 8999
1217 3220 4770 7073 7646 9011

KUMARAN VISHNU STAR WEDNESDAY
DrawDate on:10/05/23

DAY - KUMARAN SERIES Dr No:186
1st Prize Rs.50000/- 165838
2nd Prize Rs.7000/- 62524
3rd Prize Rs.3500/-
03394 09022 11691 15258 18405
19029 45913 61535 87303 97085
4th Prize Rs.200/-
3422 5470 6563 7144 8402 8578 8742
9303 9436 9760
5th Prize Rs.100/-
1799 3024 3721 4911 5651 6215 8123
8305 8429 9922
6th Prize Rs.50/-
0214 2010 3358 4981 6534 7873 9406
0224 2025 3410 5012 6623 7919 9423
0523 2105 3432 5171 6697 7979 9473
0564 2264 3534 5301 6700 8238 9573
0791 2305 3802 5348 6871 8277 9641
0991 2357 4062 5387 6999 8290 9851
1181 2401 4071 5468 7095 8359 9868
1207 2410 4263 5613 7183 8503 9932
1264 2466 4293 5848 7408 8712 9941
1480 2545 4363 5995 7429 8733 9950
1533 2706 4367 6113 7435 8793
1565 2833 4594 6250 7481 8841
1627 2878 4851 6389 7638 9203
1769 2887 4872 6407 7649 9223
1879 3072 4953 6514 7709 9224

DAY - VISHNU SERIES Dr No:186
1st Prize Rs.50000/- 246619
2nd Prize Rs.7000/- 65406
3rd Prize Rs.3500/-
13227 24318 24345 25312 50474
73652 75246 80789 84192 97460
4th Prize Rs.200/-
0183 1296 3061 5758 5986 6775 6887
7409 8572 9159
5th Prize Rs.100/-
0034 0111 0823 1003 1036 4189 4733
6857 7012 7275
6th Prize Rs.50/-
0018 1743 3150 4246 5597 6839 9398
0187 1950 3202 4417 5732 7018 9428
0273 1959 3239 4436 5757 7249 9458
0303 1995 3330 4486 5788 7483 9529
0689 2082 3364 4541 5838 7765 9552
0713 2231 3408 4564 5848 8000 9601
0732 2410 3443 4662 5949 8111 9646
0756 2476 3572 4705 6093 8115 9681
1002 2480 3725 4732 6095 8121 9735
1050 2656 3739 4750 6199 8199 9942
1181 2757 3774 4786 6440 8474
1594 2787 3848 4868 6441 8557
1664 2803 4062 4887 6574 8562
1700 2955 4108 5233 6683 8570
1737 3058 4156 5423 6826 9294

SWARNALAXMI LION EMERALD WEDNESDAY
DrawDate on:10/05/23

SWARNALAXMI SERIES Dr No:186
1st Prize Rs.50000/- 514238
2nd Prize Rs.7000/- 47632
3rd Prize Rs.3500/-
14745 25619 36473 36930 58132
69226 71373 82134 82605 93547
4th Prize Rs.200/-
0343 1721 1828 1961 2612 2667 5475
5951 6515 9068
5th Prize Rs.100/-
0217 0332 1100 1660 2755 2775 5076
7108 8298 8954
6th Prize Rs.50/-
0004 1612 3715 4632 6041 7304 9166
0145 1987 3818 4683 6205 7465 9307
0233 2172 3829 4826 6238 7773 9332
0297 2178 3831 4972 6301 7811 9432
0509 2510 3869 4973 6328 7815 9499
0548 2512 4100 4998 6364 7825 9563
0662 2525 4173 5145 6403 7922 9628
0696 2736 4204 5395 6416 7969 9761
0749 2749 4261 5555 6448 8016 9828
1226 2930 4289 5679 6828 8024 9852
1255 2976 4353 5824 6962 8308
1352 3061 4436 5890 7019 8415
1371 3184 4459 5922 7180 8806
1512 3214 4505 6007 7206 8821
1550 3692 4580 6027 7253 8864

DAY - LION SERIES Dr No:45
1st Prize Rs.50000/- 681460
2nd Prize Rs.7000/- 46106
3rd Prize Rs.3500/-
13748 24324 35119 46419 46662
57549 68641 79306 81291 92231
4th Prize Rs.200/-
1217 1989 2074 4163 4407 5993 6948
9512 9835 9855
5th Prize Rs.100/-
0628 1996 3034 3599 4305 5878 7074
8926 8940 9832
6th Prize Rs.50/-
0029 1461 2570 4702 6166 7761 9080
0089 1535 2591 4764 6787 7764 9184
0091 1647 2648 4796 6806 7903 9187
0235 1697 2743 4925 6867 7946 9327
0313 1824 2809 4940 6898 8089 9546
0435 1836 2841 5248 7030 8093 9599
0479 1899 3357 5341 7075 8167 9859
0750 2043 3594 5415 7196 8235 9870
0856 2069 3657 5552 7270 8463 9996
0896 2185 3943 5686 7336 8621 9997
0954 2207 4171 5755 7377 8645
1213 2219 4427 5842 7401 8897
1248 2509 4458 5914 7643 8935
1391 2512 4646 5964 7738 9024
1395 2528 4686 6124 7741 9036

# కాంగ్రెస్‌కే కన్నడిగుల పట్టం?

≫ఈ పోలింగ్ సరళి స్పష్టంచేస్తోంది. 40 రోజులుగా కొనసాగిన హోరా హోరీప్రచారంలో రెండు జాతీయ పార్టీలు ఓ ప్రాంతీయ పార్టీ అగ్రనేతలు సుడిగాలిపర్యటనలు రోడ్‌షోలునిర్వహించారు. మొత్తం 224 నియోజకవర్గాల్లో 2615 మంది అభ్యర్థులు బరిలోనిలిచారు. వివిధ సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్‌పోల్ సర్వేలో కాంగ్రెస్‌పార్టీకే ఎక్కువస్థానాలు రాగలవని అంచనావేసాయి. అధికారంలోకి రావాలంటే మ్యాజిక్‌ఫిగర్ ఏపార్టీకయినా 113 స్థానాలు అవసరం అవుతాయి. వివిధ సంస్థలునిర్వహించిన సర్వేలు అన్నింటిలోనూ కూడా కాంగ్రెస్ పార్టీకే ఎక్కువస్థానాలు రాగలవని అంచనావేసాయి.

| సర్వే సంస్థ పేరు | బిజెపి | కాంగ్రెస్ | జెడిఎస్ |
|---|---|---|---|
| ఎబిపి న్యూస్ సి ఓటర్ | 83:95 | 100:112 | 21:29 |
| న్యూస్ నేషన్: సిజిఎస్ | 114 | 86 | 21 |
| రిపబ్లిక్ టివి, పిమార్క్యూ | 85:100 | 94:108 | 24:32 |
| సువర్ణ న్యూస్ జన్‌కీబాత్ | 94:117 | 91:106 | 14:24 |
| టివి9, భారత్ వర్ష్ పోల్‌స్ట్రాట్ | 88:98 | 99:109 | 21:26 |
| జీన్యూస్, మాట్రిజ్ | 79:94 | 103:118 | 25:33 |
| టైమ్స్‌నౌ | 78:92 | 106:120 | 20:26 |
| పీపుల్స్ పల్స్ | 70:90 | 107:119 | 23:29 |
| టివి9 కన్నడ సిఓటర్స్ | 83:94 | 100:112 | 21:29 |

# ఇక కేంద్రం వంతు!

≫తీసుకున్నారు. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాలకు వాటా అంశంపై భేటీలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. గత తొమ్మిదేళ్లుగా ఉన్న 66:34 నిష్పత్తిని కొనసాగించాలని ఏపీ కోరింది. ఆ నిష్పత్తికి ప్రాతిపదిక ఉందని వాదించింది. ట్రిబ్యునల్ తప్ప కేటాయింపులు మార్చే అధికారం ఎవరికీ లేదని పేర్కొంది. తమకు ఈ నిష్పత్తి ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని తెలంగాణ ప్రతివాదన చేసింది. తాత్కాలిక కేటాయింపును గత ఏడాది కూడా తాము వ్యతిరేకించినట్లు తెలిపింది. కల్వకుర్తి,నెట్టెంపాడు,ఎస్‌ఎల్‌బిసీ కలిపితే 105 టిఎంసీలు వస్తుందని... మొత్తంగా తమకు 811 టిఎంసీల్లో సగంవాటా కావాల్సిందేనని తెలిపింది. అయితే ఎప్పటి కప్పుడు అవసరాల ఆధారంగా త్రిసభ్య కమిటీ ద్వారా నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేస్తూ వాటా తేల్చే అంశాన్ని కేంద్రల జలశక్తిశాఖకు నివేదించాలని బోర్డు నిర్ణయించింది. సుంకిశాల ఇన్‌టేక్ వెల్‌కు తమ కేటాయింపుల్లో నుంచే నీటిని తీసుకుంటామని,దీనిపై ఏపీ అభ్యంతరాలు తగవని తెలంగాణ పేర్కొంది. అందుకు సంబంధించిన డిపిఆర్, తదితరాలు ఇవ్వాలని కెఆర్‌ఎంబీ సూచించింది. కల్వకుర్తి ఎత్తిపోతలకు అదనంగా కేటాయించిన 15 టిఎంసీలపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు గతంలో ఇచ్చిన తప్పుడు నివేదిక కారణంగానే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారని వివరించింది. అభ్యంతరాలను కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు... అంధ్రప్రదేశ్‌కు సూచించింది.

జల విద్యుత్ ఉత్పత్తి,పోలవరం నుంచి గోదావరి జలాల మళ్లింపుతో ఎగువన ఇవ్వాల్సిన 45టిఎంసీల కృష్ణా జలాల విషయంలో రెండు రాష్ట్రాలు భిన్నమైన వాదనలు వినిపించాయి. విభజన చట్టం ప్రకారం బోర్డును తరలించాల్సి ఉందని, విశాఖలో ఉచితంగా కార్యాలయం వసతి కోసం ఓ ప్రభుత్వ భవనాన్ని గుర్తించినట్లు ఏపీ అధికారులు తెలిపారు. బోర్డు తరఫున వచ్చి పరిశీలిస్తే త్వరలోనే తరలింపు సాధ్యమవుతుందన్నారు. ఇదిలా ఉండగా, కృష్ణా జలాలలో నీటి కేటాయింపులు 66:34 శాతం వాటాకు ఒప్పుకునేది లేదని తెలంగాణ నీటిపారుదల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ మరోసారి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు ఉండాలని, కేంద్ర విభజన చట్టం ప్రకారం నడుచుకోవాలని కేంద్ర జల్‌శక్తి శాఖ చెబోతుందని, కచ్చితంగా ప్రత్యేక ట్రిబ్యునల్ ఉండాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# పాలకుల నిర్లక్ష్యానికి రైతు బలి

≫మునిగిపోయారన్నారు. ఉమ్మడి తూర్పు జిల్లాలో 4.36 లక్షల ఎకరాలలో వరి పంట నష్టపోయిం దని,రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ధాన్యంను కొనుగోలు చేసి భారీ నష్టం జరిగి ఉండేదికాదన్నారు.ప్రతిపక్ష పార్టీలు క్షేత్రస్థాయిలోకి వస్తేనేగాని పాలకపక్షానికి రైతులు గుర్తుకు రాకపోవడం దారుణమన్నారు.ధాన్యంను నింపేందుకు గోను సంచులు లేవని,తేమశాతం సరిగా లేదని పలు ఆంక్షలు పెట్టి ధాన్యంను కొనుగోలు చేయకుండా కాలయాపన చేయడంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను కళ్ళాల్లోనే ఉంచేయడంతో వర్షానికి తడిసి ముద్దయ్యి, రంగుమారి, మొలకెత్తిందన్నారు. ప్రతిపక్ష నాయకులు పర్యటన విషయాన్ని తెలుసుకున్న అధికార యంత్రాంగం హుటాహుటిన ఆంక్షలు పక్కన పెట్టి అర్ధరాత్రి వరకూ ధాన్యంను కొనుగోలు చేయడం సిగ్గుచేటన్నారు.అప్పుడులేని ఆంక్షలు ఇప్పుడు ఎలా సడలించారని పవన్‌కల్యాణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఇదే విధానాన్ని గత వారం అమలు చేస్తే ఎంతోమంది రైతులు ఆర్థికంగాను,మానసికంగాను నష్టపోయేవారుకాదన్నారు.ప్రభుత్వం ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో అకాల వర్షాలకు పంట నష్టం జరిగిందన్నారు.ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అన్నదాతకు అండగా జనసేన పార్టీ ముందుంటుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. అంతకుముందు జనసైనికులు, వీర మహిళలు పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు.

## వారం - వర్జ్యం

**11-5-2023 గురువారం**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయనం,
వైశాఖ మాసం, కృష్ణ పక్షం, కార్తె కృత్తిక
షష్ఠి మ.12-58; ఉత్తరాషాఢ సా.04-15
వర్జ్యం రా.07-58 ల 09-27
రా.కా.మ.1-30 ల 3-00 వ
యమగండం ఉ.6-00 ల 7-30 వ
దుర్ముహూర్తం ఉ.10-00 ల 10-48 వ
మ.2-48 ల 3-36 వ

## వార్తాఫలం

**మేషం:** శుభ కార్యాలకు హాజరవుతారు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది.

**వృషభం:** రుణాలు లభిస్తాయి. సంతాన సమస్యలు పరిష్కారమవుతాయి.

**మిథునం:** దేశాంతర ప్రయాణ సూచన లున్నాయి. మిత్రులను కలుసుకుంటారు.

**కర్కాటకం:** అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు.

**సింహం:** ఉత్సాహంగా గడుస్తుంది. కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి.

**కన్య:** ధన లాభం. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది.

**తుల:** ఉద్యోగాభివృద్ధి బాగుంటుంది. విలాస వంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది.

**వృశ్చికం:** బంధు, మిత్రులను కలుసుకుం టారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం.

**ధనుస్సు:** సంతానాభివృద్ధి సంతృప్తికరం. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది.

**మకరం:** ఆరోగ్య సమస్యలుంటాయి. తొందరపాటు నిర్ణయాలు తీసుకోకండి.

**కుంభం:** రుణాలు తీర్చి ఊరట పొందుతారు. సమస్యలు పరిష్కారం.

**మీనం:** ఉన్నతాధికారులను సందర్శిస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

## కారంపాడి చల్లి రైల్వేకాలనీలో చైన్ స్నాచింగ్



### తోపులాటలో బాధితురాలికి గాయాలు

### రైల్వే కాలనీలలో పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు

**గుంతకల్లు రైల్వే, మే 9 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలో, స్థానిక రైల్వే శాంతి నగర్ కాలనీలోని నెంబర్ 558/బిలో నివాసం ఉంటున్న, రైల్వే విద్యుత్ నిర్వహణ విభాగంలోని ట్రైన్ లైటింగ్ డిపోలో టెక్నీషియన్-1గా పనిచేస్తున్న రాజేంద్ర కుమార్ భార్య బిజిత మంగళవారం ఉదయం 6గంటల ప్రాంతంలో ఇంటి మందు ముగ్గులు వేస్తున్న సమయంలో అటుగా వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకడు బిజిత కళ్లల్లో కారంపొడి చల్లడంతో ఊహించని పరిణామంతో భయభ్రాంతులకు గురైన ఆమె, తేరుకునేలోపే మరో వ్యక్తి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును బలవంతంగా లాక్కుని పారిపోయాడు అని బాధితురాలు బిజిత తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో బాధితురాలికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు బిజితను స్థానిక రైల్వే ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు బిజిత స్థానిక వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది..

### మంత్రి బొత్స సత్యనారాయణ



**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఏపీ విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేసారు. మంగళవారం ఆయన వైకాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం సంక్లిష్ట పరిస్దితుల్లో సైతం రైతులకు అండగా ఉంటుందన్నారు.తడిసిన ధాన్యం ఏ స్దితిలో ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఏ నాడు తన ప్రభుత్వ కాలంలో రైతుల సంక్షేమం గురించి ఆలోచించని విపక్షనేత చంద్ర బాబునాయుడు ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారన్నారు. రైతులపై బూటకపు ప్రేమ చూపిస్తున్నారు. సీఎం జగన్ అకాల వర్షాలకు పంట నష్టపోయిన మాగాణి, మిర్చి, పత్తి, మొక్క జొన్న తదితర పంటలను రైతు కోవాలని ఆదేశాలు జారీచేసారన్నారు. వారికి ఈ నెలలోనే పంట నష్ట పరిహారంతో సహా, తడిసిన పంటల ఉత్పత్తులు కొనుగోలు చేస్తామన్నారు.ప్రకృతి విపత్తులు సంభవించిన సందర్భాలో సీఎం జగన్ రైతులకు అండగా ఉంటున్నారన్నారు. ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో పంటనష్ట పరిహారం అందిస్తున్నారన్నారు. అకాల వానల నేపథ్యంలో రైతులకు నష్ట పరిహారం అందించేందుకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు,వేగవంతంగా పంట నష్టంపై అంచనా జరుగుతుందన్నారు.నష్టపోయిన ఏ ఒక్కరైతును ప్రభుత్వం విడిచి పెట్టదన్నారు. ప్రజల్లో గుర్తింపు కోసం చంద్రబాబు రైతు యాత్ర అంటూ తయారయ్యాడన్నారు.ఆయన డ్రామాలు రైతులునమ్మరన్నారు.అమరావతిలో పేదలకు ఇళ్ళ స్దలాలు ఇవ్వాలన్నదే ప్రభుత్వం ఆలోచ నన్నారు. ఈ విషయంలో సీఎంజగన్ స్దిర చిత్తంతో ఉన్నారన్నారు.అమరావతిలో రైతుల విషయంలో కోర్టు తీర్పునుఅనుసరించి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఏపీ విద్యార్దులందరిని మణిపూర్ నుంచి రాష్టానికి తీసుకుని వచ్చి వారి,వారి స్వస్దలాలకు చేర్చామన్నారు. తాజా విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచే నాటికే పాఠ్యపుస్తకాలను జగనన్న విద్యాకానుకతోపాటు అందిస్తోందన్నారు.



మహాయజ్ఞంకు సిఎంజగన్‌ను ఆహ్వానిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ

## సిఎంకు 'మహాయజ్ఞం' ఆహ్వానం

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఏపీ ప్రభుత్వం- దేవాదాయ ధర్మదాయశాఖ నిర్వహణలో విజయవాడ ఇందిరాగాంధీ నగరపాలకసంస్థ క్రీడా మైదానంలో 'అష్టోత్తర (108)శతకుండాత్మక చండీ. రుద్ర, రాజశ్యామల,సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం' నిర్వహిస్తోంది.ఈ నెల 12 నుంచి17వరకు ఈ మహాయజ్ఞం జరుగుతుంది.ఈ యజ్ఞానికి రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి(దేవాదాయ ధర్మాదాయశాఖ) కొట్టు సత్యనారాయణ,దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ,వేదపండితులు సీఎం జగన్‌ను ఆయన కార్యాలయంలో స్వయంగా ఆహ్వానించారు.వేదపండితులు సీఎం జగన్‌కు వేదాశీస్సులు అందజేసారు. ప్రజలు, ప్రభుత్వ సంక్షేమాన్ని కోరుతూ ఈ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం జగన్ వద్ద ప్రస్తావించారు. ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తుందన్నారు. అయిదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ప్రారంభ క్రతువుకు సీఎంజగన్ సతీసమేతంగా హాజరు కావాలని కోరారు.ఈ యాగానికి హాజరవుతామని సీఎం జగన్ తెలిపారు.ఈ కార్యక్రమానికి అనుసరణగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్ధానం ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి సీఎం జగన్‌ను కలుసుకున్నారు.శ్రీశైలంలో ఈ నెల 25 నుంచి 31 వరకు జరిగే మహారుద్ర శత చండీ వేదస్వాహకార పూర్వక కుంభాబిషేక మహోత్సవం జరుగుతుంది,ఈ కార్యక్రమానికి వారు సీఎం జగన్‌ను స్వయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీశైలం నుంచి వచ్చిన వేదపండితులు సీఎంకు శాస్త్రోకంగా తీర్ధప్రసాదాలను అందించారు.

# మంచుకొండల్లో ఏడుకొండలస్వామి ఆలయం

## జూన్ 8న జమ్మూలో ఆలయ మహాసంప్రోక్షణ





**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దేశవ్యాప్తంగా ఉన్న హిందూ భక్తులు వారివారి ప్రాంతాల్లో అనుకున్నరోజు కొలిచే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయాలను నిర్మిస్తోంది. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రప్రభుత్వాల సహకారంతో అనేకచోట్ల శ్రీవారి ఆలయాల నిర్మాణాలను చేపడుతోంది. ఇప్పటికే మంచుకొండల్లోని జమ్మూలోని మజీన్‌గ్రామంలో ఆ ప్రభుత్వం కేటాయించిన 62 ఎకరాల స్థలంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన స్వామివారి ఆలయం పనులు పూర్తికావడంతో ఆలయ మహాసంప్రోక్షణ వైదిక కార్యక్రమం చేపట్టేందుకు ముహూర్తం ఖరారు చేసింది. జూన్ 8వతేదీ గురువారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు మహాసంప్రోక్షణ,12గంటలకు భక్తులకు ఉచిత దర్శనం ప్రారంభంకానుంది. ఇప్పటికే జమ్మూలోని ప్రసిద్ధ వైష్ణోదేవి ఆలయానికి వేలాది సంఖ్యలో తరలివెళ్ళే భక్తులు జమ్మూ-కాట్రా మార్గంలో ఈ ఆలయం ఉండటంతో, భక్తులు దేవదేవుని దర్శనం చేసుకుని ఆశీస్సులు కూడా అందుకోవచ్చని అన్నారు. ఈ ఆలయం నగరానికి దూరంగా ఉండటంతో 24గంటల పాటు శాశ్వత భద్రతా వ్యవస్థ ఏర్పాటుకు జమ్మూ ప్రభుత్వాన్ని టిటిడి కోరింది.

హిందూ ధర్మప్రచారంలో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో ఆలయాలను టిటిడి నిర్మిస్తోంది. ఇటీవల తమిళనాడు రాష్ట్రం చెన్నైనగరం, విశాఖపట్నం రుషికొండ, భువనేశ్వర్ ,అమరావతి తదితర ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం పూర్తిచేసి ఆయా ప్రాంతాల భక్తులకు మరింత చేరువచేశారు. త్వరలో మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో నవీముంబైలో గోవిందుని ఆలయ నిర్మాణానికి శంఖుస్థాపన పనులు మొదలుపెట్టనున్నారు. అలాగే రాయపూర్, అహ్మదాబాద్‌లలో ఏడుకొండల వాని ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. దేశవిదేశాల నుంచి ప్రతిరోజూ కలియుగవైకుంఠం తిరుమలకు లక్షలాదిమంది భక్తులు విచ్చేస్తున్నారు. ఆ దేవుని దర్శనానికి గంటలగంటల తరబడి నిరీక్షించి ప్రశాంత దర్శనం చేసుకుని తిరుగుముఖం పడుతున్నారు. ఇలా అనుకున్నదే తడవుగా తమకు ఇష్టమైనరోజు తిరుమలకు చేరుకోలేని భక్తులకు ఆయా ప్రాంతాల్లోనే ఆలయాలను నిర్మించి స్వామివారి దర్శనభాగ్యం, సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. తాజాగా జమ్మూలో 30కోట్ల రూపాయలతో శ్రీవారి ఆలయం, ఉప ఆలయాలు,పోటు ఇతర సదుపాయాలు కల్పించారు.

**జూన్ 3నుంచి 8వరకు ప్రత్యేక కార్యక్రమాలు**

జమ్మూలో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ 3వతేదీ నుంచి 8వరకు విగ్రహ ప్రతిష్ఠ,మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించను న్నామని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఆలయంలో జరగనున్న మహాసంప్రోక్షణ కార్యక్రమానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ఆలయంలో మరింత సదుపాయాలు కల్పనపై మంగళవారం జమ్మూలోని టిటిడి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఢిల్లీ ఆలయం స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, జమ్మూఎస్‌పి రాహుల్, టిటిడి సివిఎస్ఒ నరసింహకిశోర్, ఎస్ఇలు సత్యనారయణ, వెంకటేశ్వర్లు, పిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ పరిశీలించారు. త్వరలోనే జమ్మూవా సులకు, భక్తులకు యాత్రికులకు వెంకన్న ఆలయం సందర్శన భాగ్యం కలగనుందన్నారు. జూన్ 8న మహాసం ప్రోక్షణ నిర్వహిస్తామన్నారు.



## పూర్తిస్థాయిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు

### బర్డ్ ఆస్పత్రి అభివృద్ధిపై జెఇఒ సదాభార్గవి

**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా పలు రకాలుగా బాధపడుతున్న వికలాంగులు, మోకీళ్ళనొప్పులు రోగులకు మెరుగైన వైద్యసేవలందించే దిశగా బర్డ్ ఆస్పత్రిలో సదుపాయాలు కల్పిస్తున్నట్లు టిటిడి జెఇఒ సదాభార్గవి తెలిపారు. తిరుపతిలోని బర్డ్‌ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంగళవారం ఆస్పత్రిలో జెఇఒ సదాభార్గవి, బర్డ్ ప్రత్యేక అధికారి డాక్టర్ రెడ్డప్పరెడ్డి, ఇన్‌ఛార్జిడిఎఫ్ఒ, ఎస్వీబిసి సిఇఒ షణ్ముఖకుమార్,ఇఇలు కృష్ణారెడ్డి, మనోహరం, ఎలక్ట్రికల్ డిఇ సరస్వతి, ఆర్ఎంఒ డాక్టర్ కిషోర్,డాక్టర్ వేణుగోపాల్‌తో కలసి సమీక్షించారు. ఆస్పత్రిలో సీటింగ్ ఏర్పాట్లు, ఫలహారశాల, ఆర్వోప్లాంట్, అగ్నిమాపక పరికరాలు, రోగుల సహాయకులకు అన్నప్రసాద పంపిణీ ప్రాంతం పనులను పూర్తిచేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఆస్పత్రికి భద్రతను పెంచాలని ఆదేశించారు.



## ఏడుకొండల్లో పదవరోజు 'సుందరతిరుమల శుద్ధ తిరుమల'

**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలను మరింత పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా సుందర తిరుమల శుద్ధ తిరుమల కార్యక్రమంలో మంగళవారం పదవరోజు పలువురు టిటిడి అధికారులు, ఉద్యోగులు పాల్గొని కొండపై రోడ్లను, పరిసరాలను శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించిన విపత్కర సమయంలో ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తిరుమలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అభినందనీయమని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. హోదాతో సంబంధం లేకుండా అందరూ స్వచ్ఛందంగా క్రమశిక్షణతో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని కొనియాడారు. ఉద్యోగులకు తోడుగా శ్రీవారి సేవకులు ముందుకు వచ్చి పారిశుధ్యసేవలందిస్తున్నారని చెప్పారు. నెలరోజులపాటు ఇలా చేయడం వల్ల ఇతర ఆధ్యాత్మిక సంస్థలకు స్ఫూర్తిగా నిలుస్తామన్నారు. ఇప్పటివరకు పదిరోజుల్లో 5వేలమంది ఉద్యోగులు, 2వేలమంది శ్రీవారిసేవకులు పారిశుధ్య విధుల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు.

## శివయ్య సేవలో సంకటహర చతుర్దశి హోమాలు

**శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి వేసవి సెలవుల సందర్భంగా భక్తుల తాకిడి ఓ మోస్త రుగా ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం సంకట హర చతుర్థశి సందర్భంగా ఆలయంలోని అంజంజి వినాయక ఆలయం వద్ద విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయక ఆలయం మహిమాన్వితమైనది. ఈ ఆలయం మోక్షగోపురానికి పక్కనే వెలసి ఉంది. ఇక్కడ పూజలు నిర్వహిస్తే తమ కోరికలు నెరవేరుతాయనే నమ్మకం ఉంది. మంగళవారం సంకట హర చతుర్థశి సందర్భంగా ' ప్రత్యేక హోమాలు, అభిషేకాలు ఏర్పాటు చేసారు. గతంలో ఇక్కడి ఆలయ మహిమ కొంత మందికి మాత్రమే తెలిసేది. అయితే ప్రస్తుత ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాతో అంజంజి వినాయక ఆలయం వద్ద సంకటహర చతుర్థశి' సందర్భంగా నిర్వహించేపూజలను ' సేవగా ' అమలుచేసారు. దాంతో ఎందరో భక్తులకు ఇక్కడ సంకటహర చతుర్థశి సందర్భంగా హోమాలు, అభిషేకాలు నిర్వహించుకునే అవకాశం లభించింది.ఈ నేపథ్యంలో మంగళవారం సంకట హర చతుర్థశి సందర్భంగా ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొనగా శాస్త్రోక్తంగా కలశ స్థాపన కార్యక్రమాలను ఆలయానికి చెందిన పూజారి ఎస్ఎం కె శ్రీనివాసులు గురుకుల్ సారథ్యంలో శాస్త్రోక్తంగా కలశ స్థాపన గావించారు. తరువాత వందలాది లీటర్ల పాలతో వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించారు. అలాగే హోమగుండం ఏర్పాటు చేసి వేదపండితులు వేద మంత్రాలను పఠి స్తుండగా హోమాలు నిర్వహించారు.ఈ ఆర్జిత సేవలో పట్టణ వాసులు పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. తరువాత పూర్ణాహుతి జరిపించారు. పూజలను శ్రీనివాసులు గురుకుల్ నిర్వహించగా ఏర్పాట్లును సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు, వేదపండితులు హేమంత కుమార్, పరిచారకులు గోవిందస్వామి పర్యవేక్షించారు. ఆలయా ధికారులు, భక్తులు పాల్గొని స్వామి కృపా కటాక్షాలను అందుకున్నారు.



అంజంజి వినాయకు ఆలయం వద్ద సంకట హర చతుర్థశి పూజలు పాల్గొన్న ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు



## తిరుపతి గంగమ్మ మహిమాన్విత తల్లి

### గణపతి సచ్చిదానందస్వామి

**తిరుపతి,మే 9 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి చెల్లెలని, ఆమె తిరుపతిలో తాతయ్యగుంట గంగమ్మగా వెలసి మహిమగల తల్లిగా ప్రజలను కాపాడుతోందని మైసూరు దత్తపీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి తెలిపారు. ఇటీవల గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకం పూర్తిచేసుకుని వారంరోజుల గంగజాతరకు సిద్ధమైంది. గంగమ్మజాతరలో భాగంగా మంగళవారం ఆలయ ఆవరణలోని విశ్వరూపస్థూపానికి విశేష అభిషేకం నిర్వహించారు.అనంతరం గణపతిసచ్చిదానంద స్వామి శిష్యులతో కలసి అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. స్వామివారికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష, ఉపమేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ గోపీ యాదవ్, ఇఒ మునికృష్ణ ,అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకున్న గణపతిసచ్చిదానందస్వామి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర హారతులిచ్చారు. గంగమ్మ మహామహిమాన్వితమైన తల్లిఅని, ఆలయ పునరుద్ధరణ, మహాకుంభాభిషేకంతో తిరుపతినగరం మరింత అభివృద్ధి చెందుతుందని, నగర ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు.

## జూ పార్కులో తెల్లపులి మృతి

**ఆరిలోవ (విశాఖపట్నం), మే 9, ప్రభాతవార్త:** ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో సోమవారం కుమారి అనే తెల్లపులి (19)గత కొంత కాలంగా మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంతో బాధపడుతూ మృతి చెందినట్టు జూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 2004లో జన్మించిన ఈ పులి 2007లో హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శనశాల నుండి వైజాగ్ జూ పార్కుకు తీసుకువచ్చారు. 16 సంవత్సరాల జీవిత కాలంలో మొత్తం 9 తెల్ల పులిపిల్లలకు జన్మనిచ్చింది.

## ఇయర్ బడ్స్ కోసం స్నేహితుడిని తుదముట్టించిన నిందితులు

### గంజాయితో కేసును ముడి పెట్టద్దన్న వైనం

### సామాజిక మాధ్యమాల ద్వారా వాస్తవాలను మాత్రమే ప్రచారం చేయాలని వినతి

### ఆధారాలు లేకుండా అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి జాషువా,ఎన్టీఆర్ జిల్లా సిపి క్రాంతి రాణా టాటాలు

**విజయవాడ క్రైం, మే 9,ప్రభాత వార్త:** పెనమలూరు మండలం, ఎనికేపాడు వద్ద జరి గిన హత్యలో మిస్టరీని పోలీసులు ఛేధించారు. మంగళవారం కృష్ణా జిల్లా ఎస్‌పి జాషువా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటాలు సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెన మలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనికేపాడు, విజయసాయి ఇంజనీరింగ్ కళాశాల వెనుక ఉన్న ఖాళీ మైదానంలో జరిగిన హత్య కేవలం ఖరీదైన ఇయర్‌బడ్స్ కోసం స్నేహితుల మధ్య జరిగిన స్వల్ప వివాదం కారణమేనని పేర్కొన్నారు. ఈ కేసులో హతుడు చెన్నూరి అజయ్ సాయి కేసులోని నిందితులు స్నేహితులు.ఈ నెల 7న రాత్రి సమయంలో సంతోష్ అనే ఒక స్నేహితుని ఇంటి వద్ద వీరంతా కలిసారు. అనంతరం ఇందులో ఒకరైన మణికంఠకు చెందిన ఖరీదైన ఇయర్‌బడ్స్ కనిపించకపోవడంతో వీరు చెన్నూరి అజయ్ సాయిపై అనుమానం వ్యక్తం చేశారు. అతనిని ప్రశ్నించగా ఒకసారి తీసానని, ఒకసారి తీయలేదని పొంతన లేని సమాధానాలు చెప్పడంతో 8వ తేదీ అజయ్ సాయి,అతని ఐదుగురు స్నేహితులు వాటిని వెతకడానికి ఉదయం విజయ ఇంజనీరింగ్ కళాశాల వెనుక ఉన్న ఖాళీ ప్రదేశానికి రమ్మని పిలిచారు. రెండు మూడు చోట్ల వెతికినా ఇయర్ బడ్స్ కనిపించక పోవడంతో వారు అజయ్ సాయిని కొట్టగా అతను అస్వస్థతకుగురయ్యాడు.అనంతరం నిందితులు అక్కడి నుండి ఉడాయించారు. నిందిఉతులైన మణికంఠ,నరాగార్జునలు విజయ హాస్పటల్ నందు ఫిట్స్ కారణంగా రోడ్డుపై స్పృహకోల్పోయిపడిపోయినట్లు పేర్కొని అడ్మిట్ చేశారు. చికిత్స తీసుకుంటూ అజయ్‌సాయి మృతిచెందడంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.పెనమలూరు పోలీసులు అజయ్‌సాయి మృతదేహాన్ని పరిశీలించి అతని స్నేహితులైన నాగార్జున,మణికంఠలను విచారించి వారినుండి వెల్లడైన సమాచారం మేరకు దీనిని హత్య కేసుగా నమోదుచేశారు. ఈ కేసులో మరొక నిందితుడిని కూడ అదుపులోకి తీసుకున్నామని మరో ఇద్దరునిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగానిందితులు మత్తు పదార్థా లను సేవించి ఆఘర్షణలో హత్య చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ఆధారాలు లేకుండా ప్రసారం చేశారని,అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## షణ్ముఖునికి షోడశాభిషేకాలు: భక్తులతో కిట కిట లాడిన ఆలయం

**శ్రీకాళహస్తి,మే 9 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధ్యాత్మిక చింతన వెల్లి విరుస్తుంది.మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి.ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలోవెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం,శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి,ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన ' షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు,తేనే,విభూది,గంధం, కుంకుమ, పసుపు, సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు.చూపరులను ఇట్టు ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్,మురళిలు తీర్చి దిద్దుతున్నారు.

**షణ్ముఖ స్వామి ఆలయానికి పొటెత్తున్న భక్తులు:** శ్రీకాళహస్తి పట్టణంలోనూ, ఆలయంలో పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాలున్నాయి. అయితే తేరువీధిలో ఆలయప్రధానార్చకులు స్వర్గీయ బాబు గురుకుల్స్‌కు చెందిన ఆలయం షణ్ముఖ స్వామి ఆలయం. ఇక్కడ సుబ్రమణ్యం స్వామి ఆరుముఖాలతో వెలసి దర్శనమిస్తున్నారు.ఈ ఆలయం పట్టణ నడిబొడ్డులో ఉండటంతో ఇక్కడకు పట్టణ నలు మూలల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. భక్తులు ప్రతి ఒక్కరు పాలను, పెరుగును అందిస్తున్నారు. వాటితో అభిషేకాలు నిర్వహిస్తున్నారు.ఇక ఇక్కడ స్వాములు నిర్వహిస్తున్న అలంకారాలు ఇట్టే ఆకటుకుంటున్నాయి.ఇక భక్తులు వచ్చిన వారికి దాన ధర్మాలు చేస్తున్నారు. ఇక్కడ వెలసిన వినాయకుడు మహిమాన్వితుడని చెబుతారు. ఉదయం నుంచి రాత్రి 9గంటల వరకు ఈ ఆలయంలో విశేష పూజలు, అలంకారాలు నిర్వహి స్తున్నారు.కాగా ఆలయంలోని రంగుల గోపురం పక్కనే వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి ఆలయాల్లో కణితలు వచ్చిన వారు స్వామికి బెల్లం ముద్దలను నైవేద్యంగా పెట్టి పట్టణ నడిబొడ్డులోని నారద పుష్కరణిలో వేస్తున్నారు. కొన్ని వారాలకు వారికి నయం అవుతుందనే నమ్మకం ఉంది.



షణ్ముఖ స్వామికి ప్రత్యేక అలంకారాలు

## తాతయ్యగుంట గంగమ్మజాతరకు శాస్త్రోక్తంగా వడిబాలు

### నేటి నుంచి వేషాలు



**తిరుపతి,మే9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిపుణ్యక్షేత్రంలో వెలసిన తాతయ్యగుంట గంగమ్మఆలయంలో వారం రోజులపాటు జరిగే గంగజాతరకు తొలిఘట్టంగా మంగళవారం ఉదయం ఆలయంలోని విశ్వరూపస్థూపానికి విశేషఅభిషేకం జరిగింది. జాతర ప్రారంభానికి సూచకంగా అమ్మవారి ప్రతిరూపమైన విశ్వరూపస్థూపానికి పవిత్రజలం, పసుపునీళ్ళు, పాలు,కుంకుమ,కొబ్బరినీళ్ళతో వేదమంత్రోచ్చరణలతో ఆలయ అర్చకులు విశేష అభిషేకం చేశారు. అనంతరం స్థూపాన్ని పసుపు, కుంకుమతో అలంకరించి పూలమాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి కర్పూర హారతులిచ్చారు. ఈ సందర్భంగా గంగజాతర విజయవం తంగా, ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని అమ్మవారిని ప్రార్థిస్తూ విశ్వరూపస్థూపానికి వడిబాలు కట్టారు. భక్తులకు అభిషేకజలం సంప్రోక్షణ చేశారు. గంగమ్మజాతరలో భాగంగా మంగళవారం రాత్రి పుట్టింటి తిరుపతి రూరల్ అవిలాల నుంచి సారె తీసుకువచ్చి చాటింపు వేశారు. బుధవారం ఉదయం నుంచి వారం రోజులపాటు చిన్నపిల్లలు, పెద్దలు, భక్తులు తమకు తోచిన విధంగా వేషధారణలతో అమ్మవారి కృపకు పాత్రులవుతారు.

## హజ్ యాత్రీకులపై అదనపు ఆర్ధిక భారం లేకుండా చూస్తాం

### డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా



**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్ళే హజ్ యాత్రీకులపై అదనపు ఆర్ధిక భారం లేకుండా చూస్తామని తెలిపారు.ఏపీ డిప్యూటీ సీఎం.(మైనార్టీ మంత్రిత్వ శాఖ)అంజాద్ భాషా ఢిలీ నుంచి మీడియాతో మాట్లాడుతూ హజ్ యాత్రికులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.కేంద్రాన్ని మరోసారి పరిశీలించాలని కోరారు.విమాన టిక్కెట్ ధరల్లో ఉన్న వత్యాసం వల్లే ఖర్చు పెరిగిందన్నారు. విమాన టిక్కెట్లు ధరలను తగ్గించని కోరినట్లు వివరించారు. ఎంబార్కేషన్ పాయింట్‌ను విజయవాడ కాకుండా,హైదరాబాద్,బెంగుళూరులకు మార్చమని అడిగామన్నారు.అదనపు ఆర్ధికభారం "హజ్" యాత్రికులు మోయాల్సిన పరిస్దితే వస్తే. విధిలేని పరిస్దితుల్లో ,ఆ మొత్తం ఆర్ధిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాజకీయ పార్టీలు విమర్శలు చేయడం తగదన్నారు. అంజాద్ భాషా విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్ళే యాత్రికులకు ఒక్కొక్కకి రూ.3.88లక్షల ఖర్చు అవుతుందని సెంట్రల్ హజ్ కమిటీ ఆఫ్ ఇండియా,కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా సర్క్యులర్ జారీచేసాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి వెళ్ళే హజ్ యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.3.05లక్షల, బెంగుళూరు నుంచి రూ.3.04లక్షలు నిర్ణయించారు. ఏపీ నుంచి హజ్ యాత్రికులకు ఇది భారం అవుతుందన్నారు. ఈ విషయాన్ని పునఃపరిశీలించాలని పౌర విమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్యసింధియాను కలిసి కోరామని తెలిపారు. విజయవాడ నుంచి 1985 మంది యాత్రి కులు అదనపు ఆర్ధికభారం మోయాల్సి వస్తుందన్నారు. ఏపీ నుంచి వెళ్ళే హజ్ యాత్రికుడు అదనంగా రూ.83వేలు ఖర్చును భరించాల్సి వస్తుందన్నారు. టెండర్లు జారీచేయడం ద్వారానే విమాన టిక్కెట్లు ధరలు నిర్ణయం జరుగుతుందని కేంద్రమంత్రిసింధియా తెలిపారన్నారు. ఎయిర్‌లైన్స్ సంస్థతోను మాట్లాడతామని ఆయన హామీని ఇచ్చారన్నారు. ఈ విషయంపై కేంద్రమంత్రి స్మృతి ఇరానీని కూడా బుధవారం కలువనున్నట్లు తెలిపారు.

## అందరికీ మంచిజరగాలి: తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి



**తిరుమల,మే 9ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగురాష్ట్రాల్లోని ప్రజలతో బాటు తమిళనాడు రాష్ట్రప్రజలకు అంతా మంచి జరగాలని ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళనస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన తిరుమలకు చేరుకుని ఉదయం ఆయన అనుచరులతో కలసి వెంకన్నను దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనంచేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల అఖిలాండం వద్దకెళ్ళి కొబ్బరికాయను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## ఐఎఎస్,ఐపిఎస్ అధికారుల జైలు శిక్షను నిలిపివేసిన హైకోర్టు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** కోర్టు ధిక్కరణ కేసులో ఐఎఎస్ అధికారి కృష్ణబాబు, ఐపీఎస్ ద్వారకా తిరుమల రావుకు విధించిన జైలు శిక్షను జరిమానాను హైకోర్టు నిలుపుదల చేసింది.తదుపరి విచారణను జూన్16కు వాయిదా వేసింది.ఆర్టీసీలో పనిచేస్తున్న ఫీల్డ్‌మెన్ ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు.పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం,వారిని రెగ్యులరైజ్ చేయాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది.అయితే కోర్టు ఆదేశాలను అనుసరించి రవాణాశాఖాధికారులు స్పందించడం లేదని ఫీల్డ్‌మెన్ ఉద్యోగులు తిరిగి న్యాయస్దానం దృష్టికి తీసుకుని వెళ్ళారు.ఆ మేరకు పిటిషనర్లు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాన్ని దాఖలు చేసారు..ఉద్దేశపూర్వకంగా తమ ఆదేశాలను అధికారులు అమలు చేయలేదని హైకోర్టు సింగిల్ బెంచి అభిప్రాయపడింది.ఈ నెల 2న అప్పటి రవాణాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం.తిరుమల కృష్ణబాబు, ఇప్పటి ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమల రావులకు నెల రోజుల జైలుశిక్షను, జరిమానాను విధించింది.ఈ నెల 16లోపున లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది.ఈ ఆదేశాలపై అధికారులు తిరిగి హైకోర్టును ఆశ్రయించి.తీర్పును పునఃపరిశీలించాలని అభ్యర్ధించారు.ఈ రోజు జరిగిన విచారణలో అధికారులకు వేసిన శిక్షను నిలుపుదల చేసింది.

> ఖర్చు పెట్టాక బాధపడే బదులు, ఖర్చు పెట్టడానికి ముందు పడే బాధను బడ్జెట్ అంటారు.
>
> -వాల్


# మేల్కొంటారా?

యువతే జాతి పురోగతికి మూలాధారం. నేటి యువతీయువకులే రేపటి దేశ భవిష్యత్ నిర్ణేతలు. యువజన శక్తియుక్తులే దేశాభివృద్ధికి బాటలంటూ పథకాలమీద పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు జీవనోపాధి, ఉద్యోగాలకల్పన, స్వయం ఉపాధిలాంటి ఎన్నోప్రకటిస్తుంటారు.అందుకోసం లక్షలాది కోట్ల రూపాయలు కేంద్ర,రాష్ట్రాల ప్రభుత్వాలు వెచ్చిస్తూనే ఉంటాయి. అయినా ఆశించిన మేరకు ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లో రోజురోజుకూ నిరుత్సాహం పెరిగిపోతుంది. నిరక్షరాస్యులైన యువకులే కాదు, ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. పట్టణాలు, నగరాల్లో ఉన్న యువజనుల పరిస్థితి అందుకు భిన్నంగా లేదు. కానీ దేశప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి అత్యంత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగ్గట్టుగా ఉపాధి దొరక్కపోయినా జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకోని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.డిగ్రీపోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి గ్రామాల్లో రోజువారీ కూలీలకు వెళ్లలేక, ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశంలో కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. పనిచేసే శక్తిఉంది. ఉన్నంతలో గొద్దోగొప్పో మేధాశక్తిఉంది. కష్టపడి పనిచేయాలనే ఉత్సాహం ఉంది. తమకో స్థానం కల్పించుకోవాలనే తపన ఉంది. అయినా ఏ ఆధారం లేక నిరుత్సాహంతో అర్థాకలితో, అసంతృప్తులతో అల్లాడిపోతున్నారు. ఇకపోతే మెడికల్, ఇంజినీరింగ్ చేసిన మెరికల్లాంటి యువతీయువకులు విదేశాల బాటపడుతున్నారు. లక్షలాది రూపాయలు ప్రజాధనంతో తాము చదువుకున్నామని వారికి కూడా తెలుసు. ఇక్కడ ప్రజల డబ్బుతో చదువుకొని ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించాల్సిన యువతరం ఏదో ఒకరకంగా విదేశాలకు వెళ్లి తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొని అక్కడి ప్రజలకు సేవలు అందించాలని ఆరాటపడుతున్నారు. ఇలా విదేశాలకు వెళ్తున్నవారిలో తెలుగు రాష్ట్రాలే అగ్రస్థానంలో ఉన్నాయని చెప్పొచ్చు. అయితే ఇటీవల కాలంలో రాజకీయపార్టీలు యువతను ఆకర్షించేందుకు అనేక వాగ్దానాలు చేస్తున్నాయి.కానీ ఆ వాగ్దానాలను పరిపూర్ణంగా నెరవేర్చడంలో మాత్రం విఫలమవుతున్నాయి. అందుకే హామీలపై రానురాను యువతలో అంతగా విశ్వాసం కలగడం లేదు. ఏదో ఎన్నికల కోసం, ఓట్ల కోసం ఈ ఆపదమొక్కులు మొక్కుతున్నారనే అభిప్రాయం అధికశాతం యువతలో వ్యక్తమవుతుంది. నిన్న సోమవారం కాంగ్రెస్‌నేత ప్రియాంకగాంధీ ఉపన్యాసం అంతా యువతను ప్రత్యర్థి పార్టీలు మోసగించాయని, తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు అగ్రపీఠం వేస్తామని సభాముఖంగా ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తొలియేడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలతోపాటు నిరుద్యోగులకు నెలకు నాలుగువేల రూపాయలునిరుద్యోగ భృతి కల్పిస్తామని ప్రకటించారు. యేటా జూన్ రెండున అన్నిశాఖల్లోని ఖాళీల వివరాలతో క్యాలెండర్‌ను విడుదల చేసి అదే యేడాది సెప్టెంబరు 17 కల్లా ఉద్యోగాలు భర్తీ చేస్తామని సభాముఖంగా వెల్లడించారు. నిరుద్యోగులకు ఉపాధికి పదిలక్షల రూపాయల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తామని లాంటి ఎన్నో వరాలు కురిపించారు. ఇవన్నీ ఒక ఎత్తైతే తెలంగాణరాష్ట్రంలో పద్దెనిమిదేళ్లు నిండినప్రతి విద్యార్థినికి ఉచితంగా విద్యుత్ స్కూటర్ అందిస్తామని కూడా హామీ ఇచ్చారు. ఈ హామీలన్నింటికి వేదిక మీద ఉన్న కాంగ్రెస్ నేతలందరూ బాధ్యతవహిస్తారని ఆమె సభాముఖంగా ప్రకటించారు. ఒకవేళ అధికారం వచ్చిన ఐదేళ్లలోపల పూర్తి చేయలేకపోతే తిరస్కరించాలని కూడా ఆమె ఆ వేదిక నుండే స్పష్టం చేశారు. నిరుద్యోగుల్లో కాంగ్రెస్‌పట్ల నాయకుల పట్ల విశ్వాసం కల్పించేందుకు తన ఉపన్యాసంలో శక్తిమేరకు ప్రయత్నించారు. హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువసంఘర్షణ సభకు భారీగానే యువజనం హాజరయ్యారు. జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి హైదరాబాద్‌కు వచ్చిన ప్రియాంక గాంధీ కాంగ్రెస్‌శ్రేణులు ఘనంగానే స్వాగతం పలికారు.రాష్ట్ర కాంగ్రెస్‌నేతలందరికీ ముక్కుతాడు వేసి ఒకచోటుకి లాగడం అసాధ్యకాదనే విషయం అందరికి తెలిసినా, ఒకరిద్దరు ముఖ్య నాయకులు తప్ప సోమవారం ప్రియాంక పర్యటనలో అది సాధ్యమైందనే చెప్పొచ్చు. ఆమె ఢిల్లీలో బయలుదేరారని తెలియగానే నాయకులు కొందరు బేగంపేట్ విమానాశ్రయానికిపోతే, మరికొందరు సరూర్‌నగర్ స్టేడియంకు చేరుకున్నారు. అక్కడ వేసిన వేదిక వద్దకు ఆమె రాగానే దర్శనం కోసం సీనియర్లు సైతం వేదిక కిందా,పైనా క్రమశిక్షణగల కార్యకర్తలుగా భక్తివిశ్వాసాలు ప్రదర్శించుకున్నారు. వర్గవిబేధాలు, తోపులాటలు, పోటాపోటీగా హోరెత్తించే నినాదాలన్నీ పక్కకు పెట్టడంతో వాతావరణం హుందాగా కన్పించింది.కాంగ్రెస్ పార్టీకి సంబంధించినంత వరకు ఇది మంచిపరిణామమే. అయితే ఇది తాత్కాలికమేననే సందేహాలు లేకపోలేదు. ఏదిఏమైనా ప్రియాంక గాంధీ సుడిగాలి పర్యటనలో మనసులో ఎలా ఉన్నా తామంతా ఐక్యంగా ఉన్నట్లు కొంతసేపు అయినా కంటికి కన్పించారు.ఇది కాంగ్రెస్ కార్యకర్తల్లో కొంతలోకొంతనూతనోత్సాహానికి నాంది పలికిందనే చెప్పొచ్చు. ఇప్పటికైనా కాంగ్రెసు నేతలు మేల్కొంటారా?వర్గాలు,ముఠాలు,కక్షలు కార్పణ్యాలు,వెన్నుపోట్లు,వదలి సమిష్టిగా ఎన్నికల పోరులో పాల్గొంటారా? నిరుద్యోగ యువత ఏమేరకు ఈ హామీలు విశ్వసిస్తుందో కాలమే నిర్ణయిస్తుంది.

> మేధావులు తమ మేధను చదువుకోవడానికి ఉపయోగించే లాంతరులా కాక, అందరికీ దారి చూపే లైట్‌హౌస్‌లా ఉపయోగించాలి.
>
> 
>
> హెచ్.డబ్ల్యు.బీచర్

> నీతిలేని వాణిజ్యం, కృషిలేని సంపద, శీలం లేని విద్య, త్యాగం లేని ఆరాధన, మానవతలేని శాస్త్ర విజ్ఞానం, నియమనిష్ఠలు లేని రాజకీయం ఇవి సామాజిక దురాచారాలు.
>
> 
>
> గాంధీజీ

## ప్రజావాక్కు



### కరోనా కోరల పదును తగ్గింది

ప్రపంచ ఆరోగ్యసంస్థ కరోనా ఇకఎమర్జెన్సీ అనారోగ్యం కాదంటూ ప్రకటించడం విశేషం.దాదాపు మూడేళ్లకుపైగా ప్రపంచ స్థాయి అత్యయిక వ్యాధిగా కోరలు చాచి దేశాల్ని వణికించిన కరోనా తన స్థాయిని కోల్పోవడం మానవ విజయం. అయితే కోరలు పదును కోల్పోయినా ముప్పు పూర్తిగా తప్పిపోలేదని గుర్తించడంఅవశ్యకం.కరోనా తన మహమ్మారి హోదాని కోల్పోవకపోవడం గమనార్హం.ధనిక, పేద దేశాల తారతమ్యం లేకుండా లక్షలాది ప్రాణాల్ని తోడేసిన కరోనా కోట్లాది కుటుంబాల్ని రోడ్డున పడేసింది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థని చిన్నాభిన్నం చేసింది. అలలు అలలుగా విజృంభించి ఎప్పటికప్పుడు రూపాలు మార్చుకుంటూ ఈ వైరస్ విస్తృతంగా వ్యాపించి ప్రజారోగ్య వ్యవస్థను కుప్పకూల్చింది.అందుకనే గతంలో నేర్చిన పాఠాల్ని దేశాలు, అంటే ప్రభుత్వాలు,ప్రజలు మరువరాదు. ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టం చేసి, సన్నద్ధంగానే ఉండాలి.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### ఇడుపులపాయలో పేదలు లేరా?

రాష్ట్ర రాజధాని అమరావతిని ఎడారి, స్మశానం అని కీర్తించిన పాలకులుఇప్పుడక్కడ భూములు రాష్ట్రంలో పేద వారికందరికీ పంచుతారట! మరి ఇడుపులపాయలో పేదవారికి తమ తాత గారుఆక్రమించిన భూములు తరతరాలుగా అనుభవిస్తున్నారు. ఆ భూములు ముందు అక్కడి పేదవారికి పంచవచ్చు కదా? ఇడుపులపాయలో పేదలుఎవరు? పెత్తందార్లు ఎవరు? అలాగే మూడురాజధానులు అంటున్నవారు విశాఖలో ఆక్రమించుకుంటూ, అమరావతిలో పంచుతారా? అసలు కోర్టులోవ్యాజ్యం నడుస్తుండగా భూములు ఎలా పంచుతారు? రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మాండమస్ ఆర్డర్ అమలు చేయకుండా ఈవిధంగా చేయడం చట్ట విరుద్ధం!

-జి.భారతీ, ఏలూరు, ఏలూరుజిల్లా

### డిపాజిట్‌లకు ప్రత్యేక వెబ్‌పోర్టల్

బ్యాంకు ఖాతాలోని నగదు పదేళ్లుగా లేదా అంతకు ముందు నుంచీ వాడుకలో లేకుండాపోతే దాన్ని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్‌గాపరిగణిస్తారు.బ్యాంకుల్లోని ఈ విధంగా మూలుగుతున్న నగదు ఖాతాదారుల వివరాల సమాచారంతో కూడిన వెబ్ పోర్టల్‌నుప్రారంభించనున్నట్లు ఆర్.బి.ఐతెలిపింది. ఇటు వంటి డిపాజిట్లు పేరుకుపోవడానికి బ్యాంకులు డిపాజిట్లు స్వీకరించినప్పుడే ఖాతాదారుల పూర్తివివరాలు,నామినీ, వారి అడ్రస్‌లు తీసుకోక పోవడమేకాకుండా ఎప్పటికప్పుడు వివరాలను ఖాతాదారులకు లేదా వారి వారసులకు తెలియచేయకపోవడమే.

-డి.జె.మోమన్‌రావు, శ్రీకాకుళం జిల్లా

### జైలుశిక్ష సబబే!

కోర్టు ధిక్కరణ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు జైలుశిక్ష, జరిమానా విధించడం పూర్తిగా సబబే! నిజానికి వారు ఆయా ఉద్యోగాల్లో కొనసాగడానికి అనర్హులు అని చెప్పాలి. సమస్య మూలాల్లోకి వెళ్లితే సామాన్యులకు కోర్టు వరకు రాకుండా న్యాయం చేయాల్సిన అధికారులు కోర్టు తలుపులు తట్టే పరిస్థితి తీసుకువస్తున్నారు.ఆపైన కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించడం,మరలబాధితులు ఆదేశాలు అమలుకోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి. కనీసం కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా అప్పీలుకు వెళ్లడం మరో దుర్మార్గం. ఇలా వేల సంఖ్యలో కోర్టు ధిక్కార కేసులు రాష్ట్ర హైకోర్టులో పరిష్కారంకావలసి ఉంది.కోర్టు ఆదేశాలు అమలుకాక, కోర్టు వరకు రానివి మరిన్ని ఉండి ఉంటాయి? చిన్న చిన్న సమస్యలను కోర్టు వరకు రాకుండా చూడవలసిన పాలకులు, ప్రజాధనాన్ని, కోర్టులసమయాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.

-గరిమెళ్లరామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### ప్రతిపక్ష నేతపై విమర్శలు తగదు

ఆరుగాలం కష్టించి పండించినధాన్యాన్ని కొనే దిక్కులేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రాప్ నమోదు, తేమ, నూక అంటూ రకరకాల ఆంక్షలు పెట్టడంతో రైతులను దళారులు,మిల్లర్లు అడ్డంగా దోచుకున్నారు. ఆపైన అకాల వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడిసి మొలకలు వచ్చి రైతులు పూర్తిగా నష్టపోయారు. అయినా ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి చోద్యం చూస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నేత గోదావరి జిల్లాలో రైతుల వద్దకు రావడంతో మంత్రులు ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇది వాస్తవం.ప్రభుత్వ తీరును అధికారపార్టీ స్థానిక ప్రజాప్రతినిధులే తప్పుపడుతున్నారు.ఇప్పటివరకు కుంటిసాకులు, వక్రభాష్యాలు చెప్పిన మంత్రులు, అధికార యంత్రాంగం యధావిధిగా ప్రతిపక్ష నేతపై ఎదురుదాడికి దిగారు.

-ఉప్పలపాటిరాజా,గంగన్నగూడెం, ఏలూరుజిల్లా

### సగటు మనిషి ఆవేదన తీర్చేదెవరు?

భారత్‌లో ధరలు రికార్డు స్థాయికి పెరిగాయి. అయితే ధరలు ఇలా మండిపోవడానికి గత ప్రభుత్వాల తీరే కారణమని ప్రధాని నరేంద్రమోడీ ఆరోపించారు. ఇంధన దిగుమతుల విషయమై గత ప్రభుత్వాలు తగినంత శ్రద్ధ తీసుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు.మరి ఆర్థికపరిస్థితులు, సంపద సృష్టిలో మా వాటాయేది? మరి మనం ఎక్కడున్నాం? మరి సగటు మనిషి ఆవేదన తీర్చేదెవరు.

-దాసండ్ల పోషమల్లయ్య, జగిత్యాలజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ఆర్థిక విద్యపై అవగాహన అవసరం

**భారతదేశం ఇతర దేశాల మధ్య నెలకొని వున్న ఈ ఆర్థిక అక్షరాస్యత అంతరాన్ని తొలగించడానికి ఆర్థిక విద్యను భారతదేశ విద్యావ్యవస్థలో విలీనం చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అంతేకాకుండా జీవిత ప్రారంభం నుంచి యువతకు ఆర్థిక అవసరాలకు సంబంధించి జ్ఞానం, నైపుణ్యాలు ఉండేలా చూడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. దేశజనాభాలో కేవలం 76 శాతం వయోజనులకు మాత్రమే ప్రాథమిక ఆర్థిక అంశాలలో అవగాహన ఉండడం విదితమే. ప్రస్తుతం మనదేశంలో కేవలం 5.5 శాతం పాఠశాలలు మాత్రమే ఆర్థిక విద్య కోర్సులను అందిస్తున్నాయి.**

**డాక్టర్ కృష్ణకుమార్ వేపకొమ్మ**

భారతదేశం అన్ని రంగాలలో ముందంజ వేస్తున్నప్పటికీ ఆర్థిక సమ్మేళనాన్ని సాధించడంలో కొంతవరకు విఫలమైందని, దీని సాధనకు కీలకమైన ప్రాథమిక ఆర్థిక పరిజ్ఞానం దేశ జనాభాలో ఎక్కువ శాతం మందికి లేకపోవడం, అంతేకాకుండా ఆర్థిక అక్షరాస్యతకు తగినంత ప్రోత్సాహం కల్పించకపోవడం అని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఆర్థిక విద్య అవగాహనాలోపం కారణంగా వ్యక్తులు ఆర్థిక నిర్ణయాలు దృఢంగా తీసుకోలేకపోవడం, వారికి ఆర్థిక సంస్థలపై విశ్వాసం సన్నగిల్లడం, ఆర్థిక చేరికకు ఆటంకం కలిగిస్తున్నాయన్నది పలువురి వాదన. ప్రపంచ సగటు 35శాతంతో పోలిస్తే భారతదేశం ఆర్థిక అక్షరాస్యత రేటు 24 శాతం మాత్రమే ఉంది. యుఎస్, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో వరుసగా 57 శాతం,68 శాతం రెట్లు కలిగి ఉండడం ఆశ్చర్యం. భారతదేశం ఇతర దేశాల మధ్య నెలకొని వున్న ఈ ఆర్థిక అక్షరాస్యత అంతరాన్ని తొలగించడానికి ఆర్థిక విద్యను భారతదేశ విద్యావ్యవస్థలో విలీనం చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అంతేకాకుండా జీవిత ప్రారంభం నుంచి యువతకు ఆర్థిక అవసరాలకు సంబంధించి జ్ఞానం, నైపుణ్యాలు ఉండేలా చూడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. దేశజనాభాలో కేవలం 76 శాతం వయోజనులకు మాత్రమే ప్రాథమిక ఆర్థిక అంశాలలో అవగాహన ఉండడం విదితమే. ప్రస్తుతం మనదేశంలో కేవలం 5.5 శాతం పాఠశాలలు మాత్రమే ఆర్థిక విద్య కోర్సులను అందిస్తున్నాయి. ఆర్థిక విద్య పిల్లలకు బడ్జెట్, పొదుపు, పెట్టుబడి వంటి ప్రాథమిక ఆర్థిక అక్షరాస్యత నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. ఈ నైపుణ్యాలు వారి డబ్బును మరింత ప్రభావంతంగా నిర్వహించడంలోనూ, భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోనడంలోనూ వారికి సహాయపడతాయి. ప్రభుత్వం ఆర్థిక విద్యాబోధనకు మరింత ప్రాధాన్యమిచ్చి అన్నీ పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కొంత ఆర్థిక ఎరిజ్ఞానాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలి. ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడానికి, ఆర్థిక ఉత్పత్తులు, సేవలపై అవగాహన కల్పించడానికి భారత ప్రభుత్వం నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్‌సిఎఫ్ఇ జనాభాలోని వివిధ వర్గాలలో ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం లక్ష్యంగా పనిచేస్తుంది. మహిళలు, గ్రామీణ సంఘాలు, తక్కువ ఆదాయ కుటుంబాలు వంటివారిపై ప్రత్యేక దృష్టిసారించి, వారికి విద్యావనరులు, శిక్షణా కార్యక్రమాలు, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన పరిశోధనలను తెలియచేయడం, అంతేకాకుండా ఆర్థికమోసాలు, వాటి అవగాహనను పెంచడానికి ఈ మిషన్ తోడ్పడుతుంది. ఎన్‌సిఎఫ్ఇ ప్రారంభించిన




కొన్ని కార్యక్రమాలు ముఖ్యంగా నేషనల్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ క్యాంపెయిన్, ఫైనాన్షియల్ లిటరసీ వీక్ ఎంచుకోతగ్గవి. పాఠశాలలకు సంబంధించి ప్రామాణికమైన ఆర్థిక అక్షరాస్యత పాఠ్యాంశాల అభివృద్ధి కూడా ఇందులోభాగమే. దేశవ్యాప్తంగా ఆర్థిక విద్యను ప్రోత్సహించడానికి పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, ఎన్‌జిఒలు వంటి వివిధ వాటాదారులతో కలిసి వారికి సహకరిస్తూ పనిచేస్తుంది. మొత్తం మీద భారతదేశంలోని నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ దేశంలో ఆర్థిక అక్షరాస్యత విద్యను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. వ్యక్తులు సంఘాలు వారి ఆర్థిక విషయాల గురించిన సమాచారం అందించి ఎవరికి వారు నిర్ణయాలు తీసుకునేలా శక్తివంతం చేయడంలోనూ సహాయపడుతుంది. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలతోసహా ప్రైవేట్ రంగ కంపెనీలు ప్రజలకు బడ్జెట్, పొదుపు,పెట్టుబడి, క్రెడిట్ నిర్వహణలను గురించిన అవగాహన కల్పించడానికి వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, ఆన్‌లైన్ కోర్సులను నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలను కూడా చేపట్టడం జరిగింది. డిజిటల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, క్రిప్టోకరెన్సీ పెరుగుదలతో పాఠశాల విద్యార్థులలో ఆర్థిక అక్షరాస్యత ప్రాధాన్యత మరింత పెరిగింది. ఆర్థిక నిర్వహణలు తమకు తామే బలవంతంగా చేసుకునేలా కొవిడ్ మహమ్మారి ఆర్థిక అక్షరాస్యత పాఠాలను నేర్పింది. భారతదేశంలోని ఆర్‌బిఐ, సెబి, ఐఆర్‌డిఎఐ, పిఎఫ్‌ఆర్‌డిఎ వంటి నియంత్రణ సంస్థలు చిన్న వ్యాపారాలలో ఆర్థిక అక్షరాస్యతను మెరుగుపరచడానికి ప్రాధాన్యతనిస్తాయి. ముఖ్యంగా చిన్న చిన్న వ్యాపారాలు, భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివి కాబట్టి ఆర్థిక అక్షరాస్యత కలిగిన చిన్న వ్యాపార యజమానులు ఫైనాన్సింగ్, పెట్టుబడి పెట్టడం, నగదు ప్రవాహాన్ని నిర్వహించడం వంటి లావాదేవీలకు సంబంధించిన నిర్ణయాలు వారే తీసుకోవచ్చు. ఇది మెరుగైన ఆర్థిక ఫలితాలకు దారితీస్తుంది. అదనంగా, ఇది వివిధ ఆర్థిక ఉత్పత్తులు, సేవల నష్టాలను ప్రయోజనాలను అర్థం చేసుకోవడంలో వ్యక్తులకు సహాయపడుతుంది. ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయమైనవి అయినప్పటికీ, భారతదేశంలో ఆర్థిక అక్షరాస్యత స్థాయిలను మరింత మెరుగుపరచడానికి దీర్ఘకాలిక ప్రయత్నం చాలా అవసరం. ఆర్థిక అక్షరాస్యత స్థాయిలను పెంచడం వల్ల పేదరికాన్ని తగ్గించవచ్చు. దేశాభివృద్ధికి అవసరమైన ఆర్థిక వృద్ధిని పెంచవచ్చు. ఏదేమైనప్పటికీ ఈ లక్ష్యాన్ని సాధించడానికి యువకులు తమ ఆర్థిక నిర్వహణ గురించి అవగాహన చేసుకోవడానికి చొరవ తీసుకోవడం, ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో సహాయపడే సమాచార ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ఆర్థిక విద్యను విద్యావ్యవస్థలో చేర్చడం, భారతదేశంలోని పెద్దలకు అందుబాటులో ఉంచడం చాలా కీలకం. ఒక విధంగా చెప్పాలంటే ఆర్థిక అక్షరాస్యత మొత్తం ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా మరింత సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తుంది. ఆర్థిక అక్షరాస్యత అనేది ప్రభుత్వం, ప్రైవేట్‌రంగం, పౌర సమాజం, విద్యాసంస్థలతోసహా బహుళ వాటాదారులతో కూడిన సహకార ప్రయత్నంగా ఉండాలి. ఆర్థిక విద్య సమాజంలో అవసరమైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతో ఉంది. ●

# మణిపూర్ రావణకాష్ఠం చల్లారేనా?

**డా.యం.సురేష్‌బాబు**

రిజర్వ్డు, రక్షిత అడవులు,చిత్తడి నేలలకు సంబంధించి మణిపూర్‌లోని బిజెపి ప్రభుత్వం చేసిన సర్వేపై ఆదివాసీ గిరిజనులు తీవ్ర అభ్యంతరాలు చెబుతున్నారు.అలాగే, రాష్ట్ర ప్రభుత్వం చర్చిలను కూల్చివేస్తోందని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇదే సమయంలో మణిపూర్ జనాభాలో కీలకంగా ఉన్న మైతీలకు ఎస్టీ హోదాపై కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు వివాదానికి మరింత ఆజ్యం పోశాయి. దీంతో ఎనిమిది జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారి ఎక్కడికక్కడ హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. బుధవారం చురచంద్పూర్ జిల్లా టోర్బంగ్ ప్రాంతంలో గిరిజన విద్యార్థుల సంఘం ఆల్ ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ మణిపూర్ భారీ ర్యాలీ చేపట్టింది. ఇంపాల్ లోయలో అధిక సంఖ్యలో ఉండే మైతీ సామాజిక వర్గం తమను ఎస్టీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తోంది. దీనిని వ్యతిరేకిస్తూ ఎటిఎస్యూఎం నిరసన ప్రదర్శన చేపట్టింది. ఈ ఆందోళనకు వేలాది మంది గిరిజనులు హాజరయ్యారు. ఈ ర్యాలీలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణలు చెలరేగి తీవ్రరూపం దాల్చాయి. వీటిని అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయువు గోళాలు ప్రయోగించారు. మణిపూర్ జనాభాలో 53 శాతం ఉన్న ప్రధానంగా మణిపూర్ లోయలో నివసించే మైతీ కమ్యూనిటీని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ అశాంతిని నెలకొల్పింది. కానీ అది కారణం మాత్రమే. అంతర్లీనంగా ఉన్న కోపం, చాలా కాలం పాటు తెగల మధ్య వైరుధ్యాలు అన్నీ కలిసి మణిపూర్‌లో రావణకాష్టానికి దారితీసింది. మండి పడటానికి ఇతర కారణాలున్నాయి. ఇవి రాష్ట్రంలోని కొండ ప్రాంతాల్లో రిజర్వ్ చేయబడిన రక్షిత అడవులపై ప్రభుత్వం నిర్బంధానికి మాత్రమే కాకుండా కుకీల హింసకు గురవుతున్న భావనతో కూడా ముడిపడి ఉంది. మయన్మార్‌లోని సరిహద్దుకు ఆవల ఉన్న ఒకే జాతికి చెందిన అనేక మంది చిన్‌లు, హింస నుండి పారిపోతూ భారతదేశంలోకి ప్రవేశించారు. అక్రమ వలసదారులు అని పిలవబడే వారిపై ప్రభుత్వం కఠినమైన వైఖరి అవలంభించడం కుకీలకు కోపం తెప్పించింది. వారి బంధువులు, మణిపూర్‌లోని కొండల్లోని రిజర్వ్‌డ్ రక్షిత అడవీ ప్రాంతాలను గిరిజన సంఘాలు ఆక్రమించడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. బిజెపి ముఖ్యమంత్రి కఠినమైన వైఖరి వివిధ కారణాల వల్ల ఈ ఘటనలు జరుగుతున్నాయి. కొండల్లోని అనేక ఎకరాల భూములు గసగసాల సాగుకు ఉపయోగించబడుతున్నాయి. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగేయుద్ధంలో భాగంగా అటవీ ప్రాంతాలపై దాని అణచివేతను ప్రభుత్వం చూస్తుంది. అయితే కుకి ప్రజలందరికీ వ్యతిరేకంగా డ్రగ్‌లార్డ్స్ అనే పదాన్ని ఉపయోగించడాన్ని కూడా తప్పుబట్టింది. రెండవది మణిపూర్‌లో భూమిపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. గిరిజన గ్రామాల్లో జనాభా పెరగడంతో వారు తమ చారిత్రక, పూర్వీకుల హక్కుగాభావించే చుట్టుపక్కల అటవీ ప్రాంతాలకు వ్యాపిస్తున్నారు. దీన్ని ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. అదే సమయంలో లోయలలో నివసించే



మెయిటీలు, కొండ ప్రాంతాల్లో స్థిరపడటానికి లేదా భూమిని కొనుగోలు చేయడానికి అనుమతించనందున కోపంతో ఉన్నారు. గిరిజన ప్రజలు లోయలో భూమిని కొనుగోలు చేయవచ్చు. కొత్తగ్రామాలను ఎలా గుర్తించాలనే దానిపై ప్రభుత్వానికి అసలు విధానం లేదు. అలాగే మణిపూర్‌లో పారదర్శకమైన అటవీ విధానం లేదు. దీంతో సొంత పార్టీలోనే దుమారం రేగింది. మణిపూర్‌లో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణల్లో మృతుల సంఖ్యపై అధికారులు తొలిసారిగా ప్రకటన చేశారు. ఈ హింసలో 54 మంది మృతిచెందినట్టు తెలిపారు. అయితే అనధికారిక వర్గాల ప్రకారం ఈ సంఖ్య 100కిపైగా ఉంటుందని తెలుస్తోంది. ఘర్షణలో దాదాపు 200 మందికిపైగా గాయపడినట్టు పేర్కొంటున్నాయి. కాగా చురచందాపూర్ జిల్లా మోర్గే ఆస్పత్రిలో 16, తూర్పు ఇంఫాల్ జిల్లా జవహర్‌లాల్‌నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 15 మృతదేహాలున్నాయి. ఆర్మీ, అసొం రైఫిల్స్ పహారా మధ్య ఇంఫాల్ లోయలో జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంటోంది. శనివారం మార్కెట్లు, దుకాణాలు తెరచుకున్నాయి. భారీ స్థాయిలో రంగంలోకి దిగిన కేంద్ర బలగాలు ప్రధాన రహదారులు, కీలక ప్రాంతాల్లో మోహరించాయి. ఇంఫాల్ లోయలోని తిరుగుబాటుదారులు శిబిరాల్లో చేరితే మైతీ గిరిజన వర్గాల మధ్య పూర్తిస్థాయి సాయుధ పోరాటంగా సంక్షోభం తీవ్రరూపం దాల్చుతుందనే భయాల మధ్య సైన్యం, అసొం రైఫిల్స్ ఫ్లాగ్ మార్చ్‌లను కొనసాగించడంతో శనివారం కొంత సాధారణ స్థితి తిరిగి వచ్చింది. ఇదే సమయంలో భారత్, మయన్మార్ సరిహద్దుల్లో అస్థిర పరిస్థితి నెలకొంది. మణిపూర్‌లో సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ఇది హానికరం అని భద్రతా వర్గాలు వెల్లడించాయి. బుధవారం నుంచి ఉద్రిక్తంగా మారిన మణిపూర్‌లో 10వేల మంది సైన్యం పారామిలిటరీ బలగాలతో పహారా కాస్తున్నారు. ఇప్పటివరకు 13వేల మందిని శిబిరాలకు తరలించినట్లు రక్షణశాఖ ప్రతినిధి వెల్లడించారు. మరోవైపు ప్రజలు శాంతిని పాటించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు. జాతుల మధ్య చర్చలు జరగాలనిఆయన పిలుపునిచ్చారు. చాలా మంది చనిపోయారు. ఆస్తులకు భారీ నష్టం కలిగింది. మైతీలైనా, కుకీలైనా అందరూ ఒక రాష్ట్రానికి చెందిన వారు. శాంతి నెలకొంటేనే సమాజం ముందుకు సాగుతుంది. ఇదే సమయంలో శుక్రవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఐదుగురు మిలిటెంట్లు హతమయ్యారని, ఇద్దరు జవాన్లు గాయపడ్డారని అధికారులు తెలిపారు. తమను షెడ్యూల్డ్ తెగలో చేర్చాలన్న మైతీల డిమాండుకు అనుకూలంగా నాలుగు వారాల్లో కేంద్రానికి సిఫార్సు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మణిపూర్ హైకోర్టు ఆదేశించడంతో హింస చెలరేగింది. మైతీల డిమాండును మైనారిటీలైన కుకీ, నాగా గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. హైకోర్టు ఆదేశాల అనంతరం గిరిజన సంఘాలు నిర్వహించిన ర్యాలీలో ఘర్షణ చెలరేగింది. రెండు వర్గాలు దాడులు, ప్రతిదాడులు చేసుకోవడంతో రాష్ట్రం అట్టుడికిపోయింది. మరోవైపు, మణిపూర్‌లో చిక్కుకున్న తమ పౌరులను తరలించేందుకు విమానాలు నడపాలంటూ తాము చేసిన విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించిందని మిజోరం అధికారి ఒకరు తెలిపారు. దీనిపై కేంద్రం ఇంకా స్పందించలేదు. ●

# మీడియా స్వేచ్ఛలో జోక్యం వద్దు!



**మేకిరి దామోదర్**

భారతదేశంలో గత కొన్ని సంవత్సరాలుగా పౌరులు అనుభవిస్తున్న స్వేచ్ఛక్రమంగా దిగజారిపోతుంది. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛలో అంతర్భాగమైన మీడియా స్వేచ్ఛకు స్వయం ప్రతిపత్తి కల్పించడం జరిగింది. తద్వారా మీడియా స్వతంత్రంగా వ్యవహరిస్తూ వాస్తవాలు చెప్పే హక్కు కలిగి ఉంది. దీన్ని అడ్డుకుంటే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం ఏర్పడనుంది.అందుకే ప్రజాస్వామ్యానికి మీడియా స్వేచ్ఛను నాలుగో స్తంభం (ఫోర్త్ ఎస్టేట్)గా పేర్కొంటారు. ఈ మీడియా స్వేచ్ఛ యాజమాన్యాలకు ఇచ్చింది కాదు. ప్రభుత్వాల, వ్యవస్థీకృత వర్గాల నుండి ఆంక్షలు, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా, సరైన రీతిలో సంపూర్ణంగా వార్తలను సేకరించడం, ప్రచురించడంలో నిజాయితీగా వ్యవహరించాలి. మీడియా పత్రిక స్వేచ్ఛ అటే? దేశ పౌర, రాజకీయ, మత స్వాతంత్ర్య, స్వేచ్ఛ పరిరక్షణ కల్పవృక్షం.ఈ ప్రజా కల్పవృక్షాన్ని ప్రశ్నించడానికి న్యాయస్థానాలకు, చట్టసభలకు కూడా వీలుండదు. ఎంతో విశిష్టతను, స్వతంత్రతను కల్పించారు రాజ్యాంగ నిర్మాతలు. ప్రజలకు వాస్తవాలు తెలిపే హక్కు మీడియాకు ఉంది. కఠిన వాస్తవాలను ప్రజల ముందు ఉంచితేనే వారు సరైన ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసుకుంటారు. అలా మీడియా ఎన్నో సంస్కరణలకు, సామాజిక, రాజకీయ మార్పులకు దోహదపడింది,పడుతుంది. ఈ మధ్య మళయాల వార్త ఛానల్ మీడియా వన్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని తొలగిస్తూ, ప్రజాస్వామ్య మనుగడకు మీడియా స్వతంత్ర ముఖ్యమని సుప్రీం భావించి తీర్పును వెలువరించింది. విమర్శిస్తే ప్రభుత్వ వ్యతిరేకత అంటే ఎలా అన్ని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువైన మీడియా స్వేచ్ఛలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం భావ్యంకాదు. ప్రపంచంలో భారతదేశ స్థానం మీడియా స్వేచ్ఛలో దిగజారిపోతుంది. ప్రభుత్వాన్ని విమర్శించే మీడియా సంస్థలు, స్వతంత్ర మీడియా సంస్థలను సంపాదకీయ వర్గాన్ని, జర్నలిస్టుల మీద ఉగ్రవాదం, రాజద్రోహం లాంటికఠిన శిక్షలకింద తప్పుడు కేసులను బనాయించడమే కాకుండా దాడులు, హత్యలు జరుగుతున్నాయనిహ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. అలాగే ఈ మధ్య అధ్యయనం చేసిన పారిస్‌కు చెందిన స్వతంత్ర ఎన్‌జీఓ రిపోర్ట్ విత్‌ఔట్ బోర్డర్స్ రిపోర్టర్స్ సాన్స్‌రఫాంటియర్స్ అనే సంస్థ రాజకీయ, ఆర్థిక, లెజిస్లే టివ్,సామాజిక భద్రత లాంటి ప్రధాన అంశాలు, మీడియా స్వేచ్ఛ సూచీల మీద 'ప్రపంచ పత్రిక దినోత్సవం మే-3'న నివేదికను విడుదల చేసింది. ఆ మేరకు 21వ ఎడిషన్ వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో ప్రపంచంలోని 180దేశాల్లో భారత్ 2023 సంవత్సరంలో 161 స్థానంతో బలహీన ర్యాంకులో ఉంది. మనకన్న చిన్న దేశాల కన్నా దిగజారిపోవడంతో ఇది ప్రజాస్వామ్య వాదులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇలా గతంలో 2009 సంవత్సరంలో 105వ ర్యాంకులో ఉండేది. 2019 నాటికి దాని పరిస్థితి 140వ ర్యాంకుకు దిగజారిపోయింది. ఆ తరువాత 2020-21 నాటికి భారత ర్యాంకు 142కు, 2022 నాటికి 150వ స్థానానికి పడిపో యింది. తాజాగా 2023కి వచ్చేసరికి ఇంతకన్నా 11స్థానాలు దిగజారి 161వ స్థానానికి కుదేలయింది. మన పొరుగుదేశాలు భూటాన్, నేపాల్ అఫ్ఘానిస్థాన్, మయన్మార్ కన్నా తక్కువ స్థానాల్లో ఉండడం గమనార్హం. నాడు బ్రిటిష్ పాలనలో పాశ్చాత్య మీడియా వలస దోపిడీని సమర్థించడం జరిగింది. వారి దోపిడీకి ఆకృత్యాలకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భారత జాతిప్రయో జనాలను కాపాడుకోవడం కోసం భారతీయ మీడియా ఏర్పడింది. పత్రికా రంగంలో నాడు ఎలాంటి సౌకర్యాలు, స్వేచ్ఛలేని నిర్బంధ కాలంలో స్వాతంత్రోద్యమ ఆకాంక్షను, ఉద్యమ భావజాల వ్యాప్తికై భారత జాతిని చైతన్యపరుచుటకు సొంత ఆస్తులు అమ్ముకొని అష్టకష్టాలు పడి పత్రికలను నడిపినారు. ఆనాడు మన మీడియా స్వాతంత్రోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. దేశ స్వాతంత్ర్యానికి నిస్వార్థంగా మీడియా పని చేసింది. ఆ తదనంతరం గత మూడు దశాబ్దాల నుండి ప్రపంచీకరణలో భాగంగా పెట్టుబడిదారీ విధానాలు పాలనలోకి మనదేశంలో ప్రవేశించడంతో ప్రజాప్రయో జనాలు కాపాడాల్సిన మీడియా కార్పొరేట్ ప్రయోజనాలకు వత్తాసు పలుకుతుంది. అయినా నేటికీ పత్రిక విలువల కోసం నిబద్ధతతో వ్యవహరిస్తూ, పాలకుల నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న పత్రికా సంస్థలు చాలానే ఉన్నాయి. ప్రజల కోసం రాజ్యాంగం ప్రసాదించిన మీడియా స్వేచ్ఛను కాపాడుతుంది. వారి ఆకాంక్షలకు, ఆశయాలకు కట్టుబడి రాస్తున్నాయి. వినిపిస్తున్నాయి. మీడియా స్వేచ్ఛను అడ్డుపెట్టుకొని కార్పొరేట్ మీడియా చేసే అసత్యప్రచారాలు ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా కీర్తించబడుతున్నవేళ రాజ్యాంగబద్ధంగా ప్రజాపాలన సాగించాల్సిన చట్టసభలు పదవీ ప్రమాణాలకు కట్టుబడి మీడియా స్వేచ్ఛలో తలదూర్చకుండా సంక్షేమ, శ్రేయోరాజ్యంగా పాలన అందించాలి. లేదంటే నాటి బ్రిటిష్ పాలకులను నేటి ప్రజాపాలకులు మించిపోతున్నారనే అపకీర్తిని మోయాల్సి వస్తుంది. మనదేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికై పరితపించిన ఆనాటి ఉద్యమ నాయకుల భారత జాతి ఆకాంక్షలైన సమభావన, భావప్రకటనా స్వేచ్ఛ, పౌర స్వేచ్ఛలను పరిరక్షించాలి. పౌర సమాజం ఆకాంక్షల్ని పాలకుల ఆకృత్యాన్ని చెప్పని చూపని మీడియా ఉన్నా ఒకటే లేకున్నా ఒక్కటే అన్ని ప్రజాస్వామ్యవాదులు భావిస్తున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా సరే భావ ప్రకటనా స్వేచ్ఛను, మీడియా స్వేచ్ఛను హరించడానికి, విమర్శలను తొక్కిపట్టడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. వాస్తవంగా నిర్మాణాత్మక విమర్శలు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటివి. చాలా అవసరం. ప్రజల భావవ్యక్తీకరణ హక్కును పరిరక్షించడం, ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు ఉండాల్సిన అతి ముఖ్యమైన లక్షణం. మన రాజ్యాంగం పౌరులకు ఆ భరోసా నిస్తుంది. అందుకే మీడియా స్వేచ్ఛ దిగజారడం వలన పౌర సమాజం గతి ఏమవుతుంది? కావున పాలకులు వెంటనే నిర్బంధం, ఒత్తిడి లేని ప్రజాజీవనానికి పాటుపడుతూ మీడియా స్వేచ్ఛ పరిరక్షణలో ప్రపంచంలోనే అగ్రభాగాన నిలవాలి. ●

# మధ్యప్రదేశ్ బాటలో యోగి సర్కార్
## ది కేరళ స్టోరీకి పూర్తిగా పన్ను మినహాయింపు

**లక్నో, మే 9:** ట్రైలర్ విడుదలైనప్పటి నుంచే ది కేరళ స్టోరీ సినిమా వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాపై పలు రాష్ట్రాల్లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతుండగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో మద్దతు లభిస్తోంది. తాజాగా, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ సినిమాకు పన్ను మినహాయింపు నిస్తున్నట్లు ప్రకటించింది. ది కేరళ స్టోరీ సినిమాపై ఉత్తరప్రదేశ్‌లో పన్ను రహితం చేస్తున్నాం అని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ట్వీట్‌చేశారు. యోగి ఆదిత్యనాథ్ సహా ఆయన క్యాబినెట్ మంత్రులు కోసం సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ఇప్పటికే ఈ వివాదాస్పద చిత్రానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇచ్చింది. దీంతో పన్ను రహితంగా ప్రకటించిన మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ చిత్రానికి పన్ను రహితంగా ప్రకటించే అవకాశం ఉంది. ఆ రాష్ట్ర సిఎం ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ప్రకటన చేసారని తెలుస్తోంది. డెహ్రాడూన్‌లోని పివిఆర్ మల్టీప్లెక్స్ ఆయన సినిమాను చూసే అవకాశం ఉంది. ఆయనతో పాటు క్యాబినెట్ మంత్రి గణేష్ జోషి కూడా పాల్గొననున్నారు. మరోవైపు, సినిమా విడుదలను ఆపేయాలని పలువురు కేరళ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా స్టే విధించేందుకు నిరాకరించింది. ట్రైలర్‌లో ఏ ఒక్క వర్గానికి అభ్యంతరకరమైన అంశాలు లేవని పేర్కొంది. సినిమా ప్రదర్శనకు వ్యతిరేకంగా కేరళ రాష్ట్రంలోని వివిధ యువజన సంఘాలు ప్రదర్శనలు నిర్వహించాయి. తమిళనాడులోని మల్టీప్లెక్స్ థియేటర్లు ఆ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని పేర్కొంటూ మే 7 నుంచి కేరళ స్టోరీ ప్రదర్శను నిలిపివేశాయి. బెంగాల్ ప్రభుత్వం కూడా ఈ సినిమాను నిషేధించింది.

# మీ ప్రేమాభిమానాలు నాకు దేవుని ఆశీస్సులు



### కర్ణాటక ఓటర్లకు ప్రధాని
## మోడీ బహిరంగ లేఖ

**న్యూఢిల్లీ, మే 9:** అసెంబ్లీఎన్నికల పోలింగ్‌కు ముందురోజు ప్రధాని మోడీ కర్ణాటక ప్రజలకు బహిరంగ లేఖ రాసారు. ఆదేవిధంగా తనకు ఆశీస్సులు అందజేసినట్లు కర్ణాటకప్రజలంతా ఎంతో ప్రేమాభిమానాలుచూపించారని ఆజాదీకా అమృత్‌కాల్‌సమయంలో మన భారత దేశాన్ని అభివృద్ధిచెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. కర్ణాటక ప్రజలకు అభివృద్ధిపట్ల పూర్తిస్థాయిలో అవగాహన ఉందని పేర్కొన్నారు పార్టీ అంకితభావంతో కర్ణాటక అభివృద్ధికి పనిచేస్తుందని,ప్రజల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. కోవిడ్‌మహమ్మారి సమయంలోకూడా కర్ణాటకకు 90వేల కోట్ల వార్షిక పెట్టుబడులు వచ్చాయని, బిజెపి ప్రభుత్వంలో మాత్రమే ఇది సాధ్యం అయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 వేల కోట్లు మాత్రమే పెట్టుబడులు వచ్చాయన్నారు. పెట్టుబడులపరంగా కర్ణాటకను నంబర్‌వన్ స్థాయికి తీర్చిదిద్దుతామని, పెట్టుబడులు, పారిశ్రామికరంగం, సృజనాత్మక ఐటీరంగంలోను ప్రథమ స్థానానికి తెస్తామన్నారు. అలాగే విద్యారంగం, ఉపాధిరంగం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలనుప్రోత్సహించడంలోకూడా కర్ణాటక ముందడుగు వస్తుందని ఆయన అన్నారు. మొత్తం 5.2 కోట్లమంది ఓటర్లలో కర్ణాటకలో ఈసారి 9.17 లక్షలమంది మొదటిసారి ఓటుహక్కునువినియోగించుకుంటున్నారు. గ్రామీణ,పట్టణ మౌలికవసతులపరంగా సమస్యలనుపరిష్కరిస్తూ రవాణారంగం, ఉపాధి రంగాలు వృద్ధిచెందాలన్నారు. బిజెపి ప్రభుత్వం నిరంతరం భావితరం మౌలికవసతులను కల్పించేందుకు ఎంతోకృషిచేస్తుందన్నారు. రవాణారంగాన్ని ఆధునీకరిస్తుందన్నారు. గ్రామీణ,పట్టణప్రాంతాల్లోకూడా ప్రజల జీవనశైలిని మార్చేదిశగాకృషిచేస్తామని చెప్పారు. మహిళలు,యువతకు ఉపాధి అవకాశాలు మరింతపెరుగుతాయన్నారు. కర్ణాటకలో ప్రతి పౌరుని కలలు తనవిగానే భావిస్తానని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల్లో బిజెపి 224 మంది అభ్యర్థులను పోటీకి దించింది. కాంగ్రెస్ 223 మందిని పోటీకి దించితే జెడిఎస్ 207 మందిని పోటీలో ఉంచింది. మొత్తం అన్ని నియోజకవర్గాలకు పదవ తేదీ పోలింగ్ జరుగుతుంది. 13వ తేదీ ఓట్లలెక్కింపుతో ఫలితాలను వెల్లడిస్తారు.

# హైకోర్టు ఆవరణలోనే మాజీ ప్రధాని ఇమ్రాన్ అరెస్టు

**ఇస్లామాబాద్, మే 9:** పాకిస్తాన్ మాజీ ప్రధాని పిటిఐ అధినేత ఇమ్రాన్‌ఖాన్‌ను మంగళవారం ఇస్లామాబాద్‌హైకోర్టు ఆవరణలోనే అరెస్టుచేసారు. గత ఏడాది ఆయన పదవినుంచి ఉద్వాసనకు గురయిన తర్వాత డజన్లకొద్దీకేసులు ఆయనపై పెండింగ్‌లోఉన్నాయి. 70 ఏళ్ల మాజీ ప్రధానమంత్రిని కోర్టు ఆవరణలోనే పోలీసులు, మిలిటరీ అదుపులోకి తీసుకున్నారు.పారామిలిటరీ సిబ్బంది భారీ స్థాయిలో కోర్టు ఆవరణలోకి వచ్చారు.పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ తమ అధినేతను అరెస్టుచేయడంపై తీవ్రనిరసన వ్యక్తంచేసింది. అంతేకాకుండా కోర్టు ఆవరణలోకి పోలీసులు ప్రవేశించడాన్ని తప్పుపట్టింది. గదికి ఉన్న అద్దాలను పగులగొట్టారని, ఇమ్రాన్ బయోమెట్రిక్ డేటా తీసుకునే గదిని కూడా ధ్వంసంచేసారని ఆరోపించారు. గదినుంచి ఇమ్రాన్‌ను బయటికి లాక్కుని వచ్చి అరెస్టుచేసి ప్రత్యేకవాహనంలో తరలించారు. అయితేప్రస్తుతం ఇమ్రాన్‌ఖాన్‌ను మాత్రం ఖాదిర్‌ట్రస్ట్‌కేసులో అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు. కోట్లాదిరూపాయల విలువైన భూమిని బహ్రియా పట్టణంలో అల్‌ఖాదిర్‌ట్రస్టుకు కేటాయించారని, ఈ ట్రస్టు పిటిఐ ఛైర్మన్ ఇమ్రాన్‌ఖాన్ ఆయన భార్యకు చెందినదని ఇస్లామాబాద్‌పోలీసులు ఉర్దూలో ట్వీట్‌చేసారు. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణల ఆధారంగానే ఆయన్ను అరెస్టుచేసామని పోలీసులు వెల్లడించారు. కోర్టు ఆవరణపరిసరాల్లో సెక్షన్ 144ను విధించారు. పిటిఐ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలుచేసేనా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. దేశ అంతర్గత వ్యవహారాలమంత్రి సనావుల్లా ఇమ్రాన్‌ఖాన్ కోర్టు ఎదుట హాజరయ్యేందుకు విఫలం అయ్యారని, అనేకసార్లు నోటీసులు జారీచేసినా ఆయన హాజరుకాలేదని అందువల్లనే నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో ఆధ్వర్యంలో అరెస్టుచేసారని, దేశ ఖజానాకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడినందువల్లనే ఆయన్ను అరెస్టుచేసినట్లు తెలిపారు. ఆయన అరెస్టుచేయగా ఎలాంటి హింస జరగలేదన్నారు. కోర్టును వీడే క్రమంలో ఇమ్రాన్‌ఖాన్ వీడియోను కూడా విడుదలచేసారు. గతంలో ఐఎస్‌ఐకి చెందిన ఒక సీనియర్ అధికారిపై ఇమ్రాన్ నిరాధారమైన ఆరోపణలుచేయడాన్ని ఆదేశ ఆర్మీ తీవ్రంగా ఖండించింది. ఐఎస్‌ఐ అధికారి మేజర్‌జనరల్ ఫైసల్ నసీర్‌కు తనపై జరిగిన హత్యాప్రయత్నాల్లో ప్రమేయం ఉందని ఆరోపించారు. వజీరాబాద్‌లో తనపై హత్యాయత్నం సంఘటనలో ఆయనప్రమేయం ఉందని ఇమ్రాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఐఎస్‌ఐ చీఫ్ తనను రెండుసార్లు హత్యచేసేందుకుకుట్రచేసారని ఆ ర్యాలీలో ఇమ్రాన్ ఆరోపించారు. అర్షద్‌షరీఫ్ హత్యకేసులో ఆయన ప్రమేయం ఉందని, తన పార్టీ సెనేటర్ ఆజమ్ స్వాతిని నగ్నంగా చేసి క్రూరంగా హింసించారని పిటిఐ చీఫ్ ఆరోపించారు. ఈనెల ఏడోతేదీ లాహోర్‌లో జరిగిన ర్యాలీలోనే ఇమ్రాన్ తన వాహనంపైనుంచి ర్యాలీలో ఆర్మీ చీఫ్, ఐఎస్‌ఐ చీఫ్, షరీఫ్‌ప్రభుత్వంపైనా తీవ్రస్థాయి విమర్శలుచేసారు. సెక్యూరిటీ ఏజెన్సీలనుండే తనకు ప్రాణహాని ఉన్నదన్న భయంతో టీవీ యాంకర్ అర్షద్‌షరీఫ్ కెన్యాకు పారిపోయినా గత ఏడాది అక్టోబరులో కెన్యాలోనే హత్యకు గురయ్యాడని ఐఎస్‌ఐ చీఫ్‌ప్రమేయం ఉందని ఆరోపించారు. ఇటీవలికాలంలోనే ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కూడా పలుసార్లు అరెస్టునుంచి తప్పించుకున్నారు. లాహోర్‌లోని జమన్‌పార్క్ నివాసంపై పోలీసుల దాడినుంచి కూడా త్రుటిలో తప్పించుకున్నారు. పాకిస్తాన్ మిలిటరీ రేంజర్స్ ఇమ్రాన్‌ను చుట్టుముట్టి సాయుధ వాహనంలో ఎక్కించుకుని తరలించుకుని పోతున్న వీడియోలు సోషల్‌మీడియాలో హల్‌చల్‌చేసాయి. తమ అధినేతను క్రూరంగా లాక్కుని వెళ్లారని, తీవ్ర గాయాలయ్యాయని ఆరోపించారు. ఆయన్ను 15 నిమిషాలకే ఇస్లామాబాద్ హైకోర్టు చీఫ్‌జస్టిస్ అమీర్ ఫరూక్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి, అదనపు అటార్నీజనరల్, పోలీస్ చీఫ్‌లు 15 నిమిషాల్లోపు తనముందు హాజరుకావాలని ఆదేశించినట్లు పాకిస్తాన్ డాన్‌పత్రిక వెల్లడించింది. కోర్టుకు హాజరయ్యి ఇమ్రాన్‌ను ఎందుకు అరెస్టుచేసారో వివరణ ఇవ్వాలని, ఏకేసులో ఇమ్రాన్‌ను అరెస్టుచేసారన్నది తెలియాలని జస్టిస్‌ఫరూఖ్ ఆదేశించినట్లు పత్రిక ఉటంకించింది. ఇస్లామాబాద్ హైకోర్టు ఆవరణ మొత్తం పాకిస్థాన్ రేంజర్స్ ఆక్రమించుకున్నట్లుగా ఉందని న్యాయవాదులను హింసించారని, ఇమ్రాన్ ఖాన్ కారునుసైతం చుట్టుముట్టారని పిటిఐ నేత ఫవద్‌చౌదరి ఆరోపించారు. ఇమ్రాన్‌ఖాన్ న్యాయవాదిగా చెపుతున్న ఒక వ్యక్తిని తీవ్రంగా గాయపరిచారని, కోర్టు ఆవరణలోనే గాయపరిచినట్లు పిటిఐ ఆరోపించింది. దేశప్రజాసామ్యవ్యవస్థలో ఇదొక దుర్దినమని పిటిఐ వ్యాఖ్యానించింది.



# కర్ణాటకలో ఎన్నికల ఎఫెక్ట్
## ఒకేసారి 5,500 బస్సులు మాయం




**బెంగళూరుప్రంగళూరు, మే 9:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మే 10వ తేదీన జరగనుంది. మే 13వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల అధికారులు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇన్ని రోజులు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న 5,500 బస్సులు మాయం అయ్యాయి. బెంగళూరు నగరంతో పాటు కర్ణాటకలో మొత్తం 224 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోలింగ్ జరుగుతోంది. ప్రతి నియోజక వర్గంలో పలు ప్రాంతాల్లో పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఎన్నికల అధికారులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు విధులు నిర్వహించడానికి అన్ని ఏర్పాటు చేశారు. ఒక ప్రాంతంలో ఉన్న అధికారలు, పోలీసులను మరో ప్రాంతంలో విధులు నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇవిఎం యంత్రాలు, ఎన్నికల అధికారులు, పోలీసులు పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి పిలుచుకుని వెళ్లి వారిని మళ్లీ స్ట్రాంగ్ రూమ్‌లకు పిలుచుకుని రావడానికి ఎన్నికల అధికారులు కెఎస్‌ఆర్‌టిసి, బిఎంటిసి బస్సులు వారి ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రతి రోజు రోడ్ల మీద వివిధ ప్రాంతాల్లోని ప్రయాణికులను తరలిస్తున్న 5,500 బస్సులు ఎన్నికల విధుల కోసం పంపించడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కోసం కెఎస్‌ఆర్‌టిసి బస్సులు 3,700, బెంగళూరు సిటీలో నిత్యం సంచరించంప 1,868 బస్సులు ఎన్నిక విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, పోలీసులను తరలించడానికి తీసుకున్నారు. కర్ణాటకలో రెండు రోజుల పాటు కెఎస్‌ఆర్‌టిసికి చెందిన 46శాతం బస్సులు, బెంగళూరులోని 28శాతం బిఎంటిసి బస్సులను రెండు రోజులు ఎన్నికల విధుల కోసం తీసుకోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# పార్టీ ఎలా నడపాలో మాకు తెలుసు: పవార్ కౌంటర్

**పుణె, మే 9:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి వారసుడిని తయారు చేయడంలో శరద్ పవార్ విఫలమయ్యారంటూ ఉద్ధవ్ వర్గానికి చెందిన శివసేన చేసిన విమర్శలకు పవార్ తనదైన శైలిలో బదులిచ్చారు. అలాంటి వ్యాఖ్యలను తాము పట్టించుకోబోమంటూనే పార్టీని ఎలా నడపలో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. ఈమేర విలేకరులతో ఆయన మంగళవారం మాట్లా డారు. ఎన్సీపీలో ఇటీవలి చోటు చేసుకున్న పరిణామాలపై శివసేన (ఉద్ధవ్ వర్గం) అధికారిక పత్రిక సామ్నాలో సోమవారం ఓ సంపాదకీయం వెలువడింది. పార్టీ వారసుడి ఎంపికలో ఆయన విఫలమయ్యారని పేర్కొంది. పవార్ రాజీనామా తర్వాత ఏర్పాటైన జంబో కమిటీలో బిజెపితో కలిసి వెళ్లాలనుకునే నాయకులూ సభ్యులుగా ఉన్నారని తెలిపింది. అయితే ఎన్సీపి శ్రేణుల నుంచి ఒత్తిడి కారణంగా ఆ కమిటీ పవార్‌కే మళ్లీ బాధ్యత అప్పగించాలని నిర్ణయించిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో సామ్నా సంపాదకీయంపై పవార్‌ను విలేకరులు ప్రశ్నించగా ఆయన స్పందించారు. పార్టీ నాయకత్వం గురించి ఎవరో ఏదో రాస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదు. రాయడం వారి హక్కు విస్మరించడం మా పని. మేమేం



చేస్తున్నామనే విషయంలో మేం సంతృప్తిగా ఉన్నాం. పార్టీని ఎలా నడపాలో, నాయకత్వాన్ని ఎలా రూపొందించాలో మాకు తెలుసు. ఎవరో చెప్పే వాటిని పట్టించుకోం అని పవార్ వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీల మధ్య అన్ని విషయాల్లో 100శాతం పొంతన ఎప్పుడూ ఉండదని, కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలు ఉంటాయని అవేవీ మహావికాస్ అఘాడిపై ప్రభావం చూపవని పేర్కొన్నారు.



## రాహుల్‌గాంధీకి ఢిల్లీ యూనివర్సిటీ నోటీసులు!

**న్యూఢిల్లీ, మే 9:** ఎఐసిసి మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఢిల్లీయూనివర్సిటీ నోటీసులు పంపించింది. అనుమతులు లేకుండా భవిష్యత్తులో వర్సిటీ క్యాంపస్‌లోకి ప్రవేశించవద్దని నోటీసు పంపించినట్లు సీనియర్ అధికారులు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు యూనివర్సిటీ హాస్టల్‌లో కొందరు విద్యార్థులను కలుసుకోవడంపై వర్సిటీ తీవ్రంగాపరిగణించింది. మంగళ,బుధవారాల్లో ఈనోటీసులను పంపించనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ వికాస్ గుప్తా వెల్లడించారు. ఈతరహా పర్యటనలవల్ల విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని, సరైన ప్రోటోకాల్‌ను కూడా పాటించాలని, విద్యార్థులతో ముఖాముః నిర్వహించేందుకు వర్సిటీ అధికారిక ప్రోటోకాల్‌ను పాటించాలని సూచించింది. గత శుక్రవారమే రాహుల్ వర్సిటీలోని పోస్టుగ్రాడ్యుయేట్ మెన్స్ హాస్టల్‌ను సందర్శించి కొందరు విద్యార్థులతో ముఖాముః నిర్వహించి వారితోనే భోజనంచేసారు. రాహుల్‌పర్యటన అనధికారికమని ఇలాంటి పర్యటనలను సహించబోమని మేం నోటీసు జారీచేస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు. అయితే కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐ రిజిస్ట్రార్‌చర్యలను తీవ్రంగా ఆక్షేపించింది. ప్రభుత్వ ఒత్తిడితోనే వర్సిటీ అధికారులు ఈచర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమపై ఎలాంటి వత్తిడి లేదని, క్రమశిక్షణలోభాగంగా మాత్రమే వ్యవహరిస్తామని రిజిస్ట్రార్ స్పష్టంచేసారు. రాహుల్ పర్యటన జరిగిన వెంటనే వర్సిటీ యాజమాన్యం నోటీసుబోర్డులో ఎలాంటి అక్రమ అనుమతి లేనిప్రవేశాలను ఉపేక్షించబోమని ఇలాంటివాటివల్ల విద్యార్థుల భద్రతతోపాటు వచ్చిన నాయకుని భద్రతకుసైతం ముప్పు వాటిల్లుతుందని అన్నారు.

# 'కీలక మలుపు వద్ద ప్రపంచం'
## విక్టరీ డే సందర్భంగా పుతిన్ వ్యాఖ్యలు

**మాస్కో, మే 9:** రష్యాకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాలు యుద్ధాన్ని ప్రారంభించాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ ప్రపంచం కీలక మలుపు వద్ద ఉందని అన్నారు. మంగళవారం విక్టరీ డే సందర్భంగా మాస్కోలోని రెడ్‌స్క్వేర్ వద్ద జరిగిన పరేడ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా యేటా విక్టరీ డే' మే 9న రష్యా ఘనంగా నిర్వహిస్తుంది. 'ప్రస్తుతం ఈ ప్రపంచం ఒక కీలక మలుపు వద్ద ఉంది. మన మాతృభూమికి వ్యతిరేకంగా ఒక అసలైన యుద్ధాన్ని ప్రారంభించారు' అని పుతిన్ తీవ్ర ఆరోపణలుచేశారు. ఈ యుద్ధంలో రష్యా విజయం సాధించాలని పిలుపునిచ్చారు. మనం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని తరిమికొట్టాం. డాన్‌బాస్ ప్రాంత ప్రజలకు రక్షణగా కల్పిస్తాం. అలాగే ఉక్రెయిన్‌లో సైనిక చర్యలో భాగమై నందుకు గర్వంగా ఉంది అని అన్నారు. అంతేకాకుండా హుర్రే అంటూ పరేడ్‌లో పాల్గొన్న సైనికులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా భారీ స్థాయి సైనిక కవాతు నిర్వహించారు. గత యేడాది ఫిబ్రవరి నుంచి ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం జరుగుతోంది. రోజుల్లో ముగుస్తుందనుకున్న ఈ యుద్ధానికి యేడాది దాటింది. దీంతో ఇరువైపులా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తున్నాయి. అయినా దీనికి ముగింపు మాత్రం కనిపించడం లేదు. ఈ సమయంలోనే ఇటీవల రష్య అధ్యక్షుడి నివాస, కార్యాలయ భవనాలున్న క్రెమ్లిన్‌పై డ్రోన్ల దాడియత్నం జరిగింది. వాటిని గుర్తించిన పుతిన్ సేన ముందుగానే ఆ డ్రోన్లను పేల్చివేసింది. ఇది ఇరువైపులా తీవ్ర వ్యాఖ్యలకు దారితీసింది. క్రెమ్లిన్ ఘటనవెనుక అమెరికా హస్తం ఉందని రష్యా ఆరోపించింది. మరోపక్కో విక్టరీ డే ముందు ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసింది.



# ప్రపంచ దేశాల్లో 68.79 కోట్లకు పెరిగిన బాధితులు
## 68.71 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, మే 9:** ప్రపంచదేశాల్లోకరోనా కేసులు పెరుగుతున్నాయి. చిన్నదేశాల్లో మరింతగా కలవరం వ్యక్తం అవుతోంది. మంగళవారం నాటికి మొత్తం 68.79 కోట్లమందికి కరోనాసోకి 68.71 లక్షలమంది చనిపోయారు. మరో 38,977 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 66.03 కోట్లకుపైగ ఆనమోదుకాగా మరో 2.07 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.90 కోట్లకుపైగా కరోనా కేసులుంటే వారిలో 20.55 లక్షలమందిచనిపోయారు. మరో 6333 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.49 కోట్లకుపైగా ఉన్నాయి. మరో 2.07 కోట్లమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే కొనసాగుతున్నారు. ఉత్తరఅ మెరికా దేశాల్లో మొత్తం 12.63 కోట్లకుపైగా కరోనా కేసులునమోదుకాగా వారిలో 16.30 లక్షలమందిచనిపోయారు. మరో 6267 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.21కోట్లకుపైగా నమోదుకాగామరో 25.60 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాడుతున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం కరోనా బాధితులు 21.69 కోట్లకుపైగా నమోదుకాగా వారిలో 15.45 లక్షలమందిచనిపోయారు. మరో 15,612 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 20.07 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.46 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.86 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 13,.54 లక్షలమందిచనిపోయారు. మరో 10,128 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది.

# గుజరాత్‌లో ఇప్పటికీ తెలియని 2124 మంది మహిళల ఆచూకీ

**అహ్మదాబాద్, మే 9:** గుజరాత్‌లో మొత్తం 41,621 మంది మహిళల ఆచూకీ తెలియడంలేదన్న సంచలన వార్తలతో గుజరాత్‌పోలీసుల్లోకలకలం బయలుదేరింది. ఒక ఆంగ్లపత్రిక వెలువరించిన కథనంపై ప్రభుత్వానికి మద్దతుగా పోలీస్‌శాఖ రక్షణగా నిలుస్తూ ఇప్పటివరకూ 39,497 మంది ఆచూకి గుర్తించామని, వారు తిరిగి వచ్చినట్లు ప్రకటించింది. అయితే 2124 మంది మహిళల ఆచూకీ ఇప్పటికీ మిస్టరీగానే ఉందని, పోలీసులు వారి ఆచూకీని గుర్తించలేనిపరిస్థితి నెలకొందని వెల్లడించింది. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికీ 2021, మరియు 2022 సంవత్సరాల మహిళల మిస్సింగ్ డేటాను ప్రకటించలేదు. 2016 నుంచి 2020 మధ్యకాలంలో మొత్తం 41,621 మంది మహిళలు అదృశ్యం అయ్యారని, వారిలో ఇప్పటివరకూ 39,497 మంది ఆచూకిని గుర్తించామని పోలీసులు ప్రకటించారు. వారందరినీ కూడా వారి కుటుంబాలతో కలిపామన్నారు. కుటుంబ కలహాలు, లేవదీసుకుపోవడం, పరీక్షల్లో ఫెయిల్ కావడం వంటి అంశాలతోనే ఎక్కువమంది మహిళల ఆచూకీ లభించడంలేదన్నారు. జాతీయ క్రైమ్‌రికార్డుల బ్యూరో డేటాప్రకారం 2016లో 7105మంది, 2017లో 7712 అలాగే 2018లో 9246, 2019సంవత్సరంలో 9268 మంది మహిళలు అదృశ్యం అయినట్లు ప్రకటించింది.

# ఒక్కరోజులో కరోనా కేసులు 1327, మృతులు 11
## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,49,72,800

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే9:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 1327 కేసులు నమోదయ్యాయి. మృతి 11 మంది. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,49,72,800కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,44,18,351మంది కోలుకోగా 22,742మంది దేశంలోని వివిద ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,31,707చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.77 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.18శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,67,595కి చేరగా,80,17,530మంది వరకు కోలుకున్నారు.1,48,538మంది ప్రాణాలు కోల్పోయారు.కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 69,01,014కి చేరింది.




# కెనడా, చైనా మధ్య దౌత్యయుద్ధం
## టొరంటో రాజకీయాల్లో బీజింగ్ జోక్యం !

**బీజింగ్, మే 9:** చైనా, కెనడా మధ్య సంబంధాలు నానాటికీ దిగజారుతున్నాయి. ఇరు దేశాలు దౌత్యయుద్ధానికి దిగుతున్నాయి. తమ దేశానికి చెందిన ఎంపిపై నిఘా పెట్టారనే ఆరోపణలతో చైనా దౌత్యవేత్తను కెనడా బహిష్కరించగా, డ్రాగన్ అందుకు ప్రతీకారం తీర్చుకుంది. షాంఘైలోపని చేస్తున్న కెనడా దౌత్యవేత్తను చైనా బహిష్కరించింది. ఝూవోవెయ్ బహిష్కరణను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ ప్రకటించింది. టోరంటో చర్యకు ప్రతిగా షాంఘైలోని కెనడా కాన్సులేట్ జనరల్‌లో రాయబారిగా పని చేస్తున్న జెన్నీఫర్ లిన్ లాలోండేను బహిష్కరించింది. మే 13లోగా తమ దేశాన్ని విడిచి వెళ్లాలని జెన్నీఫర్‌ను చైనా ప్రభుత్వం ఆదేశించింది. చైనా, కెనడా మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా దిగజారుతున్నాయి. కెనడాలో చైనా ప్రాబల్యం పెరుగుతుండటం పట్ల ఆందోళనలు తలెత్తుతున్నాయి. కెనడాలో 2019,2021ల్లో జరిగిన ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు చైనా ప్రయత్నించిందనే ఆరోపణల పట్ల జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. లాలోండేను బహిష్కరిస్తామని బీజింగ్ ప్రకటించిన కొద్ది గంటలకే విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి కెనడా ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కెనడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమ దేశం దృఢంగా, బలవంతంగా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు. కెనడా మీడియా, కొంతమంది రాజకీయ నాయకులు తప్పుడు సమాచారాన్ని రూపొందించారని ఆరోపించారు. ప్రతిపక్షానికి చెందిన చట్టసభ సభ్యుడు మైకెల్ చోంగ్‌తో పాటు చైనాలోని ఆయన బంధువులను చైనా దౌత్యవేత్త లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారని కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ గుర్తించింది. దీనిపై స్పందించాలని కెనడా ప్రభుత్వంపై ప్రజల నుంచి ఒత్తిడి తీవ్రమైంది. దీంతో ఝూవోను కెనడా తమదేశం నుంచి బహిష్కరించింది. ఉయ్ఘుర్ ముస్లింల పట్ల చైనా వ్యవహరిస్తోన్న తీరును ఖండిస్తూ చోంగ్ కెనడా పార్లమెంట్‌లో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఆయన్ను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తమ అంతర్గత వ్యవహారాల్లో ఏ విధంగాను విదేశీ జోక్యాన్ని సహించబోమని కెనడా విదేశాంగ మంత్రి మెలనీ జోలే వ్యాఖ్యానించారు. దౌత్యవేత్తలు ఎవరైనా ఇలాంటి ప్రవర్తనను కనబరిస్తే వారిని వెనక్కి పంపిస్తామని హెచ్చరించారు. కాగా కెనడాలో రాజకీయ జోక్యం ఆరోపణలు చైనా మరోసారి ఖండించింది. చైనా, కెనడా సంబంధాలు గత కొన్నేళ్లుగా క్షీణిస్తున్నాయి. 2018లో చైనాకు చెందిన మహిళా వ్యాపారవేత్త మెంగ్ వాంఝౌను కెనడా అరెస్ట్ చేయగా అందుకు ప్రతిగా చైనా ఇద్దరు కెనడీయులను అదుపులోకి తీసుకుంది. మాజీ దౌత్యవేత్త కోవ్రిగ్, వ్యాపారవేత్త అయిన మైఖెల్ స్పావోర్‌ను చైనా తిరిగి వెళ్లడానికి 2021లో అనుమతిచ్చింది. కెనడాలో భారీ సంఖ్యలో చైనా సంతతి ప్రజలు నివసిస్తున్నారు. వీరి సాయంతో తమ రాజకీయాల్లో చైనా జోక్యం చేసుకుంటోందని ఆరోపణలు తలెత్తుతున్నాయి. చైనా జోక్యం పెరుగుతుండటం కెనడా ప్రభుత్వానికి, ప్రధాని జస్టిస్ ట్రూడోకు సంకటంగా మారింది.

# ఒక్క మామిడి పండు ధర రూ.1900 - జపాన్‌లో ప్రకృతి సాగుతో కొత్త మామిడి

**టోక్యో, మే 9:** మామిడి ఉత్పత్తిలో జపాన్‌రైతు కొత్తచరిత్ర సృష్టించాడు. మైనస్ 8 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే వాతావరణంలో మామిడిని పండించి అందరి దృష్టి తనవైపు తిప్పుకోగలిగాడు. హొక్కైడో ద్వీపంలోనితోకచి ప్రాంతానికి చెందిన హిరోయుకి నకగావా అనేరైతు 2011నుంచి మామిడిసాగుచేస్తున్నారు. గడ్డకట్టే చలి వాతావరణంలో గ్రీన్‌హౌస్ లోపల 36 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా ఏర్పాట్లుచేసి మామిడితోటలు పెంచాడు. అక్కడ పండిన ఒక్కొక్క పండును ప్రస్తుతం 230 డాలర్లకు విక్రయిస్తున్నాడు. అంటే భారత కరెన్సీ లో 19వేల రూపాయలు అన్నమాట. సుస్థిర వ్యవసాయంలో ఆతడుచేసిన ప్రయోగం ఒక్కరోజున ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మామిడిని ఉత్పత్తిచేస్తుందని భావించలేదు. ఒక పెట్రోలియం కంపెనీని నడిపిన నకగావా తాను వ్యవసాయం చేస్తానంటే ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. హొక్కైడోలో నేను ప్రకృతిసహజమైన ఉత్పత్తులనే సృష్టించాలని నిర్ణయించినట్లు చెప్పాడు. మియాజాకి దక్షి ప్రిఫెక్చర్‌కు చెందిన మరొక మామిడిరైతు మార్గదర్శకత్వంలో శీతాకాలంలో మామిడి పండించడంకూడా సాధ్యమేనని నిరూపించాడు. నోరావర్క్స్ జపాన్ పేరుతో స్టార్టప్ వ్యవసాయ క్షేత్రాన్ని స్థాపించి తన మామడిబ్రాండ్‌నుహకుగిన్ నో తైయోగా అంటే మంచుసూర్యడు బ్రాండ్‌గా మార్చి పండించాడు. నకగావా సాగురహస్యం మంచు వేడినీటి బుగ్గలు రెండు సహజవనరులను మాత్రమే వినియోగించాడు. శీతాకాలంలో మంచును నిల్వచేసి వేసవిలో తన గ్రీన్‌హౌస్‌లను చల్లబరిచేందుకు ఉపయోగిస్తున్నాడు. దీనివలన లపండ్లు ఆలశ్యంగా పక్కావనికి వస్తాయి. గ్రీన్‌హౌస్‌ను వేడిచేయడానికి సహజమైన వేడినీటి బుగ్గలు ఉపయోగిస్తాడు. సీజన్‌లో సుమారు ఐదువేల మామిడి పండ్లనుపండిస్తున్నట్లు తెలిపాడు. 2014లో ఇసేటాన్ డిపార్టుమెంటల్‌స్టోర్‌లో తన మామిడిపండును ప్రదర్శనకు ఉంచితే 400 డాలర్లకు అమ్ముడుపోయిందని, ఒక్క మామిడిపండుకు కళ్లుచెదిరే ధర పతాక శీర్షికలకు ఎక్కి అందరి దృష్టిని ఆకర్షించింది. ఇపుడు నకాగవా క్లయింట్లలో మామిడిపువ్వులకేకులలో పండ్లను ఉపయోగించే ఆసియాస్ బెస్ట్ ఫిమేల్‌చెఫ్ నాట్సుకో షోజి వంటి రెస్టారెంట్‌లు కూడా ఉన్నాయి. విదేశాల్లోకూడా వందలాదికస్టమర్లు ఉన్నారు. హాంకాంగ్‌ల్నోఇ సిటీసూపర్ వంటి అత్యాధునిక రిటైలర్లకు తన మామిడి పండ్లను ఆయన సరఫరాచేస్తున్నాడు. శీతాకాలంలో వ్యవసాయం వల్ల ఆయన ఊహించని విధంగాప్రనయోజనాలు పొందుతున్నట్లు తెలిపాడు. మామిడి టీకోసం ఒక ప్రముఖ కంపెనీ లుపిసియా తనను సంప్రదించిందని నకగవా చెప్పాడు. శీతాకాలంలో టోకాచిని పండ్ల ఉత్పత్తికేంద్రంగా మార్చేందుకు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహాన్ని అందించడానికి అదేపద్ధతిని ఉపయోగించి ఇతర ఉష్ణమండల ఉత్పత్తులనెంచాలని లక్ష్యంగాపెట్టుకున్నాడు. వెచ్చని వాతావరణంలో వృద్ధిచెందడానికిప్రసిద్ధిచెందిన పండ్లను సాగుచేయాలని నిర్ణయించాడు.



# విశ్వనగరంగా ముందుకు దూసుకెళ్తోన్న హైదరాబాద్

## రూ. 985కోట్ల ఖర్చుతో స్ట్రాటజిక్ నాలా అభివృద్ధి కార్యక్రమం

### అత్యాధునిక వసతులున్న వైకుంఠధామాన్ని ప్రారంభించిన ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్

### అద్భుతమంటూ అధికారులకు ప్రశంసలు



**హైదరాబాద్ (బేగంపేట), మే 9, ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరం విశ్వ నగరంగా మరింత అభివృద్ధి చెందుతున్నదని, ముఖ్యమంత్రి కెసిఆర్ విజన్‌తో భాగ్యనగర అభివృద్ధి మరింతగా కొనసాగుతోందని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారాకరామారావు అన్నారు. మంగళ వారం కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ పరిధిలోని ధనియాల గుట్టలో నూతనంగా నిర్మించిన వైకుంఠధామం (శ్మశాన వాటిక)ను మంత్రి కెటిఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. సుందరంగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన వైకుంఠధామంలోని ప్రతి ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. హైదరాబాద్ నగరంలో నాలాల అభివృద్ధికి రూ. 985 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ప్రతి యేటా వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టా మన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదగాలంటే ఫ్లైఓవర్లు, మెట్రో సౌకర్యాలు, తాగునీటితోపాటు చక్కటి వాతావరణాన్ని అందించే శ్మశాన వాటికలు సైతం అవసరం అని అన్నారు. గతంలో జూబ్లీహిల్స్‌లో మహాప్రస్థానం ఉండేదని, నేడు హైదరాబాద్ నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో వైకుంఠధామాల నిర్మా ణాన్ని ప్రారంభించి పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్‌లో హిందూ, క్రిస్టియన్, ముస్లిం మతాల కోసం ఒకేచోట ఏర్పాటు చేసామని మంత్రి కెటిఆర్ చెప్పారు.

హైదరాబాద్ నగరంలో వరదముంపు ముప్పు తట్టుకునేలా నాలాల అభివృద్ధికి రూ. 985 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి అన్నారు. అదే విధంగా ఆగస్టు 15నాటికి హైదరాబాద్ నగరంలో మురుగును పూర్తిగా శుద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం 3800కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందని మంత్రి ప్రకటించారు. మౌలికవసతుల కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదని ఆయన అన్నారు.

అలాగే ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ ఈ మధ్యకాలంలో హైదరాబాద్ నగరం సందర్శించి న్యూయార్క్‌లా ఉందని అభిప్రాయం వ్యక్తం చేసారని, అలాగే అమెరికాలో నివసిస్తున్న సినీనటి లయ ఈ మధ్య కాలంలో హైదరాబాద్ నగరాన్ని సందర్శించి లాస్‌ఏంజెల్స్‌లా మారిందన్న కితాబు ఇచ్చారని మంత్రి వెల్లడించారు. పల్లె, పట్టణ ప్రగతిలో తెలంగాణా ప్రభుత్వానికి అవార్డులు గెల్చుకుం టున్నదని, ఇది తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. మంచి నాయకులు, మంచి ప్రభుత్వాన్ని ప్రజలు కాపాడుకోవాలని, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభివృద్ధి కోసం అహర్నిశలు తపిస్తుంటాడని, అలాంటి నాయకుడికి ప్రజలు అండగా ఉండి కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు.

త్వరలోనే డబుల్‌బెడ్ ఇళ్లను పంపిణీ చేయనున్నామన్నారు. ప్రజారవాణాను మరింతగా మెరుగు పరుస్తున్నా మన్నారు. హైదరాబాద్ నగరాన్ని ఈ స్థాయిలో నిలబెట్టిన ఈ ప్రభు త్వాన్ని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి కెటిఆర్ కోరారు. కార్యక్రమంలో మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ముఠాగోపాల్, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభిపూర్ రాజు, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, కూకట్‌పల్లి నియోజక వర్గంలోని అన్ని డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్న సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క తదితరులు

## భూములను దోపిడీ చేస్తున్న కెసిఆర్ సర్కార్‌ను గద్దె దింపుతాం

### పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సిఎల్పీ నేత భట్టి విక్రమార్క

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మే 9, ప్రభాతవార్త:** గత కాంగ్రెస్ పాలనలో పేదలకు, రైతులకు ఇచ్చిన భూములను దోపిడీ చేస్తున్న బిఆర్ఎస్ ప్రభు త్వాన్ని గద్దె దింపుతామని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్యాయానికి గురవుతున్న ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోల్పోయిన భూములను, ఇంటి స్థలాలను ప్రజలకు తిరిగి పంపిణీ చేస్తామని ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్ మార్చ్ పేరిట భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర మహేశ్వరం నియోజకవర్గానికి చేరుకుంది. 54వ రోజు పాదయాత్ర మంగళవారం నియోజకవర్గంలోని జిల్లెలగూడ నుండి ప్రారంభమై మీర్‌పేట్, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్, నాదర్‌గుల్‌ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదలకు, రైతులకు ఇచ్చిన భూముల వివరాలను నియోజకవర్గాల వారీగా లెక్కలు తీస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 25 లక్షల కోట్ల విలువ చేసే ప్రజల భూములను కెసిఆర్ ప్రభుత్వం బలవంతంగా లాక్కున్నదనీ ఇది అతిపెద్ద కుట్ర అని ఆయన అభివర్ణించారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఫార్మాసిటీ కోసం రైతులకు చెందిన 500 ఎకరాల భూమిని బలవంతంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుందనీ మరో 400 ఎకరాలు బఫర్ జోన్‌లో పెట్టి ప్రజలకు అన్యాయం చేసిందని భట్టి ఆరోపించారు. ప్రభుత్వం బలవంతంగా గుంజుకున్న భూముల్లో బాధితులతోనే దున్నిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన అతివేగం

### ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 9 ప్రభాతవార్త :** అతి వేగంతో బైక్‌పై వెళుతూ డివైడర్ ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భూత్పూర్‌కు చెందిన ఆనంద్ (26) తన వ్యక్తిగత పని నిమిత్తం మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అమిస్తాపూర్ వద్ద ఉన్న తన సోదరి నాగమణి (26), మేనత్త వెంకటమ్మ అలియాస్ లక్ష్మమ్మ (60)లు భూత్పూర్‌కు బబయలుదేరారు. భూత్పూర్ మున్సిపల్ హైసూనకల్ వద్ద తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా యూటర్న్ ఉండగా బైక్ అతివేగంగా రావడంతో అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆనంద్ తల డివైడర్‌ను ఢీకొట్టడంతో నుజునుజ్జుగా మారింది. ఘటనా స్థలానికి సిఐ రజితారెడ్డి, ఎస్సై భాస్కర్‌రెడ్డిలు చేరుకుని మృతదేమాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ రజితారెడ్డి మాట్లాడుతూ అతివేగం వల్లేప్రమాదం జరిగిందని బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం కూడా ఇందుకు కారణమని పేర్కొన్నారు. వాహనదారులు నిదానంగా ప్రయాణించాలని సూచించారు.

## బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం

### పిల్లలను చూడకుండా పదేళ్లుగా అక్కడే ఉద్యోగం

### ఇంటికొచ్చిన గంటలోనే కొడుకు మృతితో విషాదం



శివకార్తిక్ (ఫైల్)

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందుల వల్ల కుటుంబ పోషణకై చౌట్‌పల్లి మోహన్ గల్ఫ్ వెళ్లి డబ్బు సంపాదించుకొని వద్దామని వెళ్లి పది సంవత్సరాలు అక్కడే ఉండి ఇంటి కొచ్చిన గంటలోనే కొడుకు మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నా యి. తండ్రి తన కొడుకు పుట్టిన రెండేళ్లకే ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్ వెళ్లాడు. పదేళ్ల పాటు అక్కడే ఉండి ఒక్కసారి కూడా ఇంటి ముఖం చూడలేదు. కుటుంబ వ్యవహారాలు,పిల్లల బాగోగులు ఫోన్‌లో మాట్లాడి తెలుసుకునేవాడు చాలాకాలం నిరీక్షణ పూర్తయ్యాక ఎట్టకేలకు ఇంటికి బయటు దేరాడు. కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టుకు వచ్చి ప్రేమతో ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికెళ్లిన తర్వాత తాగడానికి నీరు లేకపోవడంతో నీటి డబ్బా తీసుకొస్తానని బైక్‌పైవెళ్లిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయాడు. విగత జీవిగా పడి ఉన్న కొడుకుని చూసి తండ్రి కుప్పకూలి పోయాడు. ఈ ఘటన జగిత్యాలలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన చౌట్‌పల్లి మోహన్, పద్మిని దంపతులకు కుమార్తె హర్ష, కుమారుడు శివకార్తిక్ (12) ఉన్నారు. తండ్రి మోహన్ ఉపాధి నిమిత్తం పదేళ్ల క్రితమే సౌదీ అరేబియా వెళ్లారు. సోమవారం ఆయన గల్ఫ్ నుంచి స్వదేశానికి తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టుకు వెళ్లి తోడ్కొని వచ్చారు. ఇంట్లో తాగునీరు అయి పోవడంతో తాను తీసుకొస్తానని శివకార్తిక్ ద్విచక్రవాహనంపై వెళ్లాడు. బైపాస్ రహదారిలోని దేవిశ్రీ గార్డెన్ సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు .తీవ్రగాయాలవడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యం లోనే చనిపోయాడు. పదేళ్ల తర్వాత తన కొడుకును చూసుకున్న ఆ తండ్రి ఆనందం అంతలోనే మాయమైపోయిందని అంతా కంటతడి పెట్టారు.

## మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి లైంగిక వేధింపులు దేశానికే అవమానం




ప్రదర్శనలో పాల్గొన్న సిపిఐ నేతలు అజీజ్ పాషా, సాంబశివరావు, వెంకట్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 9, ప్రభాతవార్త:** ఒలింపిక్, కామన్వెల్త్ పోటీలలో పతకాలను సాధించి భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి బ్రిజ్‌భూషన్‌శరన్‌సింగ్ లైంగిక వేదింపులకు పాల్పడటం దేశానికి అవమానకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అగ్రహాం వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషన్ వంటి నిందితులను కాపాడుతూ న్యాయకోసం పోరాడుతున్న మహిళా క్రీడాకారులను అవమానపరుస్తూ బిజెపి దేశ పరువు ప్రతిష్టలను దిగదార్చు తున్నదని వారు ధ్వజమెత్తారు. గత కొన్ని రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న రెజ్లర్లులకు సంఘీభావంగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్ నుంచి హిమాయత్‌నగర్‌లోని వైజంక్షన్ వరకు మంగళవారం ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే బ్రిజ్‌భూషన్‌ను అరెస్టు చేయాలని, మహిళా రెజ్లర్లుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మైనర్‌తోసహా 7గురు రెజ్లర్లుపై లైంగిక వేధింపులకు పాల్పడిన శరణ్‌సింగ్ విషయంలో బిజెపి కేంద్ర నాయకత్వం ఎందుకు మౌనంగా ఉంటుందని వారు ప్రశ్నించారు. రెజ్లర్లుకు న్యాయం జరిగేంతవరకు సిపిఐ దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, టి.శ్రీనివాస్‌రావు, శంకర్, ఎన్.బాలమల్లేష్, ఇటి నరసింహా , పశ్య పద్మ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాల్‌రాజ్, ఎం.డి.యూసఫ్, బి.హేమంత్‌రావు, ఎస్.ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆయన నోటికి అడ్డూ.. అదుపు లేదు!

### పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన మంత్రి తలసాని

**హైదరాబాద్ (బేగంపేట), మే 9, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం నూత నంగా నిర్మించి ప్రారంభించిన సచివాలయంపై విపక్షాలు బిఆర్ఎస్ సర్కారుపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. మంగళవారం బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ ధనియాలగుట్టలో రూ 8కోట్ల 54లక్షలతో అత్యా ధునికంగా నిర్మించిన వైకుంఠధామాన్ని మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి తలసాని మాట్లాడుతూ తీవ్రపదజాలంతో ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. సెక్రటేరియట్ అనేది ఈ రాష్ట్ర పౌరులందరికీ సంబంధించిన విషయం.. ఈ రాష్ట్రంలోని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం, అందించాలంటే సచివాలయమే కేంద్ర స్థానం. పాత సెక్రటేరియట్ స్థానంలో నూతన భవనాన్ని నిర్మిస్తామంటే ఆరోజు (విపక్షాలు) ఎన్ని గొడవలు చేసారో అందరికీ తెలుసు. కోర్టులను కూడా ఆశ్రయించారు. ఈ రోజు వీరంతా సచివాలయంలోకి మేం కూడా వస్తాం అంటారు. అని నిప్పులు చెరిగారు. ఇది అద్భుతమైన సెక్రటేరియట్ అని, చూస్తే అమెరికాలోని వైట్‌హౌస్ చూడాలి. లేకపోతే తెలంగాణలో మన సచివాలయాన్ని చూడాలి అని తలసాని అభివర్ణించారు. రాజ్యాం గాన్ని తెలంగాణలో అమలు చేస్తున్నామని, సచివాలయానికి కూడా అంబేద్కర్ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో తలసాని టీపీసీసీ చీఫ్ రేవంత్‌పై ఘాటైన పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేసారు. నిన్న ఆమె(ప్రియాంక గాంధీ) వచ్చింది. ఆమె ఒక డిక్లరేషన్ ఇచ్చింది. ఆ పొట్టివాడు డిక్లరేషన్ గురించి మాట్లాడుతాడు. ఆయన నోటికి అడ్డు అదుపు లేదు. ఎమ్మెల్యే, మంత్రి లేదు. అందరి గురించి అవాకులు, చవా కులు మాట్లాడుతాడు అంటూ రేవంత్‌రెడ్డి గురించి పరుషంగా మాట్లా డుతూ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించారు. ఇంకొకరు మతాల మధ్య చిచ్చుపెట్టేలా ప్రవర్తిస్తున్నారు. వీరు మాకు బొట్టు పెట్టుకోవడం నేర్పు తారా? వారు సొంతంగా ఏమైనా ఆలయాలు నిర్మించారా? మతాల మధ్య, కులాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపు కోవాలని చూడటం దారుణమైన చర్య అన్నారు. చేసిన అభివృద్ధి ఏమి లేనపుడే ఇలా రెచ్చగొడుతుంటారని, ప్రజలకు అభివృద్ధి ఎవరూ చేస్తున్నారన్న విషయం ఇప్పటికే పూర్తిగా అర్ధమైందని, ప్రజలు అలాంటి పగటి వేషగాళ్లను నమ్మరని తలసాని అన్నారు.

## కార్పొరేట్‌కు దీటుగా తార్నాక ఆర్టీసి ఆస్పత్రి

### ● అందుబాటులోకి మరో 25 ఐసియు పడకలు: ఎండి విసి సజ్జనార్



తార్నాక ఆర్టీసి హాస్పిటల్‌లో ఆపరేషన్ థియేటర్లను ప్రారంభిస్తున్న ఎండి విసి సజ్జనార్

**హైదరాబాద్ (తార్నాక), మే 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల ఆరోగ్యానికి సంస్థ పెద్ద పీట వేస్తూ కార్పొరేట్ హాస్పిటల్‌ళ్లకు ధీటుగా ఆసుపత్రిలో సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీఎస్‌ఆర్టీసీ ఎండి వీసి సజ్జనార్ పేర్కొన్నారు. తార్నాక ఆర్టీసీ హాస్పిటల్లో నూతనంగా నిర్మించిన 4సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు 15 బెండ్ల మెడికల్, 10 బెడ్ల సర్జికల్ ఐసీయూలను మంగళవారం ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ థియేటర్లలోని వైద్య పరికరాలను పరిశీలించి హాస్పిటల్లో సిబ్బందికి అందుతున్న వైద్య సేవలను డాక్టర్లతో అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్య సంక్షేమంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించించడంతో పాటు సంస్థ అభ్యున్నతి దిశగా తీసుకెళ్లడానికి అందరి సహకారంతో ముందుకు వెళ్లుతున్నానని వెల్లడించారు. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో కూడిన 4సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో మద్ద తుతో 25 ఐసీయూ బెడ్లతో పాటు అవసరమైన పరికరాలను సమకూ ర్చుకుం టున్నామని చెప్పారు. ఈ ఆసుపత్రిపై గతంలో చాలా ఫిర్యాదులు వచ్చేయని నేడు ఆ పరస్థితిలేకపోవడం మంచి పరిణామం అన్నారు.

**ఉద్యోగుల ఆరోగ్యం కోసం**

**హెల్త్ వలంటీర్ల వ్యవస్థ: ఎండి సజ్జనార్**

తార్నాక ఆర్టీసీ హాస్పిటల్లో ఉద్యోగుల సౌకర్యం కోసం కొత్తగా వాలంటీర్లను అన్ని డిపోలల్లో ఏర్పాటు చేస్తున్నామని ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. వీరు ఉద్యోగుల ఆరోగ్యకరమైన అలవాట్లపై మాట్లాడుతారని, నిత్యం కౌన్సిలింగ్‌తో పాటు పలు సూచనలు చేస్తారని వెల్లడించారు. డాక్టర్లు సూచించిన సమయానికి అనుగుణంగా మందులు వేసుకునేలా, ఆహారపు అలవాట్లపై వీరు సూచిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, సీపీఎం ఎస్.కృష్ణకాంత్, సీసీవోఎస్ విజయభాస్కర్, సీసీఈ రాంప్రసాద్, తార్నాక హాస్పిటల్లో ఓఎస్డీ సైదిరెడ్డి, ఆసుపత్రి సూపరెండెంట్ డా. శైలజామూర్తి, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డా. శ్రీనివాస్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గెలుపు కోసం కాంగ్రెస్ వ్యూహం

### రాష్ట్రమంతా విలేజ్ కమిటీల ఏర్పాటు

### కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ దృష్టి సారించింది. అందులో భాగంగానే విలేజ్ కమిటీలపై దృష్టి సారించింది. ఇక రానున్న రోజుల్లో కాంగ్రెస్ త్రిముఖ పోటీ పడే అవకాశం కనిపిస్తుంది. బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మద్య పోటీ నెలకొందని చెప్పొచ్చు. అందులో భాగంగానే గ్రామీణ ఎన్నికల బృందాలపై దృష్టిసారించింది. ప్రతి మండలంలో కనీసం 25 మంది సభ్యులతో ఎన్నికల బృందాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇందులో 40 శాతం మంది మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బిసిలతో పాటు 50 సంవత్సరాలలోపు వారు ఉంటారు. ఈ నెలాఖరులోగా రూరల్ ఎన్నికల టీమ్‌లు అన్ని అందుబాటులోకి రానున్నాయి. ముందస్తు ప్రచారశిక్షణ తరగతుల అనం తరం ఆ బృందం గ్రామాల్లో ప్రచారం చేయ నున్నారు. తెలంగాణలో ఉన్న 119 నియోజకవర్గాలోని 600 మండలాలలో 13 వేలకు గ్రామపంచాయతీలు ఉన్నాయి.

### ఇంటర్‌లో ఫెయిల్ అవుతానని..

## ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి ఉత్తీర్ణత



కృష్ణ (ఫైల్)

**కేసముద్రం, మే 9, ప్రభాతవార్త:** ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అవుతా నేమోనన్న భయంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి తీరా ఫలితాలు వచ్చిన తర్వాత ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించిన సంఘటన మహబూ బాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో చోటు చేసుకుంది. అప్పటికే కొడుకును పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంతో ఉన్న ఆ తల్లిదండ్రులు తమ వాడు ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడయ్యాడని తెలిసి గుండెలవిసేలా రోదిస్తు న్నారు. కేసముద్రం మండలంలో పీక్లాతండా శివారు బోడగుట్టతండా ఈ విశాదానికి వేదికగా నిలిచింది. తండాకు చెందిన గుగులోతు లచ్చు, జో ్యతిలకు ఒక కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్దవాడైన గుగులోతు కృష్ణ (19) ఇటీవల ఏటూరునాగారం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి వార్షిక పరీక్షలకు హాజరయ్యాడు. మొదటి నుండి డాక్టర్ కావాలని కలలు కంటూ శ్రద్ధగా చదివి ఇంటర్మీడియట్ బైపీసి పూర్తి చేసాడు. డాక్టర్ కావాలనుకున్న తన కోరికను కూడా ఇంట్లోని తన గదిలో నినాదాల రూపంలో రాసుకున్నాడు. పరీక్షలు రాసి ఇంటికొచ్చిన కృష్ణ ఒకరోజు తల్లి దండ్రులు ఇంట్లోలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటర్ పరీక్షలు తాను సరిగా రాయలేకపోయానని, డాక్టర్ కావాలనుకున్న కోరిక తీరని పరిస్థితి ఉందని అందుకే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఉరివేసుకునే ముందు కృష్ణ వదిలిన సూసైడ్ నోట్‌లో పేర్కొ నడంతో అప్పుడు దీనిపై పోలీసు కేసు కూడా నమోదైంది. కాగా మంగళవారం వెలువడిన ఇం టర్ ఫలితాల్లో కృష్ణ 1000మార్కులకు 892 మార్కులు సాధించి ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడయ్యాడు.

## ఒఆర్ఆర్ పచ్చదనానికి ముగ్గురు ఐఎఫ్ఎస్‌ల బృందం

### డ్రిప్ సిస్టమ్, పూలమొక్కలపై అధ్యయనం

### పచ్చదనం ప్రత్యేకతలను వివరించిన డైరెక్టర్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ఔటర్‌రింగ్ రోడ్డు పచ్చదనాన్ని చూసి ఇండియన్ ఫారెస్టు సర్వీస్ అధికారులు ఫిదా అయిపోయారు. దేశంలో ఎక్కడా లేదనివిధంగా ఏకంగా 160 కిలోమీటర్ల మేరకు పచ్చదనం నిర్వహణ కోసం నిరంతరంగా పనిచేసే ఒఆర్ఆర్ డ్రిప్ సిస్టం స్కోడా సెంటర్ పనితీరును ఐఎఫ్ఎస్ అధికారుల బృందం అధ్యయనం చేసింది. 1989 నుంచి 2014 బ్యాచ్‌లకు చెందిన తొమ్మిది రాష్ట్రాల నుంచి 16 మంది ఐఎఫ్ఎస్ అధికారుల బృందం 'ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్ మెంట్ : నీడ్ అండ్ మెథడ్స్ ఫర్ అసెస్‌మెంట్' అనే అంశంపై కంపల్సరీ ట్రైనింగ్ కోర్సులో భాగంగా మంగళవారం ఒఆర్ఆర్ గ్రీనరిని ఆద్యంతరం సందర్శించారు. వీరిలో 1989 బ్యాచ్‌కు చెందిన సీనియర్ పిసిసిఎఫ్ ఓంప్రకాష్ సింగ్ ఉన్నారు. ఓఆర్ఆర్ నిర్వహణలో తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎండిఎ అర్బన్ ఫారెస్టు డైరక్టర్ డా.బి.ప్రభాకర్ ఓఆర్ఆర్ గ్రీనరి నిర్వహణలో తీసుకుంటున్న మెలకువలను వివరించారు. వరల్డ్ గ్రీన్ అవార్డు అందుతున్న తరువాత తమ బాధ్యత ఎంతో పెరిగిందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ మార్గదర్శకంతో, మెట్రోపాలిటన్ కమిషనర్ అరవింద్‌కుమార్ పర్యవేక్షణలో అనతి కాలంలోనే ఔటర్ రింగ్ రోడ్డు గ్రీనరి నిర్వహణ కోసం ప్రత్యేకంగా డ్రిప్ సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఓఆర్ఆర్ మొత్తం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు జరిగాయని ప్రభాకర్ వారికి వివరించారు. ఓఆర్ఆర్ క్షేత్రస్థాయి పర్యటన తదుపరి నానక్‌రాం గూడలోని ఓఆర్ఆర్ డ్రిప్ ఆటోమేషన్ సెంటర్ పనితీరును ఐఎఫ్ఎస్ అధికారుల బృందం అధ్యయనం చేసింది, ఓఆర్ఆర్ మీద వివిధ రకాల ఫ్లవరింగ్ ప్లాంట్లు చూసి అధికారులు ముగ్దులయ్యారు. యేడాది పొడవుగా ఔటర్ రింగ్‌రోడ్డుపై పూల మొక్కలు కనువిందు చేస్తాయని ప్రభాకర్ వారికి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంట సర్వీస్ రోడ్డులో ఉన్న సోలార్ సైకిల్ ట్రాక్ పనులను కూడా ఐఎఫ్ఎస్ అధికారుల బృందం పరిశీలించింది. ఆ తరువాత వారు హెచ్ఎండిఏ దుండిగల్ నర్సరీని పరిశీలించారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

## మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

### గ్రా. 41 ఎండిఎంఎ, ద్విచక్రవాహనం స్వాధీనం

**మేడ్చల్ మే 9, ప్రభాతవార్త:** అత్యంత ప్రమాదకరమైన నిషేధిత మాదకద్రవ్యాలను దొంగ చాటుగా విక్రయిస్తున్న వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.మేడ్చల్ ఏసిపి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు వివరాల ప్రకారం ...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదారి జిల్లా తాడేపల్లి గూడెంకి చెందిన పోతిరెడ్డి మెహర్ బాబా (30) గత కొంతకాలంగా నగరంలోని బేగంపేట్ కుందన్ బాగ్‌లో గల వరద అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటు న్నాడు. కాగా విలాసవంతంగా బతకాలనీ ఉద్దేశంతో అత్యంత ప్రమాదకరమైన ఎండిఎ డ్రగ్ మాదకద్రవ్యాన్ని విక్రయించేందుకు గాను ఢీల్లీకి చెందిన జిన్ని అనే వ్యక్తితో పరిచయం ఏర్పరచుకొని గత రెండు సంవత్సరాలుగా నగరంలో ఈ డ్రగ్ విక్రయిస్తున్నాడు.కాగా గత కొంతకాలంగా తప్పించుకుని తీరుగుతున్న ఇతను మేడ్చల్ పోలీసులకు పట్టుబడ్డాడు..మేడచల్ ఎస్ఓటీ పోలీసుల అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టపూర్ గ్రామంలో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం పక్కన 8వ తేది సుమారు 6గంటల సమయంలో మెహర్ బాబా మాదకద్రవ్యాలు విక్రయిస్తుండగా అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు కాపు కాసి పట్టుకున్నారు.కాగా అతని వద్ద నుండి 41 గ్రాముల ఎండిఎంఎతో పాటు రెండు సెల్‌ఫోన్లు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.దీని విలువ రూ. 3లక్షల 40వేలు ఉంటుందని పేర్కొన్నారు.అత్యంత చాకచక్యంతో పట్టుకున్న ఎస్ఓటి పోలీసులుతోపాటు మేడ్చల్ పోలీసులను అభినందించిన ఎసిపి వారికి నగదు రివార్డులను ప్రకటించారు.

## పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టేలా చర్యలు తీసుకోండి

### జాతీయ బిసి కమిషన్ చైర్మన్‌కు ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్ మే 9, ప్రభాతవార్త:** దేశంలోని 56శాతం గల బిసిల జనాభా అభివృద్ధికి కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని అలాగే కేంద్రబడ్జెట్‌లో రెండులక్షకోట్లు, పార్లమెంట్‌లో బిసిబిల్లుపెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారామ్‌ను ఎంపి. ఆర్.కృష్ణయ్య



జాతీయ బిసి కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారామ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య తదితరులు

కోరారు. ఈమేరకు హైదరాబాద్ పర్యటనలో ఉన్న చైర్మన్‌ను మంగళవారం తన బృందంతో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గత 75ఏళ్లుగా దేశ జనాభాలో సగభాగం ఉన్న బిసిలకు విద్యా,ఉద్యోగ, ఆర్థిక , రాజకీయ ,సామాజిక రంగాల్లో అన్యాయం చేస్తున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశం కనుక అన్నికులాల వారికి వారివారి జనాభా ప్రకారం వాటా దక్కాలన్నారు. కానీ మనదేశంలో బిసిలకులాలకు ఏరంగంలో కూడా వాటా దక్కలేదన్నారు. అందుకే రాజ్యాంగబద్ధమైన జాతీయ బిసి కమిషన్ జోక్యం చేసుకుని బిసిలకు అన్నిరంగాల్లో వాటా దక్కేలా చూడాలని కోరినట్లు తెలిపారు. చైర్మన్ కలిసిన జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీల వెంకటేష్,నందగోపాల్, వేముల రామకృష్ణ, సుధాకర్, జోషి రాఘవ,నిఃల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్-2023 ఫలితాల్లో

# నారాయణ విజయవిహారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్-2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ మార్కులు 468 మార్కులు 7గురు విద్యార్థులు సాధించగా, అందులో ముగ్గురు నారాయణ విద్యార్థులే కావటం గమనార్హం. అలాగే 467 మార్కులు 96 మంది, 466 మార్కులు 269 మంది, 465 మార్కులు 439 మంది విద్యార్థులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను 437 అత్యుత్తమ మార్కులతో పాటు 436 మార్కులు 10 మంది, 435 మార్కులు 13 మంది కైవసం చేసుకున్నారు. అలాగే సీనియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 993 మార్కులతో ఇద్దరు విద్యార్థులు టాప్ మార్కు సాధించగా, 992 మార్కులు సాధించిన వారు 9 మంది,991 మార్కులు సాధించిన వారు 17 మంది,సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో1000 మార్కులకుగాను 991 మార్కులు ఒకరు సాధించగా, 990 మార్కులు ఆపైన సాధించిన వారు ఇద్దరు 989 మార్కులు ఆపైన సాధించిన వారు ఆరుగురు సాధించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరంభం నుంచి ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌ను పటిష్టమైన మైక్రోషెడ్యూల్స్‌గా రూపొందించి కాన్సెప్ట్యువల్ ఓరియంటేషన్‌లో విద్యాబోధన చేయటం వల్లనే తమ విద్యార్థులు ఇంతటి అద్భుత ఫలితాలను సాధించగలిగామని తెలిపారు. తద్వారా తెలంగాణలోని నారాయణ విద్యా సంస్థల్లో జూనియర్,సీనియర్ ఇంటర్‌లలో అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించటం జరిగిందని చెప్పారు. సబ్జెక్టుల వారీగా విశ్లేషణాత్మక ధోరణిలో విద్యార్థుల మేధో సంపత్తిని పెంపొందించే విధంగా పాఠ్యాంశ బోధన చేయటం అనేది నారాయణ ప్రత్యేకంగా చెప్పారు. 44 సంవత్సరాల ఈ మహాప్రస్థానానికి కొనసాగింపుగా,నేటి ఈ ఇంటర్‌లో సాధించిన అత్యద్భుత మార్కులే రేపటి జెఈఈ మెయిన్,అడ్వాన్స్‌డ్,నీట్ ఫలితాలకు ఆరంభమని, ఆ ప్రవేశ పరీక్షలన్నింటిలోనూ తమ విద్యార్థులే అత్యుద్భుత ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన తమ విద్యార్థులకు,తల్లిదండ్రులకు,అధ్యాపక బృందానికి నారాయణ విద్యా సంస్థల తరఫున అభినందనలు తెలియజేశారు.

# గొర్రెలు, మేకల దొంగల ముఠా అరెస్టు

48 గొర్రెలు, రూ.2.50లక్షల నగదు స్వాధీనం

**ఇబ్రహీంపట్నం, మే 9, ప్రభాతవార్త:** తాగుడుకు బానిసై ఈజీ మని కోసం గొర్రెలు,మేకలు దొంగతనానికి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ రవికుమార్ కథనం ప్రకారం.. వండర్‌లా సమీపంలో టాటాఇండికా కారులో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పారు. వారిని విచారించగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. షేక్ ఇక్బాల్(26), షేక్ జాఫర్(26)సయ్యద్ అమ్మద్(33), మహ్మద్ గౌస్(23), షేక్ అమీర్ (20) వీరందరు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. మేకలు,గొర్రెలు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను చాకచక్యంగా పట్టు కొని నగదు,మేకలు,గొర్రెలను రికవరి చేసినందుకు గాను ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుల్ ప్రసాద్, శివచంద్ర, ఉపేందర్‌రెడ్డి, వెంకన్నలకు రివార్డులను అందజేశారు. వారి సేవలను గుర్తించి అభినందించారు.

# ఇదేనా కిసాన్ సర్కార్ అంటే?

నేడు రాష్ట్రవ్యాప్తంగా ఐకెపి కేంద్రాల వద్ద వైఎస్సార్‌టిపి ధర్నాలు

**హైదరాబాద్ మే 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తడిసిన వడ్లు కొనాలని, కోతలు పెట్టవద్దని రైతులు కాళ్ల వేళ్లా పడుతున్నారని, అయినా నీ గుండె కరగడం లేదా? కెసిఆర్ దొరా అంటూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఇదేనా కిసాన్ సర్కార్ అంటూ ప్రశ్నించారు. ఎండనకా, వాననక, రైతులు కొనుగోలు సెంటర్‌లలో పడిగాపులు కాస్తున్నారు. గడీల్లో దర్జాగా బతకడమా? పెద్ద రైతును అని చెప్పుకునే స్వయం ప్రకటిత మేధావికి అన్నారు. రైతుల బాధలు నెత్తికెక్కడం లేదా అంటూ ప్రశ్నించారు. ఇంతైనా చలించని నికృష్టపాలనకు నిరసనగా ప్రతి గింజా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో ఐకెపి కేంద్రాల వద్ద ధర్నాలు చేస్తుందన్నారు.

# రాష్ట్రంలో కరోనా తాజా కేసులు - 29

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** రాష్ట్రంలో కరోనా పాజిటీవ్ కేసులు మెల్లిగా పెరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు ఒక్క రోజులో 29 పాజిటీవ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 8,43,940పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటలో కరోనా వల్ల మృతి చెందినట్లుగా నమోదు కాలేదు. రాష్ట్రంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 4111 వరకు చేరింది. ఒక్క రోజులో 4640 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,88,41,312మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు కరోనా నుంచి 8,39,617 మంది కోలుకోగా (99.49శాతం) మంగళవారం 44 మంది కోలుకున్నారు. మొత్తం యాక్టీవ్ కేసుల సంఖ్య 212కు చేరింది. మంగళవారం జిహెచ్ఎంసి పరిధిలో 20 పాజిటీవ్ కేసులు నమోదు అయ్యాయి.

# నా కూతురు భూములను ఎక్కడా కబ్జా చేయలేదు

## కావాలనే బదనాం చేస్తున్నారు: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** తన కుమార్తె భూములను ఎక్కడా కూడా కబ్జా చేయలేదని, తనపేరిటనే ఉందని, కేవలం అగ్రిమెంట్ మార్చుకున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం జనగామ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తీవ్ర బావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చేర్యాల భూమి విషయంలో కావాలనే తనను బదనాం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ ఉప్పల్ పీఎస్‌లో కూతురు తనపై ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, హబ్సిగూడలోని స్వాగత్ గ్రాండ్ భవనం తన కూతురుపేరిటనే ఉందని, కిన్నెర గ్రాండ్ అని పేరు మారడంతో లీజు అగ్రిమెంట్ మాత్రమే మార్చుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో రాజకీయ ప్రత్యర్థులు తన కుమార్తెను అడ్డంపెట్టుకుని ఈ విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. చేర్యాలలో 1402 సర్వే నంబర్ పరిధిలో తన కుమార్తె పేరిట 12వందల గజాల స్థలం ఉందని దీనిపై కొంతమంది రాజకీయంచేసి కోర్టు, లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ సైతం ఇక్కడ ఎటువంటి కబ్జాలేదని అధికారిక ప్రకటన చేసిన సంగతి అందరికి తెలిసిందేనన్నారు. గతంలో ఎన్నికల సమయంలో కూడా తనపై అనేక కుట్రలు జరిగాయని, అయినా సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చి ఆశీర్వదించగా ప్రజలు భారీ మెజార్టీతో అక్కున చేర్చు కున్నారన్నారు. కుటుంబంలోని జరిగే విషయాలను ఇలా చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.



## తండ్రి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై కేసుపెట్టిన కుమార్తె

**హైదరాబాద్ (తార్నాక), మే 9, ప్రభాతవార్త:** వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన బీఆర్ఎస్ పార్టీ జనగావ నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై ఆయన కూతురు తుల్జా భవానిరెడ్డి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫోర్జరీ కేసు పెట్టారు. తన స్థలాన్ని తండ్రి కాజేశారని ఫిర్యాదు చేశారు. హబ్సిగూడలోని 159 గజాల కమర్షియల్ బిల్డింగ్ విషయంలో ఆమె ఫిర్యాదు చేశారు. నాచారం హబ్సిగూడ కినారా గ్రాండ్ హోటల్‌కు తన తండ్రి ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అక్రమంగా అగ్రిమెంట్ చేసి తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఫిర్యాదు చేశారు. దీంతో ముత్తిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిబ్రవరిలో ఫిర్యాదు చేసినా ఉప్పల్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు.

# ముంబయి ఇండియన్స్ బ్యాటింగ్‌కు ఆర్సీబి గడబిడ

## ఆరు వికెట్ల తేడాతో ఆర్సీబి ఓటమి

**ముంబయి, మే 9:** ఐపిఎల్ 2023సీజన్‌లో 54వ మ్యాచ్ ఫ్యాన్స్‌కు ఆసక్తికరంగా మారింది. రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్ జట్లమధ్య వాంఖడేలో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఆరువికెట్ల తేడాతో 20 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. ఆర్సీబీ బౌలర్ల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించడంతో ముంబయి ఇండియన్స్ ఛాన్స్‌తీసుకుని నెగ్గింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ఆర్సీబీ ఆరువికెట్ల నష్టానికి 199 పరుగులుచేసి ముంబయికి 200 పరుగుల లక్ష్యం విధించింది. కట్టుదిట్టంగా ఆడి పరుగులు బ్రేక్‌చేసిన ముంబయి ఇండియన్స్ 21 బాల్స్ ఉండగానే నాలుగు వికెట్ల నష్టానికి 200 పరుగులుచేసి విక్టరీ నమోదుచేసింది.



తొలుత బ్యాటింగ్ 199కే పరిమితం అయిన ఆర్సీబీ ముంబయి ఇన్నింగ్స్‌లో తమ బౌలింగ్ పేలవంగా చేసారు. భారీ టార్గెట్‌నుప్రత్యర్థి ముందుంచినా బౌలర్ల పేలవ ప్రదర్శన ఆర్సీబీకి ఓటమి ఖాయంచేసింది. సూర్యకుమార్ యాదవ్ 35 బంతుల్లో 83 పరుగులుచేసి రాణించాడు. ఆరుసిక్స్‌లు, ఏడుఫోర్లు తనఖాతాలో వేసుకున్నాడు. నెహాల్ వధేరా 33 బంతుల్లో 52పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. నాలుగుఫోర్లు రెండు సిక్స్‌లతో కలిపి అర్థసెంచరీతో మెరిసాడు. సిక్సర్‌తో వధేరా మ్యాచ్‌ను ముగించి విక్టరీనమోదుచేసాడు. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబయి ఇండియన్స్‌కు ఇషాన్‌కిషన్ 21 బంతుల్లో 4 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 42 పరుగులుచేసి బోణీచేసాడు. మరో ఎండ్‌లో ఉన్న రోహిత్‌వర్మ ఏడు పరుగేచేసి మరోసారి నిరాశపరిచాడు. ఇషాన్‌కిషన్‌క్రీజులో ఉన్నంతవరకూ రోహిత్ ప్రేక్షకపాత్రపోషించాడు. అయితే బౌలింగ్‌కు వచ్చిన హసరంగ ఒకేఓవర్‌లో ఇద్దరినీ ఔట్‌చేసి ఆర్సీబీకి బ్రేక్‌ఇచ్చాడు. అయితేక్రీజులోనికి వచ్చిన వధేరా సూర్యకుమార్‌యాదవ్ ఆర్సీబీ ఆశలపై నీళ్లుచల్లారు. వీరిద్దరూ వాంఖడేలో సిక్సర్ల వర్షంకురిపించారు. మూడో వికెట్‌కు ఏకంగా 140 పరుగుల భాగస్వామ్యం తెచ్చారు. అనంతరం సూర్యకుమార్‌యాదవ్ ఔట్ అయ్యాడు. అయితే సిక్సర్‌బాదిన వధేరా తన అర్థసెంచరీతోపాటు మ్యాచ్‌నుసైతం ముగించేసాడు. తొలుత బ్యాటింగ్‌చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో ఆరువికెట్లనష్టానికి 199 పరుగులుచేసింది. గ్లెన్‌మ్యాక్స్‌వెల్ 33 బంతుల్లోఎనిమిదిఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 68 పరుగులుచేసాడు. ఫాఫ్‌డుప్లెసిస్ 41 బంతుల్లో 65 పరుగులుచేసాడు. ఐదుఫోర్లు మూడు సిక్స్‌లుకూడాసాధించాడు. చివరిలో దినేశ్‌కార్తీక్ 18 బంతుల్లో 30 పరుగులుచేసాడు. నాలుగుఫోర్లు ఒకసిక్స్‌తో ధాటిగా ఆడాడు. జేసన్ బెహ్రెండార్ఫ్ 3 వికెట్లుతీసాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ ఆరంభంలోనే వికెట్లను నష్టపోయింది. ఫామ్‌లో ఉన్న విరాట్‌కోహ్లీ ఒకటి, అనూజ్‌రావత్ ఆరు పరుగులతో వెంటవెంటనే ఔట్ అయ్యారు. దాంతో ఆర్సీబీ 16 పరుగులకే రెండు వికెట్లను కోల్పోయి కష్టాల్లోపడింది. ఈ దశలోక్రీజులోకి వచ్చిన మాక్స్‌వెల్ మెరుపులు మెరిపించాడు. మరో ఎండ్‌లో ఉన్న డుప్లెసిస్‌తోకలిసి ఆర్సీబీ స్కోరు పరుగులు పెట్టించాడు. ఇద్దరూ మూడో వికెట్‌కు 120 పరుగులు సోడించారు. సెంచరీచేసేలా కనిపించిన మ్యాక్స్‌వెల్ భారీ షాట్‌కువెళ్లి ఔట్ అయ్యాడు. కాసేపటికే డుప్లెసిస్‌కూడా ఔట్ అయ్యాడు. చివరిలో కార్తీక్‌ధాటిగా ఆడటంతో ఆర్సీబీ 199 మార్కుచేరింది.

# కన్నడ ఎన్నికలపై తెలుగు రాష్ట్రాల్లో జోరుగా బెట్టింగ్

బిజెపి, కాంగ్రెస్ గెలుపుపై బెట్టింగ్ జోరు,

చేతులు మారుతున్న రూ.కోట్లు

కర్ణాటక ఎన్నికల ఫలితాల తీరు

తెలంగాణలో మరింత ప్రభావం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** కర్ణాటక ఎన్నికలు దేశ వ్యాప్తంగా ఆసక్తిని రేపుతున్నాయి. బుధవారం పోలింగ్ జరగనుండగా, 13వ తేదీన ఫలితాలు వెల్లడి కానున్నాయి. మరోపక్క,కర్ణాటక ఎన్నికల ఫలితాలపై తెలుగు రాష్ట్రాల్లో జోరుగా బెట్టింగ్ జరుగుతోంది. కాంగ్రెస్,బిజెపి గెలుపుపై హైదరాబాద్,కొంపల్లి,కూకట్‌పల్లి,గచ్చిబౌలి,భీమవరం తదితర ప్రాంతాల్లో జోరుగా బెట్టింగ్ కొనసాగుతోంది. కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 114 నుంచి 116 సీట్లు, బిజెపికి 80 నుంచి 82 సీట్లు వస్తాయని బెట్టింగ్‌లు కాస్తున్నారు. మొదట కాంగ్రెస్, ఆ తర్వాత బిజెపి,ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావొచ్చునని బెట్టింగ్‌లు కడుతున్నారు. జెడిఎస్‌కు 21 సీట్ల నుంచి 23 సీట్ల వరకు వస్తాయని మొదటి నుంచి బెట్టింగ్ కడుతున్నారు. బుధవారం పోలింగ్ సరళిని బట్టి కూడా బెట్టింగ్ మారవచ్చునని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావం తెలుగు రాష్ట్రాలపై తప్పకుండా ఉండనుంది. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంపై ఉండనుంది. ఈ ఏడాదిలో చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే తెలంగాణలో కాంగ్రెస్ మరింత ఊపును అందుకోనుంది. ఇటీవలే ప్రియాంకగాంధీ సరూర్‌నగర్ స్టేడియంలో హైదరాబాద్ డిక్లరేషన్ కూడా ప్రకటించి వెళ్లారు. బిజెపి కర్ణాటకలో ఫలితాలు ఎలా ఉన్న తెలంగాణను వదిలే ప్రసక్తే లేదన్నట్లుగా వ్యూహ రచన చేసుకుంటోంది. కర్ణాటకలో ఒకసారి ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే రెండోసారి అదే పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం లేదు. ప్రస్తుతం అక్కడ బిజెపి అధికారంలో ఉండగా, ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ కర్ణాటకలో మకాం వేసి ఎన్నికల ప్రచారం చేశారు. కర్ణాటకలో స్థానిక బిజెపి నేతల పనితీరును చూడకుండా తన ముఖం చేసి బిజెపికి ఓటు వేయాలన్న విధంగా ప్రచారం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి నేతృత్వంలోని జనతాదళ్ ఎస్ పార్టీకి బిఆర్ఎస్ అధినేత,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మద్దతు ఇస్తామని చెప్పినప్పటికీ కర్ణాటకకు వెళ్లి ప్రచారం చేయలేదు.

# ఒడిశా సిఎం నవీన్‌పట్నాయక్‌తో నితీశ్ భేటీ

**భువనేశ్వర్, మే 9:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మంగళవారం ఒడిషా ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ అధినేత నవీన్‌పట్నాయక్‌తో భేటీ కావడం ఊహాగానాలకు తావిస్తోంది. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసే కూటమిలోకి పట్నాయక్‌ను ఆహ్వానించేందుకే నితీశ్ వెళ్లినట్లుగా భావిస్తున్నారు. అయితే,వీరిద్దరి భేటీ అనంతరం నవీన్‌పట్నాయక్ మీడియాతో మాట్లాడుతూ అలాంటిదేమీ లేదన్నారు. తమ మధ్య ఉన్న వ్యక్తిగత సంబంధాల గురించే ముచ్చటించామని నవీన్‌పట్నాయక్ అన్నారు. చాలాయేళ్లుగా తామిద్దరం మంచి మిత్రులమని ఆయన గుర్తు చేశారు. తమ మధ్య సంభాషణల్లో రాజకీయ పొత్తుల గురిం చిన ప్రస్తావన రాలేదన్నారు. నవీన్‌పట్నాయక్ మొదటినుంచీ కాంగ్రెస్, బిజెపికి సమదూరం పాటిస్తున్నారు. కేంద్రంలో ఎవరి ప్రభుత్వం ఉన్నా వారితో మైత్రీ సంబంధాలు కొనసాగించడం ఆనవాయితీగా చేస్తున్నారు. అయితే,నితీశ్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల వల్లే ఆయనతో చర్చించేందుకు నవీన్‌పట్నాయక్ ఆసక్తి చూపినట్లు భావిస్తున్నారు.

# త్వరలోనే రోబోటిక్స్ వినియోగంలో ఐదో స్థానానికి చేరుకోవాలి

స్టేట్ రోబోటిక్ ఫ్రేమ్ వర్క్‌ను ప్రారంభించిన మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** నూతన టెక్నాలజీలు అన్నింటిని అలవాటు చేసుకునే ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో రోబోటిక్స్ ఎకో సిస్టంను మెరుగుపరిచే లక్ష్యంతో మంగళవారం సాయంత్రం తెలంగాణ స్టేట్ రోబోటిక్ ఫ్రేమ్ వర్క్‌ను కెటిఆర్ టీ-హబ్‌లో ప్రారంభించారు. ప్రస్తుతం సమాజంలో జరిగే చాలా సమస్యలను పరిష్కరించేందుకు రోబోటిక్స్ ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధిలో ఐటీ వినియోగం పెంచాలని, టెక్నాలజీని వాడాలని సూచించారు. రోబోటిక్స్ సాంకేతిత వేగంగా పెరుగుతోందని తెలిపారు. గత మూడు దశాబ్దాల్లో మూడు రెట్లు వాటి వినియోగం పెరిగిందని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం రోబోటిక్స్ వినియోగంలో పదో స్థానంలో ఉందని గుర్తు చేశారు. త్వరలోనే ఐదో స్థానానికి చేరుకోవాలని సూచించారు.

# ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన మీర్జా రహమత్‌బేగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** నూతనంగా హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన మిర్జా రహమత్ బేగ్ మంగళవారంనాడు ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన ఛాంబర్‌లో ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్, కార్వాన్ ఎమ్మెల్యే మొయినుద్దీన్, అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ వేదాంతం నరసింహాచార్యులు, టిఆరెసెల్పీ రమేశ్‌రెడ్డి, ఎంఐఎంఎల్పీ సెక్రటరీ షఫీ, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు. రహమత్ బేగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కళా సుబ్బారావు స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త నోరి సుబ్రహ్మణ్యశాస్త్రికి అందించిన దృశ్యం

# కళాకారులకు ఆత్మీయులు కళా సుబ్బారావు

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 9, ప్రభాతవార్త:** రెండున్నర దశాబ్దాల క్రితం కళాసుబ్బారావు శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎందరో కళాకారులకు వేదిక ఇచ్చి ప్రోత్సహించి వారికి ఆత్మీయులుగా నేటికి గుర్తు చేసుకుంటున్నారని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన గానసభ నిర్వహణలో మూడు రోజుల పాటు జరిగే గానసభ వ్యవస్థాపకులు కళాసుబ్బారావు జయంతి సమావేశం ఆరంభమైంది. ముఖ్యఅతిథిగా మధుసూదనాచారి హాజరై సుబ్బారావు స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త నోటి సుబ్రహ్మణ్యశాస్త్రికి బహుకరించి ప్రసంగించారు. గానసభను జంటనగరాలలో కళావేదికగా రూపొందించి ప్రతిష్టను పెంచిన సుబ్బారావు సేవలు చిరస్మరణీయంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముందు రత్నమాల శిష్యబృందం ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత కార్యక్రమం జరిగింది.

# హైదరాబాద్‌లో మళ్లీ ఉగ్రవాదుల కదలికలు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి ఉగ్ర కదలికలు వెలుగు చూడడం సంచలనం రేపింది. కొంత కాలంగా ఉగ్రవాద కదలికలు పెద్దగా లేని భాగ్య నగరంలో హిజ్బ్ ఉత్ తహరీర్ (హెచ్‌యుటి) అనే ఉగ్రవాద సంస్థ బలపడేందుకు పన్నిన కుట్రను కేంద్ర నిఘా వర్గాలు పసిగట్టడంతో ఐదుగురు ఉగ్రవాదులు దొ రికిపోయారు. ఒకవేళ కేంద్ర నిఘా వర్గాలకు దీనిపై సమాచారం అందడం ఆలస్యం అయివుంటే పరిస్థితి ఏమిటనే దానికి పోలీసులే సమాధానం చెప్పాలి. 2021 ఫిబ్ర వరిలో బిహార్‌లోని దర్బంగా రైల్వే స్టేషన్‌లో ఉగ్రవాదులు జరిపిన బాంబుదాడిలో పాల్గొన్న నిందితుల్లో ఇద్దరు హైదరాబాద్‌లో వుండగా ఎన్ఐఎ అధికారులు పట్టుకోవ డం అప్పట్లో సంచలనం రేపింది. అంతకు ముందు రెండుసార్లు ఐసిస్ ఉగ్రవాదులను ఎన్ఐఎ అధికారులు హైదరాబాద్‌లో పట్టుకున్నారు. తాజాగా హెచ్‌యుటి అనే ఉగ్రవాద సంస్థకు చెందిన ఐదుగురు టెర్రరిస్టులు హైదరాబాద్‌లో దొరికిపోవడం మరింత సంచలనం రేపింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మావోయిస్టులను కట్టడి చే సేందుకు వున్న ఎస్ఐబిని, ఉగ్రవాదులను నిర్మూలించేందుకు వున్న కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ (సిఐ సెల్)ను బలోపేతం చేయడం తెలిసిందే. అయితే మావోయిస్టులను కట్టడి చేయడంలో విజయం సాధించిన పోలీసులు ఉగ్రవాదుల విషయంలో ఆశించినంతగా ఫలితాలు అందుకోవడం లేదనే విమర్శలు వున్నాయి. హైదరాబాద్‌లో తల దాచు కుంటున్న ఉగ్రవాదుల గురించి ఇతర రాష్ట్రాల పోలీసులు లేదా ఎన్ఐఎ అధికారులు వచ్చి అరెస్టు చేసే వరకు ఇక్కడి పోలీసులకు సమాచారం లేక పోవడం పెద్ద వెలితిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

హైదరాబాద్‌ను ఉగ్రవాదులు మరోసారి టార్గెట్ చేశారు. వాస్తవానికి ఉగ్రవాదుల హిట్‌లిస్టులో హైదరాబాద్ చాలాకాలం క్రితమే చేరిందనేది అందరికి తెలిసిందే. మ క్కా మసీదులో బాంబు పేలుడు తరువాత లుంబినీ పార్క్, గోకుల్ చాట్‌లలో సంభవించిన జంట పేలుళ్లు దేశ వ్యాప్తంగా సంచలనం రేపాయి. అంతకు ముందు పలు మార్లు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే పలు ఉగ్రవాద సంస్థలకు చెందిన అనేక మంది ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో అనేక కుట్రలు వుండడం విశేషం. వీటిలో సికింద్రాబాద్ గణేష్ దేవాలయంతో పాటు మరికొన్ని చోట్ల ఉగ్రవాదులు ముంబాయి తరహాలో వరుస పేలుళ్లకు కుట్ర పన్నడం గమనార్హం. అయితే గడచిన దశాబ్ద కాలంగా హైదరాబాద్‌లో ఉగ్రవాదుల కార్యకలాపాలు పెద్దగా లేకున్నా కొన్ని సందర్భాలలో వెలుగుచూస్తున్న ఉగ్రవాద కుట్రలు ప్రజల్లో భయాందోళనలు రేపుతు న్నాయి. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఐసిస్ ఉగ్రవాదులు పలువురు పట్టుబడడం గురించి చెప్పుకోవాలి. ఎన్ఐఎ అధికారులు రెండుసార్లు ఐసిస్‌కు చెందిన ప లువురిని అరెస్టు చేశారు. వీరంతా బిహార్‌తో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో వరుస పేలుళ్లకు కుట్రలు పన్నారు. దీంతో పాటు హైదరాబాద్‌లో యువతను

> మొన్న ఐఎస్ఐ, నిన్న ఐసిస్, పిఎఫ్ఐ,
>
> నేడు హెచ్‌యుటి టెర్రరిస్టుల కదలికలు
>
> పొరుగు రాష్ట్రాల పోలీసులు లేదా ఎన్ఐఎ అధికారులు
>
> అరెస్టు చేస్తే తప్ప ఇక్కడి పోలీసులకు అందని సమాచారం

ఐసిస్‌లో చే ర్పించేందుకు వ్యూహాలు రచించారు. ఈ క్రమంలో అన్య మతస్తులు కూడా కొందరు ఐసిస్‌లో చేరారు. ఈ కుట్రలను ఎన్ఐఎ అధికారులు ఛేదించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇక ఇదే సమయంలో హైదరాబాద్‌కు చెందిన పలువురు యువకులు ఐసిస్‌లో చేరి సిరియా అంతర్యుద్ధంలో పాల్గొని మృత్యువాత పడ్డారు. హైదరాబాద్ నుం చి ఐసిస్‌లో చేరిన కొందరి జాడ ఇప్పటి వరకు తెలియరాలేదు. అయితే ఐసిస్ కార్యకలాపాలపై ఎన్ఐఎ కఠినంగా వుండడంతో ఆ సంస్థ కార్యకలాపాలు ప్రస్తుతం పెద్ద గా లేవనే చెప్పాలి. ఐసిస్ ఉగ్రవాదుల కార్యకలాపాలను నియంత్రించడంలో ఎన్ఐఎ అధికారులదే ప్రధాన పాత్రగా చెప్పాలి. దీని తరువాత 2021 ఫిబ్రవరి నెలలో బిహార్‌లోని దర్భంగా రైల్వే స్టేషన్‌లో జరిగిన పేలుడులో పాల్గొన్న నిందితుల్లో ఇద్దరు హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌లో ఏడాదిపాటు వస్త్రాల వ్యాపారుల ముసుగులో వుండడం సంచలనం రేపింది. వీరి ని అక్కడి పోలీసులు అరెస్టు చేసే వరకు ఇక్కడి పోలీసులకు కనీసం సమాచారం కూడా లేక పోవడం మరో వెలితిగా చెప్పాలి. దర్భంగా పేలుడు రెండేళ్ల క్రితం దేశ వా ్యప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. దీని తరువాత నిజామాబాద్‌లో వెలుగు చూసిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) ఉగ్రవాద కార్యకలాపాలు కూడా రాష్ట్రంలో సంచలనం రేపాయి ఈ సంస్థ కార్యకలాపాల గురించి బిజెపి నాయకులు చెప్పే వరకు పోలీసులకు తెలియక పోవడం పెద్ద వెలితిగా చెప్పాలి. చివరకు బిజెపి నాయకులు దీనిపై ఆందోళనకు దిగి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశాక కానీ ఇక్క డి పోలీసులు ఆ సంస్థ ఉగ్రవాదులపై చర్యలు తీసుకోలేక పోయారు. ఈ సంస్థకు కాశ్మీర్‌తో పాటు పలు రాష్ట్రాలలో వున్న ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని తేలడంతో దీనిపై విచారణకు ఎన్ఐఎ రంగంలో దిగింది. ఇక తాజా విషయానికి వస్తే హెచ్‌యుటి అనే ఉగ్రవాద సంస్థ హైదరాబాద్‌లో వేళ్లానుకునేందుకు ప్రయత్నాలు చేయసాగింది. ఈ సంస్థ ఐసిస్ తరహాలో ప్ర పంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లోనూ ఈ సంస్థ బలంగా వుంది. ఈ క్రమంలోనే భారత్ లో బలపడేందుకు హెచ్‌యుటి ప్రయత్నాలు చేయసాగింది. ఈ సంస్థకు చెందిన కొందరు ఉగ్రవాదులు హైదరాబాద్‌లో వివిధ రంగాల్లో మకాంవేసి అమాయకులను ఉ గ్రవాదం ఉచ్చులో లాగేందుకు కుట్రలు పన్నసాగారు. పట్టుబడ్డ ఐదుగురు ఉగ్రవాదుల్లో మహమ్మద్ సలీం అనే వైద్యుడు ఒక వైద్య కళాశాలలో కీలక విభాగానికి హెచ్ఓ డిగా వుండడం విశేషం. అబ్దుల్ రెహమాన్ అనే మరో ఉగ్రవాది మరో బడా సంస్థలో క్లౌడ్ ఇంజనీర్‌గా షేక్ జునైద్ అనే ఇంకో ఉగ్రవాది పాతబస్తీలో డెంటిస్ట్‌గా పని చేస్తున్నాడు. వీరితో పాటు దొరికిన మరో ఇద్దరు ఉగ్రవాదులు దినసరి కూలీలు. కాగా హెచ్‌యుటి కుట్రలను కేంద్ర నిఘా వర్గాలు సకాలంలో గుర్తించడంతో పెద్ద ము ప్పు తప్పిందని చెప్పాలి. రాష్ట్రంలో మరో ఐదారు నెలల్లో ఎన్నికలు రానుండడంతో ఈ సమయంలో ఉగ్రవాదుల కదలికలు వెలుగు చూడడం సంచలనం రేపింది. హె చ్‌యుటి ఉగ్రవాదులను పట్టుకోవడంలో తెలంగాణ పోలీసులతో పాటు మధ్యప్రదేశ్ పోలీసులు కూడా పాల్గొన్నా వీరి గురించి సమాచారం సేకరించిన కేంద్ర నిఘా వ ర్గాలకే ఇందులో కీలక పాత్రగా చెప్పాలి. మొత్తానికి హైదరాబాద్‌లో వెలుగు చూసిన మరో ఉగ్ర కుట్ర కేసులో రాష్ట్ర పోలీసు యంత్రాంగం పాత్ర కన్నా కేంద్ర నిఘా వ ర్గాలకే పెద్ద పీటగా మారింది. తాజా ఘటన నేపథ్యంలో ఉగ్రవాదుల విషయంలో సిఐ సెల్ మరిం అప్రమత్తం కావాల్సి న అవసరం వుందని చెప్పాల్సి వుంది.

# ఇద్దరి పిల్లలతో చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**సత్తుపల్లి, మే 9, ప్రభాత వార్త:** ఇద్దరు చిన్నారులతో ఓ తల్లి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. సత్తుపల్లి సిఐ టి. కరుణాకర్, ఎస్ఐ బి. రాము తెలిపిన వివరాల ప్రకారం .... సత్తుపల్లి పట్టణంలోనే ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పాటిబండ్ల ప్రశాంత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా అమెరికాలో విధులు నిర్వహిస్తూ స్థిరపడ్డారు. దాదాపు 12 సంవత్సరాల క్రితం దమ్మపేట గ్రామానికి చెందిన అడపా కృష్ణయ్య దంపతుల కుమార్తె మృధుల (38) ను ప్రశాంత్‌తో వివాహం జరిగింది. ఈమెకు ఇద్దరు పిల్లలు. ప్రజ్వాన్ (8), మహాన్ (5) కలరు. గత ఏడు సంవత్సరాల క్రితం అమెరికా నుంచి హైదరాబాదు వచ్చి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ అమెరికాలోవిధులు నిర్వహించే టప్పుడు సంపాదించిన ఆస్తులను ప్రశాంత్ బెట్టింగ్,, షేర్ మార్కెటింగ్, ఆన్‌లైన్ కాయిన్స్ వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆ ఆస్తులను క్రమంగా మొత్తం కాజేసినట్లు పోలీసులు తెలిపారు. ఇది కాకుండా వివాహ సమయంలో తల్లిదండ్రులు మృధులకు ఇచ్చిన బంగారాన్ని సైతం ఆరు నెలల క్రితం రూ. 6.50 లక్షలకు అమ్మి కాజేసినట్లు మృతురాలి హ్యాండ్ బాగ్‌లో లభ్యమైన రసీదులను బట్టి పోలీసులకు ఆధారాలు దొరికాయి. ఇదే కాకుండా అత్తమామలు దమ్మపేటలో ఇచ్చిన ఏడున్నర ఎకరాల భూమిని సైతం మృధుల పేరున రాసిచ్చారు. ఇట్టి భూమిని కూడా అమ్మమని భార్య మృధులను ప్రశాంత్ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నట్లు ఆమె పేపర్‌లో రాసి ఉంచిన చిట్టీ పోలీసులకు దొరికింది. రాత్రి 10. గంటల సమయంలో తన పిల్లలను ఇద్దరిని తీసుకొని పట్టణ శివారులో ఉన్న తామర చెరువు వద్దకు వెళ్లి తన దగ్గర ఉన్న సెల్‌ఫోన్, హ్యాండ్ బ్యాగ్‌ను చెరువు కట్టపై ఉంచి పెద్ద పిల్లాడు తన చున్నీతో కట్టుకొని, చిన్న పిల్లవాడు మహాన్‌ను చంకలో వేసుకొని తామర చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు వేగవంతంగా దర్యాప్తు చేయడంతో మంగళవారం ఉదయం తామర చెరువలో శవాలు పైకి రావడంతో మృత దేహాలను పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాలను బంధవులకు అప్పగించారు. మృతురాలి తండ్రి అడపా కృష్ణ ఫిర్యాదు మేరకు సీఐ టి. కరుణాకర్, ఎస్ఐ బి .రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేపట్టారు.

## రొంపిచర్లలో పేలిన ట్రాన్స్‌ఫార్మర్



**రొంపిచర్ల, మే 10 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రొంపిచర్లలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. బుధవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన నేపథ్యంలో అకస్మాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్ నుండి మంటలు చెలరేగాయి. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సచివాలయం ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఈ సంఘటన జరిగింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది తక్షణమే కరెంట్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

## మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

### జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయిమార్కొండారెడ్డి



**మాచర్ల, మే 10 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి జగన్‌పైనే జనం నమ్మకంగా ఉన్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా అమలవుతున్నాయన్నారు. కుల,మత, రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యాన సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అర్హులందరికీ సమన్యాయం వైసీపీతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను మరలా ముఖ్యమంత్రిని చేసుకొని సంక్షేమ పథకాలను మరింతగా కొనసాగించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనుల్లో అవినీతికి తావులేదు



**రెంటచింతల, మే 10 ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో ఎటువంటి అవినీతి జరిగినా సహించేది లేదని గురజాల, మాచర్ల క్లస్టర్ ఏపీడీ సురేంద్ర అన్నారు. బుధవారం మండలంలోని పాలువాయిగేట్‌లో గన్నవరం మేజర్లో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు రోజు వారీ ఎంత నగదు చెల్లిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ కూలీలకు రూ. 272లు అందిస్తున్నామని, ఈ కాలువ పనులను 300 మందితో చేయిస్తున్నామని సిబ్బంది తెలిపారు. పూడిక తొలగింపు, తూటి కాడను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారావు, ఏపీవో జయచంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ విజయకుమారి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే మిషన్స్ కొరతతో రైతులకు వాతలు



**రెంటచింతల, మే 10 ప్రభాతవార్త:** మండల పరిధిలో సర్వే పేరుతో రైతుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. భూసర్వే పేరిట సర్వేయర్లు రైతుల వద్ద నుంచి ఈటీఎస్ మిషన్ పేరు చెప్పిన కొలతలకు వేల రూపాయలు లెక్కకట్టి దండుకుంటున్నారు. మిషన్ అద్దెకు తీసుకురావాలి.. అద్దె కడితేనే కొలత సాగుతుందని చెప్పి రైతులను నిలువు దోపిడి చేసనఉతన్నారు. గతంలో ఇనుప గొలుసులతో భూసర్వే నిర్వహించే సర్వేయర్లు.. నేడు టెక్నాలజీ పేరుతో మిషన్ల పేరు చెప్పి.. డబ్బులు దండుకోవడం ఆనవాయితీగా మారింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఈటీఎస్ మిషన్‌ను మండలానికి అందించి.. సర్వే పనులను సులభతరం చేశారు. అయితే వాటిని రిపేర్ల పేరుతో నేడు మూలన పడేశారు. నూతన సర్వే మిషన్లు నేటికీ అందించకపోయినప్పటికీ.. ఉన్న పాత మిషన్లను బాగు చేయడానికి కనీస నిధులు లేక అధికారులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించి .. పాత సర్వే మిషన్‌ను రిపేర్ చేయించాలని రైతులు కోరుతున్నారు.

**రిపేర్లో ఉంది.. తహసీల్దార్ పుల్లారావు**

సర్వేకు వినియోగించే ఈటీఎస్ మిషన్ రిపేర్లో ఉంది. దాన్ని బాగు చేయించడానికి నిదుల్లేవు. నిధులు వస్తే రిపేర్ చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

## రెంటచింతలలో జేబీఆర్ పర్యటన

**రెంటచింతల, మే 10 ప్రభాతవార్త:** మండల పరిధిలో తెలుగుదేశం పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం పర్యటించారు. పాలువాయి గేటులోని గాడిపత్తి అంజయ్య గృహ ప్రవేశంలో పాల్గొన్న ఆయన సాయంత్రం తుమృకోట గ్రామానికి వెళ్లారు. అక్కడ స్థానిక పార్టీ నాయకులు మిరియాల వీరస్వామి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మంచికల్లులోని పార్టీ సీనియర్ నాయకులు సీతారెడ్డి మనవడి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లెగుంత జనసేన నూతన కమిటీ ఎన్నిక

**గురజాల, మే 10 ప్రభాతవార్త:** మండలంలోని పల్లెగుంత గ్రామంలో గ్రామ జనసేన నూతన కమిటిని బుధవారం ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి బడిదెల శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఉప్పిడి నరసింహారావులు పాల్గొని మాట్లాడారు. పార్టీ విస్తరణ గ్రామస్థాయి నుంచి మొదలై భలోపేతం చేయాలన్నారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం నూతన కమిటిని ఎన్నుకోగా, అధ్యక్షునిగా పోటు అంకమ్మరావు, ఉపాధ్యక్షులుగా సాగి నవీన్, రాము, ప్రధాన కార్యదర్శులుగా కొండ కంబయ్య, ఉప్పు మనీ, కార్యదర్శులు కొండ, రుద్ర వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా గోపవరపు వెంకటేశ్వర్లు, పసుపులేటి వేణు, ఈపూరి మనోజ్ తదితరులు ఎన్నికయ్యారు.

## టీడీపీ నాయకులు కటౌట్ల రాజకీయం మానుకోవాలి

### తెదేపా తీరుపై ధ్వజమెత్తిన వైకాపా నేతలు

**కారంపూడి, మే 10 ప్రభాతవార్త:**

ప్రశాంతంగా ఉన్న మాచర్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తే తెలుగుదేశం పార్టీ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్తారని వైసీపీ నాయకులు పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ జానీబాషా, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ షేక్ షఫి, దళిత నాయకులు కొమ్ము చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం కారంపూడిలోని ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీకి కటౌట్ల రాజకీయం చేయాల్సిన అవసరం లేదని, మండలంలోని ఒప్పిచర్లలో బ్రహ్మారెడ్డి కటౌట్ విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ వారే బ్రహ్మారెడ్డి కటౌట్‌ను తొలగించి ఆ నిందను వైసీపీ నాయకులపై మోపి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఒప్పిచర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా ఆదరణ కోల్పోయిందని, విద్వేషాలు రెచ్చగొట్టి గ్రామంలో పూర్తిగా మునిగాపోయిన తెలుగుదేశం నాయకులు మనుగడ కోసం నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఏదో జాతీయ నాయకుని కటౌట్‌ను తొలగించినట్లు బ్రహ్మారెడ్డి కటౌట్ విషయంలో టీడీపీ నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు చేయడం హాస్యాస్పదం అని, బ్రహ్మారెడ్డి కటౌట్ విషయంలో ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ప్రమేయం ఉందని చెప్పడం సిగ్గుచేటన్నారు. పిన్నెల్లి సోదరులకు చిల్లర రాజకీయాల చేయాల్సిన అవసరం లేదన్నారు. బ్రహ్మారెడ్డి స్థానికంగా నివాసం ఉండే ధైర్యం లేక పెయిడ్ ఆర్టిస్ట్ లాగా నాలుగు వాహనాలు వేసుకొని నియోజకవర్గంలో తిరిగితే వైసీపీ భయపడే పరిస్థితిలో లేదని, పెయిడ్ ఆర్టిస్ట్ డ్రామాలు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. మాచర్ల నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే పీఆర్కే వెంట ఎన్నటికీ నియోజకవర్గ ప్రజలు ఉన్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో పీఆర్కే గెలవబోతున్నారని, తెలుగుదేశం పార్టీ నేతలు చిల్లర రాజకీయాలు మానుకుంటే మంచిదని అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు చిలుకూరి చంద్రశేఖర్‌రెడ్డి, పాతూరి రామిరెడ్డి, కొమెర పిచ్చయ్య, ఆశం విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రమావత్ ప్రమీలాబాయి తేజానాయక్, ఒప్పిచర్ల మాజీ సర్పంచ్ రమాదేవి, అంజయ్య, కోఆప్షన్ సభ్యులు అంతరగడ్డ ఏసోబు, ఒప్పిచర్ల సర్పంచ్ ఇరిగిదిండ్ల లాజర్, చిరుమామిళ్ల బుచ్చయ్య, ఒప్పిచర్ల వైసీపీ నాయకులు నీలంజయ్య, చల్లా అనిల్, జొన్నలగడ్డ శ్రీను, కోరే సత్యం, పాలకీర్తి నరేంద్ర, దొంత వీరాంజనేయులు, బత్తుల బైరాగి తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు రైల్వేస్టేషన్‌లో దొంగ అరెస్టు



**గుంటూరు క్రైమ్, మే10, ప్రభాతవార్త :** గుంటూరు రైల్వేస్టేషన్ 7వ నంబర్ ఫ్లాట్‌ఫారమ్ పై బుధవారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని జీఆర్పీ సిఐ గంగా వెంకటేశ్వర్లు,సిబ్బంది,ఆర్పిఎఫ్ సిబ్బంది కలసి అదుపులోనికి తీసుకొని అతని వద్ద ఉన్న బ్యాగ్ తనికీచేయగా అందులోరెండు లాప్‌టాప్‌లు,రెండుసెల్ ఫోన్‌లు ఉండడం గమనించి,పోలీస్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా అతనిపేరు రొట్టి గణేష్(30) విజయవాడ రాజ్యలక్ష్మీ కాలనీలో ఉంటానని చెడు అలవాట్లకు బానిసై రైళ్ళల్లో దొంగతనాలు చేస్తుంటానని ఆ విధంగా కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైల్లో స్లీపర్ కోచ్‌లో రెండు లాప్‌టాప్‌లు ఉన్న బ్యాగ్ దొంగిలించినట్లు తెనాలి నుండి గుంటూరు కు వచ్చే డెమో లో రెండు సెల్‌ఫోన్లు దొంగిలించినట్లు ఒప్పుకోగా అవి గుంటూరు రైల్వే పిఎస్‌లో నమోదైన కేసులోని సుమారు రూ.1,03,000ల విలువగల ప్రాపర్టీగా గుర్తించి వాటిని సీజ్ చేసి ముద్దాయిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించినట్లుగా సిఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

## 12న జన విజ్ఞానవేదిక జాతీయ అధ్యక్షునితో ఇష్టాగోష్టి

**గుంటూరు కల్చరల్, మే10, ప్రభాతవార్త :** ప్రముఖ విశ్లేషకులు,జన విజ్ఞానవేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ బి.బ్రహ్మారెడ్డితో ఒక ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని అవగాహన సంస్థ నిర్వహిస్తుంది.మే 12న అవగాహన సంస్థ కార్యాలయంలో సాయంత్రం 6గంటలకు సమాజపరంగా,ఆరోగ్య పరంగా మన జీవనశైలి ఎలా? ఉండాలి? ఎలా ఉంటుంది, అనే అంశంపై నిర్వహించబడుతుంది.గత 50సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ వేలాది ప్రజా చైతన్య కార్యక్రమాల్లో పాల్గొంటున్న మహామనిషి,బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బ్రహ్మారెడ్డి తో జరిగే ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా అవగాహన సంస్థ ఆహ్వానిస్తుంది.

## సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

### --తాడికొండ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త కత్తెర సురేష్



**మేడికొండూరు, మే10, ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని వైసిపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు.మేడికొండూరు గ్రామ ఇందిరాకాలనీలో బుధవారం గడపగడప కార్యక్రమాని ్ని నిర్వహించి కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మహిళలకు చేయూత ఆసరా అమ్మఒడి ఫించన్లు మొదలైన పథకాలు ఎలా అందుతున్నాయినే వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విలేకరులతో కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహనరెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను దాదాపు పూర్తిగా నెరవేర్చారని తెలిపారు.దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్నాయన్నారు.ఎంపిపి స్వప్న,జెడ్పిటీసీ సభ్యులు కందుల సిద్దయ్య,వైస్ ఎంపిపి భవనం రాజశేఖర్‌రెడ్డి,ఎంపిటీసీ సభ్యులు చంటిబాజీ,బుర్ర వెంకటసుబ్బారెడ్డి,వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాజీ,పలువురు నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'దిగజారుతున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి'

**గుంటూరు కల్చరల్, మే10, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ ప్రజలపై మోయలేని ఆర్థిక భారాలు మోపుతుందని,రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారుతుందని అవగాహన సంస్థ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది డిసెంబర్ వరకు మొత్తం 9నెలలకు గాను కేంద్రప్రభుత్వం 30,275కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతివ్వగా నెలన్నరలోపే దానిలో మూడోవంతు రుణాన్ని రాష్ట్రప్రభుత్వం వాడేసుకుందని విమరి ్శంచారు. వివిధ కార్పొరేషన్‌ల పేరుతో పెద్దమొత్తంలో చేస్తున్న అప్పులను,గ్యారంటీలను రాష్ట్రం లెక్కల్లో చూపకుండా గుంభనంగా చూపుతుందని కాగ్ చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత ప్రమాదంలో పడుతుందన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికలను పరిగణనలోనికి తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు

## వైభవంగా రాణాప్రతాప్ సింగ్ జయంతి



**గుంటూరు కల్చరల్, మే 10, ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కళ్యాణమండపం వేదికగా మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో దేశానికే గర్వకారణమైన రాణా ప్రతాప్ సింగ్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం గుంటూరు పట్టణ శాఖ అధ్యక్షులు శివరామ్‌సింగ్,రాష్ట్ర ఉపాధ్యాక్షులు ధర్మ నారాయణ సింగ్,కార్యదర్శి హనుమాన్ సింగ్,కోశాధికారి సాయిబాబా సింగ్,ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య రాజుబాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.ఉపాధ్యక్షులు ధర్మ నారాయణ సింగ్ సభాధ్యక్షత వహించి కార్యక్రమాలను నడిపించారు.ఆలయ పాలకమండలి అధ్యక్షులు మాట్లాడుతూ భారతదేశానికి రత్నంలాంటి వాడు రాణా ప్రతాప్ సింగ్ అంటూ ఇటువంటి వ్యక్తి జయంతి జరుపుకోవడం మన అదృష్టం అన్నారు.అనంతరం చిన్న వయస్సులోనే 10ఏళ్ళకే మహర్షి కాలేజీ ఆఫ్ వేదిక్ స్టడిస్,ఉదయపూర్ నుండి ఆస్ట్రాలజీ,వాస్తుపై పిహెచ్‌డి డాక్టరేట్‌తోపాటు అనేక ప్రపంచ రికార్డ్స్ ను సాధించిన అరిపిరాల యోగానంద శాస్త్రిని ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు.తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షులు సంస్థ వారు జ్యోతి ప్రకాశనంతో ప్రారంభించారు.

## 'దళితుల అభ్యున్నతికి పివి రావు కృషి ఎనలేనిది'



**గుంటూరు విద్య, మే10, ప్రభాతవార్త :** దళితుల ఐక్యతకోసం,దళితులను శాశ్వత బానిసలుగా మార్చిన ఆదిపత్య కులాల కుట్రను అడ్డుకొని మాలజాతి కోసం తన ప్రాణాన్నే ఫణంగా పెట్టి మాలలకు మొట్టమొదటి స్వాతంత్ర్యం అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ పి.వి.రావు అని బీమ్ సేన్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు.స్వర్గీయ పివిరావు జన్మదిన సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట పివి రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి,పెద్దఎత్తున జై భీమ్ నినాదాలు చేశారు. డాక్టర్ ఎండ్రపాటి సాంబశివరావు,దళిత మహాసభ,చిన్నం డేవిడ్,చార్వాక యువజన సంఘం శ్రీనివాసరావు,రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా,నామా జోషి బాబు,కొప్పుల శ్రీను,కొరివి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 'మహిళా మల్లయోధుల ఉద్యమానికి దేశప్రజలందరూ మద్దతివ్వాలి'

**గుంటూరు కల్చరల్ మే10, ప్రభాతవార్త :** జాతీయ,అంతర్జాతీయంగా భారత కీర్తిపతాకాన్ని ఎగురవేసిన మహిళా మల్లయోధులు వీదులకెక్కి నిరసన తెలియజేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమని అవగాహన సంస్థ మహిళా సభ్యులు విమర్శించారు.గత 15రోజుల నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళా మల్లయోధుల ఉద్యమానికి మద్దతుగా మహిళా సభ్యుల సమావేశం నిర్వహించారు.సమావేశంలో రచయిత్రి,మహిళా సీనియర్ సిటిజన్స్ నాయకులు పోగుల విజయశ్రీ మాట్లాడుతూ ఒలింపిక్స్,కామన్‌వెల్త్ పోటీల్లో పతకాలు సాధించి భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహిళా మల్లయోధుల పై ఒక ఎంపి లైంగిక వేధింపులకు పాల్పడటం అవమానకరమన్నారు.మరో రచయిత్రి ఎవికె సుజాత మాట్లాడుతూ ఎంపి బ్రిజ్ భూషణ్‌ను భారత మల్లయోధుల సంఘాల సమాఖ్య అధ్యక్ష స్థానం నుండి తొలగించాలని,మహిళా మల్లయోధులు పట్టుదలగా సాగిస్తున్న ఉద్యమాన్ని నీరుకార్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలను,ఇటీవల జరిగిన లాఠీ చార్జీని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు.అమరావతి వేదిక కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ ఒక్క రెజ్లర్ సంఘంలోనే కాదు దేశంలోని 30జాతీయ క్రీడా సంస్థల్లో సగానికి పైగా లైంగిక వేధింపుల కేసులు వస్తున్నాయని క్రీడా సంఘాలకు రాజకీయ పీడ విరగడ అయితేనే అథ్లెట్ల సహజసిద్ధ ప్రతిభ వికసిస్తుందన్నారు.కార్యక్రమంలో కమలకుమారి,లావణ్య,విజయభారతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## పెట్రోల్ ధరల భారాలపై డాక్టర్ అరవింద్‌బాబు ఆగ్రహం



**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** పెట్రోల్ ధరల బాదుడుపై టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. టిడిపి హయాంలో పెట్రోల్ ధర రూ.79లు ఉందన్నారు. ప్రస్తుతం లీటరు పెట్రోల్ ధర రూ.111లు దాటి పోయిందన్నారు. ప్రభుత్వం పన్నుల బాదుడుతో వలసలు పెరిగాయన్నారు. ధరలపై బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. ఉపాధి అవకాశాలు పూర్తిగా లేకుండాపోయాయన్నారు. మరో వైపు ప్రజా ప్రతినిధుల, మంత్రుల ఆదాయం పెరిగిపోతుందని డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో వందలాదిగా పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి ట్రంకు పెట్టెల పంపిణీ



**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి ట్రంకు పెట్టెలను వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ప్రవల్లిక సత్యం పాల్గొని మాట్లాడారు. వృద్ధాశ్రమానికి బీరువా, ఫ్రిజ్ తనవంతుగా అందజేస్తానని ఆయన తెలియజేశారు. పొట్టి హనుమంతరావు మాట్లాడుతూ ఐరన్ రాక్స్‌ను అందిస్తామని తెలిపారు. కొప్పురావూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. మధుసూదనరావు, మన్నవ వెంకటరెడ్డిలు 50 కేజీల బియ్యం, సత్యనారాయణ ఫ్యాన్ అందిస్తామన్నారు. అదే విధంగా సంస్థ నిర్వాహకులు పూనూరి కృష్ణకుమారి మాట్లాడుతూ మండవ సీతారామాంజనేయులు ట్రంకు పెట్టెలను అందజేశారని వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశరావు, సుబ్బారావు, సౌజన్య, అనీల, రమాదేవి, శంకర్‌రెడ్డి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేరళ స్టోరీపై నిరసన

**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** స్థానిక మార్కెట్ సెంటర్‌లో బుధవారం ఎంఐఎం, పీడిఎం, టిడిపి, ప్రజా సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో కేరళ స్టోరీ అనే సినిమాకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నాయకులు మస్తాన్‌వలి, మౌలాలి, దరియావలి, అల్లాభక్షు, నల్లపాటి రామారావు, పూర్ణచంద్రరావు, రఫీ, సుభాని, బాజీ తదితరులు పాల్గొని మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో విజయం కోసం కేరళ స్టోరీ అనే సినిమా తీశారని తెలిపారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న హిందూ, ముస్లిం, క్రైస్తవుల మధ్య మతవిద్వేషాలను కలిగించేందుకు బిజెపి ప్రభుత్వం ఈ కుట్ర పన్నిందన్నారు. ముస్లింలపై తప్పుడు ప్రచారం చేసేందుకు ఈ సినిమాను తీశారని తెలిపారు. ఇప్పటికే తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ఈ సినిమాపై నిషేధం విధించడం జరిగిందన్నారు. అదే విధంగా ఏపిలోనూ ఈ సినిమాను బ్యాన్ చేయాలని కార్యక్రమానికి నాయకత్వం వహించిన నాయకులు డిమాండ్ చేశారు.

## మేజర్ బిఎస్ఆర్‌కె రాజుకు సత్కారం



**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** ఎస్ఎస్ఎన్ కళాశాలకు చెందిన మేజర్ బిఎస్ఆర్‌కె రాజును జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి ద్వారా రాజు అందిస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. ఎన్‌సిసి విభాగంలో అత్యున్నత డైరెక్టర్ జనరల్ కమాన్‌డేషన్ కార్డు అవార్డును స్వీకరించడం పల్నాడు జిల్లాకు గర్వకారణమని తెలిపారు. రానున్న రోజులలో ఎన్‌సిసి ద్వారా యువతకు శిక్షణను అందించి సమాజానికి మంచి పౌరులను అందించాలన్నారు. క్రమశిక్షణకు ఎన్‌సిసి మారు పేరు అని తెలియజేశారు. సన్మాన గ్రహీత మేజర్ రాజు మాట్లాడుతూ ఎన్‌సిసి ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. విద్య, ఉద్యోగాలలో ఏబిసి సర్టిఫికెట్ ద్వారా ఉన్నత స్థాయికి చేరవచ్చన్నారు. అదే విధంగా తమ విద్యార్థులు రక్తదానం, మొక్కల పెంపకం, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారని, ఆదర్శంగా నిలుస్తున్నారని మేజర్ బిఎస్ఆర్‌కె రాజు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల, రెడ్‌క్రాస్ కమిటీ మెంబర్ బత్తుల మురళి పాల్గొన్నారు.

## ఎన్ఈసిలో పవర్ ఎలక్ట్రానిక్‌పై కాన్ఫరెన్స్



**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ అంతర్జాతీయ వర్చువల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఎన్ఇసి - ఐసిపిఎస్‌పిఇ - 2కె23 రీసెంట్ ట్రెండ్స్ ఇన్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్‌కు సంబంధించి ప్రతిని విడుదల చేశారు. కళాశాల ఛైర్మన్ ఎం.వి.కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్, డాక్టర్ పి.లక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి ఈ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులలో ఉన్న విజ్ఞానాన్ని మరొకరితో పంచుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలియజేశారు.

## శ్రీశ్రీ కళావేదిక కార్యదర్శి రాకేష్‌కు సత్కారం

**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర సహాయక కార్యదర్శి గూండాల రాకేష్‌కు బుధవారం ఘనంగా సత్కారం జరిగింది. సాహితీ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కళావేదిక ప్లీనరీ విజయవాడలో నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్ర, జిల్లా కమిటీలను ఈ సందర్భంగా ఎంపిక చేసి నియామకపత్రాలను అందజేశారు. గుర్రం జాషువా అవార్డు గ్రహీత డాక్టర్ కె.ప్రతాప్ ఉమ్మడి రాష్ట్రాల నుండి హాజరైన కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. మంచిర్యాలలో 24 గంటలు, అంతర్‌వేధిలో 36 గంటలు, తిరుపతిలో 48 గంటల పాటు సాహితీ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూండాల రాకేష్‌తో పాటు వేదిక జాతీయ కన్వీనర్ రమావతి, ప్రధాన కార్యదర్శి ఈశ్వరీభూషణం, రాష్ట్ర అధ్యక్షులు జి.హరిసర్వోత్తమనాయుడు, కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిఎస్పీ



**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** నరసరావుపేట పోలీస్ సబ్ డివిజన్ అధికారిగా కె.వి.మహేష్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఎస్పీకి అందజేశారు. అనంతరం ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సమర్థవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. నూతన డిఎస్పీ కె.వి.మహేష్ మాట్లాడుతూ 2018 క్యాడర్‌కు చెందిన మహేష్ మొట్టమొదటిసారిగా కర్నూలు డిఎస్పీగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రథమంగా పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని కె.వి.మహేష్ తెలియజేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సి.ఐ.లు, ఎస్.ఐ.లు, పోలీస్ అధికారులు ఉన్నారు.

## రంగస్థలి 43వ వార్షికోత్సవ బ్రోచర్ల ఆవిష్కరణ

**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** నరసరావుపేట రంగస్థలి 43వ వార్షికోత్సవ ఆహ్వాన నాటక పోటీల బ్రోచర్ల ఆవిష్కరణ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్, బాజీ, వెంకటరావు, సుభాని తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆహ్వాన నాటిక పోటీలు మే 12,13,14 తేదీలలో వరుసగా మూడు రోజుల పాటు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచిన సాంఘిక నాటిక ప్రదర్శనలు ప్రదర్శిస్తామన్నారు. 23వ ఆహ్వాన నాటిక పోటీలు టౌన్‌హాల్లో సాయంత్రం ప్రదర్శించబడతాయన్నారు. ఈ ప్రదర్శనలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, డిఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్, రచయిత, దర్శకులు సీతారామ అవధాని ముఖ్యఅతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభిస్తారని రంగస్థలి అధ్యక్షులు బాజీ తెలియజేశారు.

# పోలీస్ స్టేషన్ ఆవరణలోనే బిజెపినేతపై ఎమ్మెల్యే దాడి!

**అమేథి,మే 10:** పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఒక ఎమ్మెల్యే బిజెపి నేత భర్తపై భౌతిక దాడికి దిగిన సంఘటన సంచలనం కలిగించింది. సమాజ్‌వాదిపార్టీ ఎమ్మెల్యే రాకేష్‌ప్రతాప్‌సింగ్ బిజెపి నేత భర్త అయిన దీపక్‌సింగ్‌పైనే దాడికి దిగి తీవ్రంగా కొట్టిన వీడియోలు ఇపుడు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. మున్సిపల్‌ఎన్నికల్లో



బిజెపి అభ్యర్థిగా ఉన్న రష్మిసింగ్‌భర్త దీపక్‌సింగ్‌మధ్య పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు దూషణకు దిగారు. తదనంతరం ఒక్కసారిగా ఇరువురిమధ్య వైరం పెరిగిపోయింది. ఎమ్మెల్యే రాకేష్‌ప్రతాప్‌సింగ్ వచ్చిరావడంతోనే దీపక్‌సింగ్ చొక్కా పట్టుకుని కొడుతూ లాగుతూ పీకుతూ కనిపించారు. ఆయన అనుచరులుసైతం దీపక్‌సింగ్‌పై దాడికి దిగారు. డజనుకుపైగా పోలీసులు రాకేష్‌ప్రతాప్‌సింగ్‌ను, దీపక్‌సింగ్‌ను వేరుచేయడానికి ఎంతో శ్రమపడాల్సి వచ్చింది. అతికష్టంమీద ఇద్దరిని వేరుచేసారు. ఈ సంఘటన అమేథి జిల్లాలోని గౌరిగంజ్ కొత్వాలీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగింది. సమాజ్‌వాదిపార్టీ నాయకుల వివాదానికి కారణం దీపక్‌సింగ్ స్టేషన్‌కు వచ్చిరావడంతోనే తిట్లపురాణం అందుకున్నారని, అప్పటికే స్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శనలో ఉన్న రాకేష్‌ప్రతాప్‌సింగ్ దీపక్‌సింగ్ తిట్లతో ఆగ్రహావేశాలతో ఊగిపోయినట్లు తెలిసింది. దీపక్‌సింగ్, ఆతని మద్దతుదారులు తన మద్దతుదారుల్లో కొందర్ని దాడిచేసి గాయపరిచారని అందుకుగాను పోలీసులు ఎలాంటిచర్యలు తీసుకోలేదని నిరసన తెలుపుతూ స్టేషన్‌వద్దప్రదర్శనకు దిగారు. ఈ నిరసనసమయంలోనే దీపక్‌సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సమాజ్‌వాదిపార్టీ ఎమ్మెల్యేని, ఆతని మద్దతుదారుల్ని బహిరంగంగానే తిడుతూ కనిపించారు. దీనితో పరిస్థితిచేయిదాటిపోయింది. ఎమ్మెల్యే ఒక్కసారిగాదూకుడుగా వచ్చి దీపక్‌సింగ్‌పై దాడికి దిగారు. వెంటనే పోలీసులు అప్రమత్తం అయి ఇరువురినీ వేరుచేసి దీపక్‌సింగ్‌ను మరోవైపునుంచి బయటికి పంపించివేసారు. సీనియర్‌పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ ఇద్దరు రాజకీయ ప్రత్యర్థులు ఒకరిపై ఒకరు దౌర్జన్యం చేసుకున్నారని, ప్రస్తుతానికి పరిస్థితిని చక్కదిద్దామని, చర్యలు తీసుకుంటామని, ఇరువైపులా కేసులునమోదుచేసినట్లు తెలిపారు.

# ఐదేళ్లుగా సమస్యల్లోనే సిఎం కుర్చీ

## ఏం ప్రభుత్వం ఇది, అంతర్గతపోరుతోనే కాలక్షేపం

## రాజస్థాన్‌ప్రభుత్వంపై ప్రధాని మోడీ చురకలు



**జైపూర్, మే 10:** రాజస్థాన్‌లో ఉన్న ప్రభుత్వం ఎలా ఉందో అందరికీ తెలుస్తోందని, ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు విమర్శలుచేసుకోడానికి పోటీపడుతున్నారని, ఇక రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం ఏం పట్టించుకుంటారని ప్రధాని నరేంద్రమోడీ విమర్శించారు. పార్టీకి చెందిన సొంత ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని విశ్వసించలేని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ ఒకరినొకరు అవ మానించుకోడానికి పోటీపడుతున్నారని, ఐదేళ్లపాటుకూడా ముఖ్యమంత్రి కుర్చీ సమస్యలతో ఉంటే రాజస్థాన్ అభివృద్ధిని ఎవరు పట్టించు కుంటారని మోడీ ప్రశ్నించారు. రాజస్థాన్‌కాంగ్రెస్‌నేత మాజీ డిప్యూటీసిఎం సచిన్‌పైలట్ ముందురోజే విమర్శలుచేస్తూ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ నాయకురాలు బిజెపికి చెందిన వసుంధరరాజే సింధియా అని సోనియా గాంధీ కాదని ఆరోపించారు. అంతేకాకుండా తాను పార్టీని ఎంతమాత్రం వీడబోనని, రాజస్థాన్ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను ఎంతమాత్రం దెబ్బతీయనని చెప్తూనే ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లోత్‌పై విమర్శలుదాడిచేసారు. అజ్మీర్‌నుంచి జైపూర్‌వరకూ జనసంఘర్షయాత్రను నిర్వహిస్తున్నట్లు కూడా ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధరరాజే సింధియా తన ప్రభుత్వానికి ఎంతోసాయం చేసారని, 2020లో కొందరు ఎమ్మెల్యేలతో సచిన్‌పైలట్ తిరుగుబాటుసమయంలో వసుంధర ఎంతో సాయంచేసారని అశోక్‌గెహ్లోత్ వ్యాఖ్యలు చేసారని సచిన్ ఈసందర్భంగా గుర్తుచేసారు. అయితే ఈవ్యాఖ్యలనే సాకుగా తీసుకుని ఏం ప్రభుత్వం నడుస్తోంది రాజస్థాన్‌లో అంటూ మోడీ ఎద్దేవాచేయడంతో వేదికపైనే ఉన్న ముఖ్యమంత్రి గెహ్లోత్ రాజస్థాన్ ఇపుడు మోడీ సొంతరాష్ట్రం గుజరాత్‌ను అధిగమించిందని, అభివృద్ధిపరంగా గుజరాత్‌తో తమకు పోటీలేదని పేర్కొన్నారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించేందుకు వచ్చిన మోడీకి స్వాగతం పలుకుతూనే రాజస్థాన్‌లో అభివృద్ధి శరవేగంగాజరిగిందన్నారు. రోడ్లు ఎంతో మెరుగ్గా ఉన్నాయన్నారు. రాజస్థాన్‌లో 5500 కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభోత్సవాని, రాజస్థాన్‌ప్రజలను అభినందిస్తున్నట్లు మోడీ పేర్కొన్నారు. రాజస్థాన్‌లో ఆధునిక మౌలికవసతుల కల్పనకు తమ ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలోచూసేవారికి ప్రతి అంశం ప్రతి కోణంలోనూ కనిపిస్తుందని మోడీ చెప్పారు. గవర్నర్ కల్‌రాజ్‌మిశ్రా, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌లు కలిసి ప్రధానిమోడీకి ఎయిర్ పోర్టులో సాదరంగా ఆహ్వానం పలికారు.

ఈ ఏడాది డిసెంబరులో ఎన్నికలకు వెళుతున్న రాజస్థాన్‌లో ప్రధానిమోడీ ఇప్పటికే మూడుసార్లు పర్యటించారు.

# విపక్ష ఐక్యకూటమికోసం బీహార్ సిఎం కసరత్తులు

## ముంబయిలో పవార్, థాకరేలతో భేటీ

**ముంబయి, మే 10:** ప్రతిపక్షపార్టీలన్నింటినీ ఏకంచేసేందుకు బీహార్ జెడియు అధ్యక్షుడు ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కసరత్తులు ముమ్మరం చేసారు. ఇప్పటికే రాహుల్‌గాంధీని, ఒడిస్సా ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్‌ను కలిసిన జనతాదళ్ చీఫ్ తాజాగా మంబయిలో మహారాష్ట్ర నేతలను కలిసి వారితో చర్చలుజరిపారు.



శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాకరేతోకలిసి మాతోశ్రీలో విందుకు హాజరయ్యారు. అంతకుముందే నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్‌నుకలిసి చర్చలు జరిపారు. దక్షిణముంబయిలోని సిల్వర్ ఓక్స్ నివాసంలో నితీష్ పవార్ ఇతర ఎన్‌సిపినేతలను కలిసి చర్చలు జరిపారు. భావసారూప్యతకలిగిన చిన్న పార్టీలన్నింటినీ ఏకంచేసేందుకు నితీష్‌కుమార్ సారథ్యం వహిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అందరినీ ఒకే వేదికపైకితెచ్చి బిజెపికి గట్టిపోటీ ఇవ్వాలని నిర్ణయించారు. విపక్షాలను ఐక్యంచేసే కార్యాచరణతోపాటు వివిధ పార్టీలతో తనకున్న వైరుధ్యాలను కూడా ఈచర్చలతో పరిష్కరించుకుంటున్నారు. జెడియు ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ కపిల్ పాటిల్‌మాట్లాడుతూ బిజెపి వ్యతిరేకంగాపోరాడుతున్న తమ నాయకుడు నితీష్‌కుమార్‌కు విపక్ష పార్టీలనుంచి అనూహ్యరీతిన ఆదరణ లభిస్తోందని వారంతా మద్దతిస్తున్నారన్నారు. 1977లో అన్ని కాంగ్రెస్సేతర పార్టీలు కూడా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఒక్కటయి పోటీ చేసారని, అత్యవసర పరిస్థితి నుంచి దేశాన్ని ప్రజాస్వా మ్యాన్ని పరిరక్షించేందుకు ఆనాడు ఏకం అయ్యాయని, అదే తరహాలో ఇపుడు విపక్ష పార్టీలన్నీ కూడా రాజ్యాంగ పరిరక్షణకోసం బిజెపికి వ్యతిరేకంగా ఒక్కటవుతున్నాయన్నారు. విశేష పాలనానుభవంతోపాటు రాజకీయ అనుభవం కూడా ఉన్న తమ నాయకుకి రాజకీయంగా ఎలాంటి మచ్చలేదన్నారు. బీహార్ సిఎం ఒక్కరు మాత్రమే ఏవ్వరినయినాసరే ఏకం చేయగలరని, కాంగ్రెస్ పార్టీకూడా తమకూటమిలోప్రధానంగా ఉంటుందని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఎవరో ఒకరు నాయకత్వం వహించి విపక్ష కూటమికి సారధిగా ఉంటే తాము మద్దతిస్తామని ఎన్‌సిపి చీఫ్ శరద్‌పవార్ వెల్లడించారు. అంతకుముందే బెంగాల్‌ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్‌నేత సోనియా గాంధీ, రాహుల్, సమాజ్‌వాదిపార్టీ నేత అఃలేష్‌యాదవ్‌లను కూడా కలిసిన నితీష్‌కుమార్ ఇపుడు ముంబయిలో శరద్‌పవార్, ఉద్ధవ్‌థాకరేలను కూడా కలిసి విపక్ష ఐక్యకూటమిపై చర్చలు జరిపారు.

# ప్రత్యేక న్యాయస్థానం ఎదుటకు ఇమ్రాన్ ఖాన్!

**ఇస్లామాబాద్, మే 10:** మాజీ ప్రధాని, పిటిఐ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను ఎట్టకేలకు ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపర్చారు. ఆయన్ను 14 రోజుల రిమాండ్‌కు ఇవ్వాలని ఎన్‌ఎబి కోరింది. బుధవారం ఇస్లామాబాద్ పోలీస్ లైన్స్‌లోని ప్రధాన కార్యాలయంలోని కొత్త అతిథి గృహాన్ని న్యాయస్థానంగా మార్చేశారు. ఇక్కడ ఖాన్‌పై నమోదైన రెండు కేసులను విచారించనున్నారు. యాంటీ అకౌంటబిలిటీ కోర్టు నెంబర్ 1 ఈ న్యాయస్థానంలో జడ్జిగా మహమ్మద్ బషీర్ వ్యవహరించారు. గతంలో నవాజ్ షరీఫ్ కుమార్తె మరియంపై నమోదైన అవినీతి కేసులను ఈ న్యాయమూర్తే విచారించారు. అప్పట్లో ఆమెకు శిక్షపడింది. అల్‌ఖాద్రీ ట్రస్ట్ భూములపై విచారణ సందర్భంగా ఖాన్‌ను 14 రోజులపాటు రిమాండ్‌కు ఇవ్వాలని ఎన్‌ఎబి లాయర్లు కోరారు. దీనిని ఇమ్రాన్ తరఫున న్యాయవాద బృందం తీవ్రంగా వ్యతిరేకించింది. అంతేకాదు తక్షణమే ఇమ్రాన్‌ను



విడుదల చేయాలని కోరింది. అనంతరం న్యాయమూర్తి విరామం తీసుకున్నారు. వాస్తవానికి నేడు ఇమ్రాన్‌ను కలిసేందుకు న్యాయసలహా బృందానికి తొలుత అనుమతులు లభించలేదు. కానీ కొద్దిసేపటి తర్వాత ఖాన్‌ను కలిసేందుకు వారిని అనుమతించారు. ఇమ్రాన్‌ఖాన్ మరో కేసులో జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి హుమాయూన్ దిలావర్ ఎదుట కూడా హాజరుకానున్నారు. ప్రభుత్వానికి చెందిన బహుమతులు విక్రయించిన విషయంలో ఇమ్రాన్ ఎదుర్కొంటున్న ఆరోపణలపై ఇక్కడ విచారించనున్నారు. ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పిటిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు విచారణ కేంద్రం వద్ద గుమిగూడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. దీంతోపాటు మీడియా ప్రతినిధులు కూడా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. మరోవైపు పిటిఐ ఉపాధ్యక్షుడు షా మహమూద్ ఖురేషి, కార్యదర్శి అసద్ ఉమర్‌ను కూడా పోలీసులు అడ్డుకొన్నారు. దీంతో వీరు ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ వేయడానికి యత్నించారు. కానీ అంతకు ముందే ఉగ్రవాద వ్యతిరేక బృందం పోలీసులు అసద్ ఉమర్‌ను అరెస్టు చేశారు. ఇక పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో భారీ ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. దాదాపు 1000 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇక్కడ జరిగిన అల్లర్లలో దాదాపు 130 మంది పోలీసులు అధికారులు గాయపడ్డారు. అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను పారామిలిటరీ రేంజర్లు అరెస్టు చేశారు. ఓ అవినీతి కేసుకు సంబంధించి ఇస్లామాబాద్ హైకోర్టులో విచారణకు హాజరైన ఆయనను కోర్టు బయట అదుపులోకి తీసుకున్నారు. ఐఎస్ఐ కనుసన్నల్లోని సైన్యం తనను చంపడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించిన నేపథ్యంలో పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ అధినేత అయిన 70 ఏళ్ల ఇమ్రాన్‌ను అరెస్టు చేయడం గమనార్హం. ఆయన అరెస్టుతో దేశవ్యాప్తంగా విధ్వంసకర సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆర్మీ ప్రధాన కార్యాలయంపైనా ఇమ్రాన్ పార్టీ కార్యకర్తలు దాడి చేశారు.

# ఒక్కరోజులో కరోనా కేసులు 2102, మృతులు 8

## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,49,74,909

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే10:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 2102 కేసులు నమోదయ్యాయి. మృతి 8 మంది. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,49,74,909కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,44,21,781మంది కోలుకోగా 21,406మంది దేశంలోని వివిద ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 5,31,722చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.77 శాతంగా ఉంది. దేశంలో కరోనా కా౦ణంగా మరణాల రేటు 1.18శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,67,595కి చేరగా, 80,17,530మంది కోలుకున్నారు. 1,48,538మంది ప్రాణాలు కోల్పోయారు.

# సామూహిక బహిష్కరణ, ఒక్కరు ఓటు వేస్తే ఒట్టు

## నాయకులనే తరిమిన గ్రామస్తులు

**బెంగళూరు, చామరాజనగర మే 10:** కర్ణాటకలో 224 అసెంబ్లీ నియోజక వర్గాల్లో బుధవారం ఉదయం 7 గంటలకే పోలింగ్ మొదలైయింది. పలు నియోజక వర్గాల్లో ఓటర్లు ఉదయం నుంచి క్యూలైన్లలో నిలబడి ఓటు వేస్తున్నారు. ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు పదేపదే మనవి చేస్తూనే ఉన్నారు. అయితే కర్ణాటకలోని చామరాజనగర జిల్లాలోని ఓ పోలింగ్ కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం వరకు ఒక్కరు కూడా ఓటు వేయలేదు. మీరు రాత్రి వరకు ఇక్కడే ఉన్నా ఎవ్వరూ వచ్చి ఓటు వేయరని గ్రామస్తులు తేల్చి చెప్పడంతో ఎన్నికల అధికారులు, పోలింగ్ విధులకు వెళ్లిన సిబ్బంది బిత్తరపోయారు. చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేట తాలుకాలో చిక్క ఎలచెట్టి అనే గ్రామం. గ్రామంలోని ప్రభుత్వ స్కూల్‌లో ఎన్నికల అధికారులు పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో పోలింగ్ విధులకు హాజరైన సిబ్బంది ఐదు మంది, సాయుధ పోలీసులతో పాటు బిజెపి, కాంగ్రెస్, జెడిఎస్ పార్టీలకు చెందిన ఏజెంట్లు కూర్చుని ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి గ్రామస్తులు వచ్చి ఓటు వేస్తారని పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది ఎదురు చూశారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు కూడా ఒక్కరు కూడా ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌లోకి వెళ్లలేదు. పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది, ఎన్నికల అధికారులు గ్రామంలోకి వెళ్లి ఓటు వేయడానికి రావాలని గ్రామస్తులకు మనవి చేశారు. మా గ్రామంలో ఇంతవరకు ఒక్క పని జరగలేదని, తాగడానికి మంచినీరు లేదని, రోడ్లు లేవని, డ్రైనేజీలు లేవని, ఎన్నిసార్లు నాయకులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఎన్నికల సమయంలో మాత్రమే మా గ్రామం ఇక్కడి నాయకులకు గుర్తుకు వస్తుందని, తర్వాత ఐదు సంవత్సరాలు ఈ పక్కకు కూడా చూడరని, అందుకే ఎన్నికలను బహిష్కరిస్తున్నామని గ్రామస్తులు మండిపడ్డారు. మేము కచ్చితంగా ఓటు వేయమని గ్రామస్తులు తేల్చి చెప్పడంతో ఎన్నికల అధికారులు షాక్ తిన్నారు. అటవి ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో సరైన వసతులు లేవని నాయకులు అందరికి తెలిసినా వారు ఏ మాత్రం పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని చెప్పిన కొందరు నాయకులకు పోరారే పోరా అంటూ గ్రామస్తులు ఎదురుతిరగడంతో ఆ నాయకులు కాలికి పని చెప్పారని తెలిసింది.

# ఆసుపత్రిలో కస్టడీ నిందితుడి వీరంగం - చికిత్సచేస్తున్న యువ వైద్యురాలి హత్య

**కొల్లాం(కేరళ),మే 10:** కేరళలోని కొల్లాం జిల్లాలో 23 ఏళ్ల వైద్యురాలు కత్తిపోట్లకు గురై మరణించింది. జిల్లాలోని కొట్టారక్కర ప్రాంతంలోని ఆసుపత్రిలో పనిచేస్తున్న సమయంలోనే సస్పెండ్ అయిన ఒక స్కూలు టీచర్ నిర్వాకానికి వైద్యురాలు బలైపోయింది. కుటుంబసభ్యులతో జరిగిన ఘర్షణకు సంబంధించి అదుపులోనికి తీసుకున్న పోలీసులు ఆతడిని ఆసుపత్రికి తీసుకువచ్చారు. కొట్టారక్కర పోలీసుల వివరాలప్రకారం సందీప్ అనే ఈ టీచర్‌కు కాలిపై గాయం అయింది. డాక్టర్ వందనాదాస్ ఆతడికి చికిత్సచేస్తున్న తరుణంలోనే ఒక్కసారిగా ఉద్రేకంతో రెచ్చిపోయి అక్కడున్న అందరిపైకి లంఘించాడు. ఒక కత్తెరను చేతితో పట్టుకుని అందరినీ బెదిరించసాగాడు. ఆతడు చేసిన కత్తెర గాయాలతో వందనదాదాస్ చివరకు మృతిచెందింది. నిందితుడితో వచ్చిన పోలీసులకు సైతం గాయాలయ్యాయి. చికిత్సచేసిన వైద్యురాలిని వెంటనే ఒకప్రైవేటు ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అక్కడే చికిత్సపొందుతూ మరణించింది. యువ వైద్యురాలి మృతిపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈసంఘటన విచారకరమని, ఎంతో బాధించిందని



ఆయన అన్నారు. సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న హెల్త్‌వర్కర్లను హింసకు గురియేయడం ఎంతమాత్రం ఉపేక్షించేది కాదని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విజయన్ తెలిపారు. ఊఎంఎ, కేరళ ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఈసంఘటన పట్ల నిరసన ప్రకటించారు. కేరళ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఈ సంఘటనపై వెంటనే స్పందించి వారం రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని కొల్లాంజిల్లాఎస్‌పిని ఆదేశించింది. కేరళ వైద్యశాఖ మంత్రి వీణాజార్జి చేసిన వ్యాఖ్యలు మరింత ఉద్రిక్తతలను రెచ్చగొట్టాయి. అనుభవం తక్కువ కావడంతో నిందితుడికి చికిత్స అందించేసమయంలో ఆమె భయపడిందని మంత్రిచేసిన వ్యాఖ్యలు ధుమారంరేపాయి. మంత్రి వ్యాఖ్యలు అర్థరహితమని, మద్యం, మత్తు పదార్థాలకు అలవాటుపడిన ఒక నిందితుడు చేసిన దాడిని రక్షించుకోవడంలో అనుభవం ఉండాలా లేక వైద్యవృత్తిపరంగా అనుభవరాహిత్యమని మంత్రి చేసారా అని కేరళ పిసిసి చీఫ్ సుధాకరన్ ఆగ్రహం వ్యక్తంచేసారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విడి సతీషన్ మాట్లాడుతూ వైద్యురాలిమృతి మొత్తంకేరళ సమాజాన్నే వణికించిందని అన్నారు.

# రాష్ట్రంలో మళ్లీ బిజెపికే కర్ణాటక ప్రజల తీర్పు

- 130స్థానాలతో మేమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
- మాజీ సిఎం యెడియూరప్ప

**శివమొగ్గ, మే 10:** కర్ణాటక ప్రజల ఆశీస్సులతో తనకుమారుడు బిజెపి అభ్యర్థి బివై విజయేంద్ర 40వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని మాజీ సిఎం యెడియూరప్ప ప్రకటించారు. అంతేకాకుండా కర్ణాటకలో బిజెపి ప్రభుత్వమే రాబోతోందని భారీ మెజార్టీతో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని ఆయన అన్నారు. ఈసారి తమ పార్టీకి 125నుంచి 130 స్థానాలు వస్తాయని పూర్తి స్థాయి మెజార్టీతోనే ప్రభుత్వం ఏర్పాటుచేస్తామని ఆయన చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు కర్ణాటక ఎన్నికలపై ప్రత్యేకశ్రద్ధచూపించారని అందుకు వారికి ధన్య వాదాలు చెపుతున్నట్లు పేర్కొన్నారు. యెడి యూరప్ప కుమారుడు లోక్‌సభ ఎంపి బివై రాఘ వేంద్ర మాట్లాడుతూ శివమొగ్గ పార్లమెంటు నియో జకవర్గంలోని అన్ని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బిజెపి అభ్యర్థులే భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు. తన సోదరుడు విజయేంద్ర శికారిపురనుంచి పోటీలో ఉన్నారని, భారీ మెజా ర్టీతో గెలుస్తారని రాఘవేంద్ర చెప్పా రు. బిజెపి అభ్యర్థులు కేవలం ఒక్క శివమొగ్గలోనే కాకుండా అత్యధికస్థానాల్లో భారీ మెజార్టీతో గెలుస్తారని ఆయన ధీమా



ప్రకటించారు. వర్షం వచ్చే సూచన లున్నందున ప్రజలు ముందుగానే పోలింగ్ కేంద్రా లకు వచ్చి ఓటు వేయాలని కోరారు.

తన తండ్రి ఎన్నికల రాజకీయాలనుంచి నిష్క్రమించినప్పటికీ రాష్ట్ర రాజకీయాల్లోక్రియా శీలకంగా ఉన్నారని, ఈ వయసులో కూడా ఆయన రోజుకు ఐదారు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీకి 123 నుంచి 127 స్థానాలు వస్తాయని అన్నారు.

# మణిపూర్‌లో క్రమేపీ మెరుగవుతున్న శాంతిభద్రతలు

## గత రెండు రోజులుగా నమోదుకాని కొత్త ఘటనలు

**ఇంఫాల్, మే 10:** హింసాత్మకంగా మారిన మణిపూర్‌లో పరిస్థితి నెమ్మదిగా మెరుగుపడుతోంది. గత రెండురోజులుగా రాష్ట్రంలో కొత్తగా ఎలాంటి హింసాత్మక ఘటనలు వెలుగులోకి రాలేదు. ఇంఫాల్ వెస్ట్, బిష్ణుపూర్, చురాచంద్‌పూర్, జిరిబామ్ సహా 11 ప్రభావిత జిల్లాల్లో



ఉదయం 5 గంటల నుండి ఆరు గంటల పాటు కర్ఫ్యూను సడలించినట్లు అధికారులు చెప్పారు. మే 9న ఈ జిల్లాల్లో 4 గంటల పాటు కర్ఫ్యూను సడలించారు. మెజారిటీ మెయితీ కమ్యూనిటీ షెడ్యూల్డ్ తెగ హోదా కోసం పోరాడుతోంది. ఈ క్రమంలో మణిపూర్‌లో జరిగిన హింసలో దాదాపు 60 మంది చనిపోయారు. సుమారు 231 మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. అధికారులు వివరాల ప్రకారం చురాచంద్‌పూర్ నుంచి 2,500 మంది బాధితులు, సరిహద్దు పట్టణం మోరేలో చిక్కుకుపోయిన 500 మందిని ఇంఫాల్‌కు తీసుకువచ్చారు. హింసాత్మక ఘటనల్లో 60 మంది మృతి చెందినట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి సపమ్ రంజన్ సింగ్ వెల్లడించారు. 30,000 మందికిపైగా నిరాశ్రయులయ్యారని చెప్పారు. వారిలో 26,000 మందిని వారి వారి జిల్లాల వెలుపల సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. 4,000 మంది ప్రజలు తమ ఇళ్లకు సమీపంలో సహాయక శిబిరాల్లో ఉన్నారని మంత్రి సపమ్ రంజన్ సింగ్ వెల్లడించారు. మరో 26,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని వారిలో చాలా మంది తమ బంధువుల ఇళ్లలో తలదాచుకున్నారని మంత్రి సపమ్ రంజన్‌సింగ్ వివరించారు. మొత్తం 128 కంపెనీల బలగాలు, అస్సాం రైఫిల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌ను కొనసాగించాయి. 24 గంటలూ వైమానిక నిఘా నిర్వహిస్తున్నారు. దీంతో ఎలాంటి హింసకు తావు లేకుండా పోయింది. పరిస్థితి మరింత మెరుగపడ్డాక ఆంక్షలను సడలించే అవకాశం ఉంది.

# ద్రవ్యోల్బణంపై ప్రశ్నించే హక్కు మీకు లేదు

## కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

**బెంగళూరు, మే 10:** దేశంలో ధరల పెరుగుదల నియంత్రణకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో దేశంలో ద్రవ్యోల్బణం తీరును ప్రస్తావించిన ఆమె, ధరల పెరుగుదలపై ప్రశ్నించే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బెంగళూరులో ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో స్పష్టమైన మెజార్టీతో తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని నిర్మలా సీతారామన్




ఆశాభావం వ్యక్తంచేశారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యురాలిగా ప్రాతినిధ్యం వహిస్తోన్న నిర్మాలా సీతారామన్, జయనగర్ అసెంబ్లీ సెగ్మెంటులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం 2014 నుంచి చర్యలు తీసుకుంటోంది. కర్ణాటకలో ముఖ్యమంత్రి బొమ్మై కూడా పెట్రోల్‌పై రెండుసార్లు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించారు. ద్రవ్యోల్బణం విషయానికి వస్తే నేను ప్రజలతోనే ఉంటాను. అవి మరింత తగ్గాల్సి ఉంది. కానీ ఈ అంశంపై విమర్శించే హక్కు కాంగ్రెస్‌కు మాత్రం లేదు. వాళ్లు గత యుపిఎ ప్రభుత్వాన్ని గుర్తుచేసుకోవాలి అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తాజా ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని పేర్కొన్నప్పటికీ, ఎన్ని స్థానాల్లో బిజెపి విజయం సాధిస్తుందని అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పేందుకు తను నిరాకరించారు.

# విజయపుర నియోజకవర్గంలో దొంగ ఓటర్లు

## బిజెపి అభ్యర్థి కోసమేనని చెపుతున్న కాంగ్రెస్ నేతలు

**బెంగళూరు, మే 10:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు బుధవారం జరుగుతున్న పోలింగ్‌లో బోగస్ ఓటర్లను గుర్తించి కాంగ్రెస్ కార్యకర్తలు పట్టుకున్నారు. వీరంతా చిచోలినుంచి విజయపురాకు వచ్చి దొంగ ఓట్లు వేసేందుకుప్రయత్నించారని వారు ఆరోపించారు. విజయపుర బిజెపి ఎమ్మెల్యే బసన్నగౌడ పాటిల్ యత్నాల్ మద్దతుదారులు వీరందరినీ తీసుకొచ్చారని ఆరోపించారు. అనేకమంది తాము విజయపురకు చించోలినుంచి బస్సుల్లో వచ్చామని, ఓట్లువేసేందుకే వచ్చినట్లు చెప్పారు. ఈ విడియో క్లిప్‌లన్నింటినీ సోషల్‌మీడియాలో వైరల్‌చేసారు. ముందురోజు రాత్రే మమ్మల్ని విజయపుర నగరానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాత్రి మొత్తం తాము ఇక్కడే ఉన్నామమని



తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు వీరందరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించి వెంటనేకేసులునమోదుచేయాలని డిమాండ్‌చేసారు. ఎన్నికల సంఘానికిసైతం వారు ఫిర్యాదులుచేసి అభ్యర్థిపైనా పార్టీ నేతలపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేసారు. కర్ణాటకలో ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా సాగుతున్న సంగతి తెలిసిందే. బిజెపి, కాంగ్రెస్, జెడిఎస్ పార్టీలు వేటికవే పోటాపోటీగా ప్రచారంచేసాయి. ఉదయం ఏడుగంటలనుంచి పోలింగ్‌ప్రారంభం అయింది. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్‌ప్రశాంతంగానే సాగుతోందన్నారు.

# ప్రపంచదేశాల్లో 68.80 కోట్లకు పెరిగిన బాధితులు

## 68.72 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, మే 10:** ప్రపంచదేశాల్లో కరోనా పెరుగుతున్న కేసులు ఇప్పటికీ వెలుగులోకి వస్తున్నాయి. చిన్నచిన్నదేశాల్లోనే ఈ కేసుల పెరుగుదల ఎక్కువగా ఉంది. ఒమిక్రాన్, ఇతర ఉపవేరియంట్లు హల్‌చల్‌చేస్తుండటంతో ఆయా దేశాల్లోని పౌరులు మరింతగా గాభరా చెందుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బుధవారం నాటికి 68.80 కోట్లమందికి కరోనాసోకి వారిలో 68.72 లక్షలమందిచనిపోయారు. మరో 39,051 మందిపరిస్థితి విషమంగా ఉంది. రికవరీలు 66.04 కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.07 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.90 కోట్లమందికికరోనాసోకి వారిలో 20.55 లక్షలమందిచనిపోయారు. మరో 6325 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.49 కోట్లకుపైగా నమోదుకాగా మరో 20.35 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఉత్తరఅమెరికా దేశాల్లో మొత్తం 12.63 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 16.30 లక్షలమందిచనిపోయారు. మరో 6302 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.21కోట్లకుపైగా నమోదుకాగా మరో 25.58 లక్షలమంది ఇప్పటికీమృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో 21.60కోట్లమందికికరోనాసోకి వారిలో 15.45 లక్షలమందిచనిపోయారు. మరో 15,658 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 20.07 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.46 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం కరోనా బాధితులు 6.86 కోట్లకుపైగా నమోదుకాగా 13.55 లక్షలమందిచనిపోయారు. రికవరీలు 6.64 కోట్లకుపైగా నమోదుకాగా మరో 8,17,919 మందిపరిస్థితి విషమంగా ఉంది.

# లైంగిక వేధింపుల కేసులో దోషిగా ట్రంప్

## రూ.410 కోట్లు చెల్లించాలని ఆదేశం

**వాషింగ్టన్, మే 10:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రముఖ రచయిత్రిని ఆయన లైంగికంగా వేధించాడని న్యూయార్క్ జ్యూరీ తేల్చింది. ఆమెకు పరిహారంగా 5 మిలియన్ డాలర్లు అంటే రూ.410 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. దీంతో 2024 అధ్యక్ష ఎన్నికల్లో మరో సారి పోటీ చేయాలనుకుంటన్న ట్రంప్‌కు పెద్ద షాక్ తగిలినట్లయింది. 1996లో మాన్‌హటన్ అవెన్యూలోని అగ్గరీ బర్గ్‌డార్ఫ్ గుడ్ మ్యాన్ స్టోర్‌లో ట్రంప్ తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ప్రముఖ రచయిత్రి ఇ.జీన్ కరెల్ ఆరోపించారు. ఆపై తనను లైంగికంగా వేధించాడని తెలిపారు. 2019లో ఓ సారి తన గురించి అసభ్యంగా మాట్లాడి ప్రతిష్టకు భంగం కలిగించారని పరువునష్టం పటిషన్ దాఖలు చేశారు. ట్రంప్‌పై భయంతోనే తాను 20 యేళ్లకుపైగా ఈ విషయంపై బహిరంగంగా మాట్లాడలేకపోయానన్నారు.

# ఝార్ఖండ్‌లో తెగబడిన దుండగులు

## మైనింగ్ కంపెనీకి చెందిన తెలంగాణ అధికారి మృతి

**రాంచీ, మే 10:** ఝార్ఖండ్‌లో ఓ అటవీ ప్రాంతంలో దుండగులు జరిపిన కాల్పుల్లో తెలంగాణకు చెందిన మైనింగ్ అధికారి వీరగంధం శరత్‌బాబు (60) మృతి చెందారు. ఎపి బిజెపి నేత, మాజీ ఎంపి సిఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కంపెనీ నిర్వహిస్తున్న బొగ్గు గనిలో శరత్‌బాబు పనిచేస్తున్నారు. నిజానికి ఆయన ప్రతిరోజు బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో ప్రయాణిస్తారు. సాధారణ వాహనంలో కార్యాలయానికి వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వెంబడించిన దుండగులు హజారీబాగ్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో కాల్పులు జరిపారు. శరత్‌బాబు, ఆయన అంగరక్షకుడు రాజేంద్ర ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరినీ ఆసుపత్రికి తరలించగా శరత్‌బాబు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

# సిఎం ముఖ్యసలహాదారుగా సోమేశ్‌కుమార్ నియామకం

## పదవీకాలం మూడేళ్లు, కేబినెట్ ర్యాంక్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్(రిటైర్డ్)కు కీలక బాధ్యతలు అప్పగించారు. సోమేశ్‌కుమార్‌ను తన ముఖ్య సలహాదారుగా నియమించుకున్నారు. మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్య సలహాదారుకు కేబినెట్ హోదా కల్పిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సోమేశ్‌కుమార్ మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. గతంలో ఆయన తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సంగతి తెలిసిందే. అయితే ఆయనను హైకోర్టు తీర్పు మేరకు ఏపీకి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన ఆంధ్రప్రదేశ్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. ఇక, ఇటీవలే సోమేశ్‌కుమార్ విఆర్ఎస్ తీసుకున్నారు. దీంతో సిఎం కెసిఆర్ ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించారు. బిహార్‌కు చెందిన ఆయన 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి... రాష్ట్ర విభజన సమయంలో ఆయనను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటయించినా... సెంట్రల్ ఆడ్మినిస్ట్రేటీవ్ ట్రిబ్యునల్(క్యాట్) ఉత్తర్వుల మేరకు తెలంగాణలోనే కొనసాగారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. అయితే క్యాట్ ఉత్తర్వులను డీవోపీటీ తెలంగాణ హైకోర్టులో సవాల్ చేయడంతో హైకోర్టు ఆయనను తక్షణం ఏపీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. మరో అవకాశం లేకపోవడంతో 2023 ఫిబ్రవరిలో ఆయన ఏపీ జీఏడీలో రిపోర్టు చేశారు. ఆ వెంటనే హైదరాబాద్‌కు వచ్చారు. ఏపీ ప్రభుత్వం కూడా ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. ఒక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, మరో రాష్ట్రంలో అంతకంటే తక్కువ పోస్టులో పని చేయడానికి సోమేశ్ ఇష్టపడలేదు. ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు ఏపీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆమోద ముద్ర వేశారు. వాస్తవానికి సోమేశ్‌కుమార్‌కు 2023 డిసెంబర్ వరకూ సర్వీస్‌లో కొనసాగే అవకాశం ఉంది. కానీ తెలంగాణ ప్రభుత్వంలో మరో పోస్టులో కొనసాగడానికి వీలుగా ఆయన ముందుగా విఆర్ఎస్ తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి.

ఇటు డీవోపీటీ నిబంధనల ప్రకారం 30 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసిన వవారు స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తే... దానిని కేంద్రం ఆమోదించాల్సిన అవసరం లేదు. సదరు అధికారులు ఏ రాష్ట్రానికి కేటాయించిన వారు అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వమే విఆర్ఎస్‌ను ఆమోదించవచ్చు. సోమేశ్‌కుమార్ కూడా ఈ నిబంధనలను ఉపయోగించుకుని విఆర్ఎస్‌ను ఆమోదింప చేసుకున్నట్లు ఐఏఎస్ వర్గాల్లో చర్చ జరిగింది.

ఇన్ని నెలల తర్వాత సోమేశ్‌కుమార్‌ను మళ్లీ తెలంగాణ ప్రభుత్వమే కీలక పదవి ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి చీఫ్ సెక్రటరీగా పనిచేసిన రాజీవ్‌శర్మ ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారు పదవిలో కొనసాగుతున్నారు.

అయినప్పటికీ సోమేశ్‌కుమార్‌కు ముఖ్య సలహాదారు పేరుతో కీలక పనులు అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది.

# రిజర్వు బ్యాంకు వద్ద సెక్యూరిటీ బాండ్లు వేలం వేసి రూ.3050 కోట్లు రుణం తీసుకున్న ప్రభుత్వం

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం మంగళవారం రిజర్వ్ బ్యాంకు వద్ద సెక్యూరిటీ బాండ్ల వేలంలో ఏపీ ప్రభుత్వం పాల్గొంది. సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రూ.3, 50వేలకోట్ల రుణం ఏపీ ప్రభుత్వం తీసుకుంది. ఇందులో రూ.1000కోట్లు 6 సంవత్సరాలకు 7.34శాతం, మరో రూ.1000 కోట్లు 20 ఏళ్ళకు 7.37శాతం వడ్డీతో ఏపీ ప్రభుత్వం అప్పుగా తీసుకుంది. రూ.500ను 8 సంవత్సరాలకు 7.40శాతం, మరో రూ.500కోటు 10 సంవత్సరాలకు 7.39 శాతం, ఇంకో రూ.500 కోట్లు 15 సంవత్సరాలకు 7.38శాతం వడ్డీతో ఏపీ ప్రభుత్వం అప్పు పొందింది. ఈ రోజు సాయంత్రానికి ఖజనాలో మొత్తం డబ్బు జమకానుంది, ఇందులో రిజర్వ్ బ్యాంక ఓడిని రూ.1500 కోట్లు మినహాయించే అవకాశం ఉంది. మిగతా డబ్బుతో ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర:లకు పెన్షన్‌లు వస్తాయని ఉద్యోగులు ఆశిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో ఉంది,ఇప్పుడు తీసుకున్న అప్పుతో కలిని గడిచిన 40 రోజుల్లో 9వేల 500 కోటుంలంల మేర ప్రభుత్వం రుణం తీసుకున్నట్లు సమాచారం.

# ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 9, ప్రభాతవార్త:** ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి ఉద్యమించిన తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమం కోసం సిఎం కెసిఆర్ తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఉద్యమ కారుల ఫోరం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నేటి నుంచి నెల రోజులపాటు జూన్ 9వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తమ ఫోరం ప్రతినిధులు, ఉద్యమకారులు అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను సమర్పిస్తారని చెప్పారు. సోమ వారం తెలంగాణ పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ కోసం పలు వాగ్దానాలు చేసినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీతోసహా ఇతర రాజకీయ పార్టీలు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యమకారుడికి ప్రతినెల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథ కాల్లో 20 శాతం కోటా ఉద్యమ కారులకు కేటాయించాలని, ఉద్యమకారులను స్వాతంత్ర్య సమర యోధులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జంగా సుదర్శన్, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, విష్ణు వర్ధన్, నరేందర్‌గౌడ్, కోలా జనార్దన్, జెరు షాలెం మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రదర్శిస్తున్న కోలా జనార్దన్, డాక్టర్ చీమా శ్రీనివాస్

# నోటిఫికేషన్‌తరువాతనేఅడ్మిషన్లు తీసుకోవాలి

- మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా ప్రకటనలు ఇవ్వరాదు
- త్వరలో అనుబంధ గుర్తింపు పూర్తి
- మాటామంతిలో మంత్రి సబిత, ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లను నోటిఫికేషన్ కంటే ముందుగానే తీసుకుంటే చర్యలు తప్పవని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ స్పష్టం చేశారు. అలాగే కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీలు పత్రికలు, ఛానల్స్‌లో ఇవ్వదలచిన ప్రకటనలకు సంబంధించి ముందుగానే ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసిన మాని టరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. జూనియర్ కాలేజీలు కరపత్రాల ప్రచారానికి సంబంధించి.. అలాగే వాల్ రైటింగ్‌కు సంబంధించి కూడా తప్పనిసరిగా మానిటరింగ్ కమిటీ అనుమతి తీసుకో వాలన్నారు. మంగళవారం ఇంటర్ ఫలితాల అనంతరం విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ విలేకరులతో కొద్దిసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు ఇష్టానుసారంగా ప్రకటనలు ఇవ్వడానికి లేదని స్పష్టం చేశారు. మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా ప్రకటనలు జారీ చేస్తే ప్రకటనలకు ఎంత ఖర్చు చేశారో అంతే మొత్తం ఫైన్ వేస్తామన్నారు. కాలేజీలు ప్రచారం చేసుకునే కరపత్రాలు, వాల్‌రైటింగ్ కోసం కూడా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. కాలేజీలకు సంబంధించిన వివరాలను.. అలాగే విద్యార్థి సాధించిన విజయాలను ప్రచారం చేయాలనుకుంటే.. ఆయా కాలేజీల కోడ్‌లను తప్పనిసరిగా రాయాలన్నారు. అలాగే విద్యార్థి విజయాలను ప్రచారం చేసుకునే క్రమంలో అతని హాల్‌టికెట్ నంబర్ తప్పనిసరిగా రాయాలన్నారు. అలాగే నీట్, జేఈఈ, ఎంసెట్‌లో తప్పకుండా ర్యాంకులు అంటూ ప్రచారం చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే.. ఇంటర్ బోర్డున ఇబంధనల మేరకు వారికి తగిన పెనాల్టీతోపాటు ఇతర చర్యలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలకు సంబంధించిన అనుబంధ గుర్తింపు(అఫ్లియేషన్) త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రభుత్వరంగ కాలేజీలకు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అనుబంధ గుర్తింపును పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు సంబంధించిన గుర్తింపు ప్రక్రియ 40 శాతం పూర్తి అయిందని.. త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. జూన్ 1 నుంచి ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా క్లాసులను ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే ఇంటర్ అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని తెలిపారు. నోటిఫికేషన్‌ను జారీ చేసిన తరువాతనే ఇంటర్ అడ్మిషన్లను చేపట్టాలని స్పష్టం చేశారు.

# అయిదు, ఆరేళ్లుగా ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గత 5, 6 ఏళ్లుగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఉత్తీర్ణతలో బాలికలే ముందంజలో ఉంటు న్నారు. ఉత్తీర్ణతా శాతంలో సెకండియర్‌తోపాటు మొదటి సంవత్సరం ఫలితా ల్లోనూ బాలికలే ముందుంటున్నారు. సెకండియర్ ఫలితాల్లో బాలుర కంటే బాలికల ఉత్తీర్ణత 15.97 శాతం ఎక్కువగా ఉండగా.. మొదటి సంవత్సరంలో 14.02 శాతం ఉత్తీర్ణత ఎక్కువగా సాధించారు. మొదటి సంవత్సరంలో 23 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేయగా.. ఒక్కరి ఫలితాలను విత్‌హెల్డ్‌లో పెట్టారు. ఇక ద్వితీయ సంవత్సరంలో 46 మందిపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేయగా.. 11 మంది విద్యార్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో పెట్టారు. మొదటి సంవత్సరంలో 4,82,675 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 2,97,741 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 61.68 శాతంగా నమోద.

# జనాభా కంటే సెల్‌ఫోన్లు ఎక్కువ!

## 3.5 కోట్ల జనాభాకు 4 కోట్ల కనెక్షన్‌లు

## దేశంలోనే అత్యధికం: సిఎస్ శాంతికుమారి

**హైదరాబాద్ మే 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం అనే టెలికాం సూచిలలో ఇతర రాష్ట్రాల కంటే చాలా ముందుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధ్యక్షత స్టేట్ బ్రాడ్‌బ్యాండ్ కమిటీ సమావేశంలో టెలికాం రంగంలో మౌలిక సదుపాయాలకు సంబంధించి ఇంటర్ డిపార్ట్‌మెంట్ సమస్యలపై చర్చించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, ఐటి ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, ఆర్ అండ్ బి కార్యదర్శి శ్రీనివాసరాజు, పి అండ్ ఆర్ కార్యదర్శి సందీప్‌కుమార్‌సుల్తానియాతో పాటు బిఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు. ఖదాపు 3.5కోట్ల జనాభాకు నాలుగు కోట్లకు పైగా మొబైల్ కనెక్షన్‌లతో టెలిసాంద్రత 107శాతం దేశంలో అత్యధికం అన్నారు. 97.7శాతం గ్రామాలు మొబైల్ కనెక్టివిటితో ఉన్నాయన్నారు. దేశంలో 5 జి ప్రారంభించిన అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటన్నారు. పెండింగ్‌లో ఉన్న రైట్ ఆఫ్ వే దరఖాస్తుల పరిస్థితిని సమావేశంలో సమీక్షించారు.

5 జి సేవలను వేగవంతం చేసేందుకు వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఏ రకమైన తవ్వకాలనైనా ప్రారంభించేందుకు కాల్ బి ఫోర్ యు డిగ్ యాప్ ద్వారా ముందస్తు సమాచారం అందించిన తరువాత తవ్వకాలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని ఇంజనీరింగ్ విభాగాలు ముందుగా యాప్‌ను ఉపయోగించేలా అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వా ప్రధాన కార్యదర్శి కోరారు.

# ఆత్రేయపురం చిన్నపేటలో మహిళ హత్య

**ఆత్రేయపురం, మే 9, ప్రభాతవార్త :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన ఆత్రేయపురం చిన్నపేటలో నక్క మహాలక్ష్మి (50) అనే వివాహిత దారుణ హత్యకు గురైంది. దీనిపై రావులపాలెం సిఐ రజిని కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు స్థానిక ఎస్సై సిహెచ్ సుధాకర్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. ఆత్రేయపురం చిన్నపేటలో నక్క మహాలక్ష్మి వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. అయితే రెండు పోర్షన్లు గల ఇంటిలో ఒక పోర్షన్‌లో ఈమె నివాసం ఉంటున్నారు. రెండో పోర్షన్‌లో ఆమె కొడుకు, కోడలు ఉంటున్నారు. మంగళవారం మద్యాహ్నం స్థానికులు ఫిర్యాదు మేరకు ఆత్రేయపురం పోలీసులు ఆమె ఇంటిని సోదా చేసి చూశారు. చూడగా మృతురాలు నక్క మహాలక్ష్మి ముఖంపై రక్తపు గాయాలతో చేతులు మెలితిరిగి శవమై కనిపించింది. దీనిపై కేసు నమోదు చేశారు. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిసు _న్నట్లు ఆత్రేయపురం ఎస్సై సిహెచ్ సుధాకర్ తెలిపారు.

# జార్ఖండ్ నక్సల్స్ కాల్పుల్లో నగరవాసి మృతి

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), మే 9, ప్రభాతవార్త :** జార్ఖండ్ రాష్ట్రంలో నక్సలైట్లు నగరానికి చెందిన ఓ వ్యక్తిని కాల్చి చంపారు. హైదరాబాద్ కొత్తపేటలోని విజయపురికాలనీలోని సన్‌షైన్ అపార్ట్మెంట్లో వీ.శరత్‌బాబు(55) నివాసం ఉంటున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సబ్యుడు సీఎం రమేష్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో ఒరిస్సాలో జరిగిన ప్రాజెక్టు వర్క్‌లో కూడా ఇతను పనిచేశాడు. కాంట్రాక్టు వర్క్ విషయమై నాలుగు రోజుల క్రితం శరత్‌బాబు ఝార్ఖండ్ వెళ్ళాడు. కాగా మంగళవారం విధి నిర్వహణ నిమిత్తం వాహనంలో వెళ్తుండగా అతన్ని కాల్చి చంపారు. శరత్‌బాబుకు భార్య ఒక కొడుకు ఉన్నారు. మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో అర్ధరాత్రి వరకు నివాసానికి తీసుకు వస్తున్నట్లు బంధువులు తెలిపారు. శరత్‌బాబు మృతితో స్థానికంగా విషాద ఛాయలు నెలకొన్నాయి.

# చీకోటి ప్రవీణ్‌కు ఇడి మరోసారి తాఖీదులు

## మరో ఇద్దరికి కూడా నోటీసులు

## 15న విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** క్యాసినో నిర్వాహకుడు హైదరాబాద్‌కు చెందిన చీకోటి ప్రవీణ్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు మరోసారి తాఖీదులు జారీ చేశారు. ఈ నెల 15వ తేదీన విచారణకు రావాలని అందులో ఆదేశించారు. థాయ్ లాండ్‌లో ఇటీవల వెలుగుచూసిన గ్యాంబ్లింగ్ వ్యవహారంలో చీకోటి సహా 90 మంది వరకు పట్టుబడడం తెలిసిందే. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా వున్నారు. వీరిలో కొందరు రాజకీయ నేతలు, ఇంకొందరు సర్కారీ విభాగాల అధికారులున్నారు. అక్కడి ఘటనలో వీరంతా అరెస్టు కావడం, బెయిలుపై విడుదల కావడం తెలిసిందే. కాగా ఈడీ అధికారులు చీకోటి ప్రవీణ్‌తో పాటు అతని అనుచరులు సంపత్, మాధవ రెడ్డిలకు కూడా నోటీసులు ఇచ్చారు. థాయ్‌లాండ్ ఘటనలో అక్కడ పట్టుబడ్డ వారంతా ఫెమా నిబంధనలను ఉల్లంఘించి నట్లు ఈడీ గుర్తించిందని సమాచారం. ఈ క్రమంలోనే ఇందులో కొందరిని విచారించేందుకు ఈడీ రెడీ అయినట్లు సమాచారం. వీరి విచారణ వారం పది రోజులకు పైగా సాగే వీలుందని సమాచారం.

# గంజాయి పట్టివేత 'వార్త' వరుస కథనాలపై స్పందించిన పోలీసులు

## - పోలీసుల అదుపులో గంజాయి క్రయ విక్రయదారులు

త అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. గంజాయి అక్రమ రవాణాపై ' వార్త ' వరుస కథనాలపై పోలీసులు స్పందించారు. గంజాయి స్మగ్లర్లను అరికట్టేందుకు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్న లక్షల రూపాయల విలువైన గంజాయిని సీజ్ చేశారు. తుని నుంచి అడ్డదారిలో తరలిస్తున్న గంజాయిని అయినవిల్లి మండలం క్రాప గ్రామంలో స్మశానవాటిక వద్ద క్రయ విక్రయాలు జరుపుతుండగా ఓ అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గంజాయిని క్రయ విక్రయాలు జరుపుతుండగా దాడి చేసి గంజాయితో పాటు ముగ్గురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి అయినవిల్లి ఎస్సై ఎస్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తునికి చెందిన కర్రి సత్తిబాబు 900 గ్రాములు గంజాయిని తీసుకుని వచ్చి క్రాప గ్రామంలో సోమవారం రాత్రి స్మశానవాటిక వద్ద కాకినాడకు చెందిన జన్నాధం రాజేష్, ఫ్రెంచ్ యానాంకు చెందిన బల్లా వెంకట శివాజీలకు విక్రయిస్తుండగా ఓ అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో మాటువేసి గంజాయిని పట్టుకుని సీజ్ చేయడమే కాకుండా గంజాయిని క్రయ విక్రయాలు జరుపుతున్న ఆ ముగ్గురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు... ఇందులో పాత్రదారులు ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.



వరుస కథనాలపై పోలీసులు స్పందించారు. గంజాయి స్మగ్లర్లను అరికట్టేందుకు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్న లక్షల రూపాయల విలువైన గంజాయిని సీజ్ చేశారు. తుని నుంచి అడ్డదారిలో తరలిస్తున్న గంజాయిని అయినవిల్లి మండలం క్రాప గ్రామంలో స్మశానవాటిక వద్ద క్రయ విక్రయాలు జరుపుతుండగా ఓ అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గంజాయిని క్రయ విక్రయాలు జరుపుతుండగా దాడి చేసి గంజాయితో పాటు ముగ్గురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి అయినవిల్లి ఎస్సై ఎస్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తునికి చెందిన కర్రి సత్తిబాబు 900 గ్రాములు గంజాయిని తీసుకుని వచ్చి క్రాప గ్రామంలో సోమవారం రాత్రి స్మశానవాటిక వద్ద కాకినాడకు చెందిన జన్నాధం రాజేష్, ఫ్రెంచ్ యానాంకు చెందిన బల్లా వెంకట శివాజీలకు విక్రయిస్తుండగా ఓ అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో మాటువేసి గంజాయిని పట్టుకుని సీజ్ చేయడమే కాకుండా గంజాయిని క్రయ విక్రయాలు జరుపుతున్న ఆ ముగ్గురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు... ఇందులో పాత్రదారులు ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు



జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ గంగారం అహిర్‌తో సమావేశమైన సిఎస్ శాంతికుమారి, డిజిపి అంజనీకుమార్

# జాతీయ బిసి కమిషన్ ఛైర్మన్‌తో సిఎస్, డిజిపి భేటీ

**హైదరాబాద్ మే 9, ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల జనగణన, సమస్యలు తదితర అంశాలను పరిశీలించేందుకు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ గంగారం అహిర్ హైదరాబాద్ పర్యటనకు విచ్చేశారు. ఆయన వెంట జాతీయ బిసి కమిషన్ సలహాదారు రాజేష్ కుమార్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ఛైర్మన్ అహిర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి అంజనీకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఒకరోజు పర్యటన నిమిత్తం హైదరాబాద్ వచ్చిన అహిర్‌తో హరిత ప్లాజాలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ బలహీనవర్గాల పథకాలను గూర్చి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివరించారు. రాష్ట్రం బడుగు, బలహీనవర్గాలకు అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులను గూర్చి తెలియచేశారు. అంతేకాకుండా ఓబీసీలకు రిజర్వేషనప్లు, రిజర్వేషన్లలో రోస్టర్ అమలును గూర్చి వెల్లడించారు. కాగా రాష్ట్రంలో మహిళల భద్రత కోసం ఏర్పాటుఉ చేసిన షీ టీమ్స్, పోలీస్ విభాగం చేపట్టిన వివిధ కార్యక్రమాలనఉ గూర్చి డీజీపీ అంజనీకుమార్ తెలియచేశారు. అదేవిధంగా జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ గంగారంతో మెదక్‌లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీఎండీ, భారత్ డైనమిక్ లిమిటెడ్ (బీడీఎల్) చీఫ్, హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీల ఛాన్సలర్లు, డీడీ న్యూస్ రీజినల్ హెడ్ తదితరులు భేటీ అయ్యారు.

# జూనియర్ పంచాయతీ సెక్రటరీలను క్రమబద్ధీకరణ చేయండి

## అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీకే దిక్కులేదా?

## సిఎం కెసిఆర్‌కు టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జూనియర్ పంచాయతీ సెక్రటరీలను క్రమబద్దీకరణ చేయాలని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సిఎం కెసిఆర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం బహిరంగ లేఖ రాసారు. మీ ప్రభుత్వంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి బానిసల కంటే హీనంగా మారిందన్నారు. వాళ్లతో గొడ్డు చాకిరి చేయించుకోవడం తప్ప, వారి హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ప్రదర్శిస్తోందన్నారు. న్యాయంగా వారికి దక్కాల్సిన హక్కు అయిన ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, గత 12 రోజుల నుంచి సమ్మె చేస్తున్న మీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదన్నారు. ఎంత సేపు రాజకీయాలే తప్ప జూనియర్ పంచాయతీ కార్యదర్శుల గోసను పట్టించుకునే సోయి లేకుండా పోయిందన్నారు. దేశంలోనే మా పంచాయతీలు ఆదర్శం అందుకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తుందని గొప్పలు చెప్పుకుంటుందన్నారు. ఆ గొప్పల వెనుక పగలనక, రాత్రనక కుటుంబాలను సైతం పట్టించుకోకుండా పంచాయతీ కార్యదర్శులు పడిన శ్రమ ఉందన్నారు. వారి కష్టంలో రాష్ట్రంలోన గ్రామపంచాయతీలకు 79 అవార్డులు వచ్చాయన్నారు. నూతన పంచాయతీ రాజ్ చట్టం మేరకు గ్రామాల అభివృద్ధి కోసం బాండ్ లేబర్ మాదిరిగా మూడేళ్ల ప్రొబేషనరీ పిరియడ్‌తో 2018లో నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. 2019 నప్రిల్ 12న 9355 మందిని పలు రకాల షరతులను విధించి రూ.100రూపాయల బాండ్ పేపర్ మీద సంతకాలు తీసుకుని ఉద్యోగాలు తీసుకున్నారన్నారు. మూడు సంవత్సరాల పిరియడ్ 2022 నప్రిల్ 11న పూర్తయిందన్నారు. అయితే వారిని క్రమబద్ధీకరణ చేయకుండా వారి ప్రొబేషనరీ పిరియడ్‌ను పెంచుతున్నట్లు సిఎం హోదాలో అసెంబ్లీలో ప్రకటన చేశారన్నారు.

# టాప్ మార్కులతో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు

> మొదటి సంవత్సరంలో బైపిసిలో 434 మార్కులు.. ఎంపిసిలో 465 మార్కులు
>
> సెకండియర్‌లో ఎంపిసిలో 991 మార్కులు.. బైపిసిలో 990 మార్కులు సాధించిన విద్యార్థులు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు టాప్ మార్కులు సాధించి తామేమీ ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల విద్యార్థులకు తక్కువ కాదని నిరూపించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివి ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు గానూ ఎంపీసీలో 991 బైపీసీలో 990 మార్కులను సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 465 మార్కులను సాధించగా.. బైపీసీలో 434 మార్కులను సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివి అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులతోపాటు.. గురుకులాల్లో చదివే విద్యార్థులకు తామేమీ తీసిపోలేదని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివిన విద్యార్థులు 99 శాతం మార్కులు సాధించి నిరూపించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ హుజూర్‌నగర్‌కి చెందిన ఎస్‌వి వైష్ణవీ దేవి ఎంపీసీలో 1000కి 991 మార్కులు సాధించింది. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజ్ భైంసాకు చెందిన జవేరియా ఫిర్దోస్ నిబా ఎంపీసీలో 1000 మార్కులకు గానూ 990 మార్కులను సాధించింది. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ న్యూమలక్‌పేట్‌కి చెందిన మీనాక్షి 986 మార్కులను.. ఏఎస్ఆర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ సంతోషినగర్, ఖమ్మంకు చెందిన తప్పెట రోహిణి బైపీసీలో 1000కి 990 మార్కులను సాధించింది. బైపీసీలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ సొక్కయ్యగుట్ట, బీంగల్‌కు చెందిన నిచ్చమొల్ల సౌమ్య బైపీసీలో 1000కి 989 మార్కులు సాధించింది.

ఒకేషనల్ కోర్సులో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గోదావరిఖనికి చెందిన టేకు రజిత 1000కి 989 మార్కులు సాధించింది. సీఈసీలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రాజేంద్రనగర్‌కు చెందిన వర్య మంజుల మంగియా చౌహాన్ 1000కి 973 మార్కులను సాధించాడు. హెచ్ఈసీలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఫర్ గరల్స్ సత్తుపల్లికి చెందిన దాసరి సిరి 1000కి 972 మార్కులను సాధించింది. మొదటి సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ బాయ్స్, పెద్దపల్లికి చెందిన ఉట్ల సాయి అమూల్య 470కి 465 మార్కులు, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గరల్స్, ఫలక్‌నూమాకు చెందిన సైమా జమా 470కి 465 మార్కులు సాధించింది. బైపీసీలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఖమాన్‌పూర్‌కి చెందిన రాడారపు శ్రీనిధి 440కి 434 మార్కులను సాధించింది.

గవర్నమెంట్ జూనియరన కాలేజ్, గూడూరుకి చెందిన ఉప్పునూతల రుచిత 440కి 432 మార్కులు సాధించింది. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ తాండూర్‌కి చెందిన సైదా ఆసిఫియా హాష్మీ బైపీసీలో 440కి 432 మార్కులు సాధించింది. హెచ్ఈసీలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, హన్మకొండకి చెందిన కల్లా సందేష్ 500కి 487 మార్కులు సాధించాడు. సీఈసీలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, నాంపల్లికి చెందిన సానియా 500కి 481 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరంలో ఒకేషనల్ కోర్సులో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, గోదావరిఖనికి చెందిన కన్నూరి రాజలక్ష్మి 500కి 496 మార్కులు సాధించింది

# విశ్వనగరంగా ముందుకు దూసుకెళ్తోన్న హైదరాబాద్



### రూ. 985కోట్ల ఖర్చుతో స్ట్రాటజిక్ నాలా అభివృద్ధి కార్యక్రమం

### అత్యాధునిక వసతులున్న వైకుంఠధామాన్ని

### ప్రారంభించిన ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్

### అద్భుతమంటూ అధికారులకు ప్రశంసలు

**హైదరాబాద్ (బేగంపేట), మే 9, ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరం విశ్వ నగరంగా మరింత అభివృద్ధి చెందుతున్నదని, ముఖ్యమంత్రి కెసిఆర్ విజన్‌తో భాగ్యనగర అభివృద్ధి మరింతగా కొనసాగుతోందని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారాకరామారావు అన్నారు. మంగళ వారం కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ పరిధిలోని ధనియాల గుట్టలో నూతనంగా నిర్మించిన వైకుంఠధామం (శ్మశాన వాటిక)ను మంత్రి కెటిఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. సుందరంగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన వైకుంఠధామంలోని ప్రతి ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. హైదరాబాద్ నగరంలో నాలాల అభివృద్దికి రూ. 985 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ప్రతి యేటా వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టా మన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదగాలంటే ఫ్లైఓవర్లు, మెట్రో సౌకర్యాలు, తాగునీటితోపాటు చక్కటి వాతావరణాన్ని అందించే శ్మశాన వాటికలు సైతం అవసరం అని అన్నారు. గతంలో జూబ్లీహిల్స్‌లో మహాప్రస్థానం ఉండేదని, నేడు హైదరాబాద్ నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో వైకుంఠధామాల నిర్మా ణాన్ని ప్రారంభించి పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్‌లో హిందూ, క్రిస్టియన్, ముస్లిం మతాల కోసం ఒకేచోట ఏర్పాటు చేసామని మంత్రి కెటిఆర్ చెప్పారు.

హైదరాబాద్ నగరంలో వరదముంపు ముప్పు తట్టుకునేలా నాలాల అభివృద్దికి రూ. 985 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి అన్నారు. అదే విధంగా ఆగస్టు 15నాటికి హైదరాబాద్ నగరంలో మురుగును పూర్తిగా శుద్ది చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం 3800కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందని మంత్రి ప్రకటించారు. మౌలికవసతుల కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదని ఆయన అన్నారు.

అలాగే ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ ఈ మధ్యకాలంలో హైదరాబాద్ నగరం సందర్శించి న్యూయార్కులా ఉందని అభిప్రాయం వ్యక్తం చేసారని, అలాగే అమెరికాలో నివసిస్తున్న సినీనటి లయ ఈ మధ్య కాలంలో హైదరాబాద్ నగరాన్ని సందర్శించి లాస్‌ఏంజెల్స్‌లా మారిందన్న కితాబు ఇచ్చారని మంత్రి వెల్లడించారు. పల్లె, పట్టణ ప్రగతిలో తెలంగాణా ప్రభుత్వానికి అవార్డులు గెల్చుకుం టున్నదని, ఇది తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. మంచి నాయకులు, మంచి ప్రభుత్వాన్ని ప్రజలు కాపాడుకోవాలని, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభివృద్ధి కోసం అహర్నిశలు తపిస్తుంటాడని, అలాంటి నాయకుడికి ప్రజలు అండగా ఉండి కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు.

త్వరలోనే డబుల్‌బెడ్ ఇళ్లను పంపిణీ చేయనున్నామన్నారు. ప్రజారవాణాను మరింతగా మెరుగు పరుస్తున్నా మన్నారు. హైదరాబాద్ నగరాన్ని ఈ స్థాయిలో నిలబెట్టిన ఈ ప్రభు త్వాన్ని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి కెటిఆర్ కోరారు. కార్యక్రమంలో మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ముఠాగోపాల్, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభిపూర్ రాజు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, కూకట్‌పల్లి నియోజక వర్గంలోని అన్ని డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన అతివేగం

### ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 9 ప్రభాతవార్త :** అతి వేగంతో బైక్‌పై వెళుతూ డివైడర్ ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భూత్పూర్‌కు చెందిన ఆనంద్ (26) తన వ్యక్తిగత పని నిమిత్తం మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అమిస్తాపూర్ వద్ద ఉన్న తన సోదరి నాగమణి (26), మేనత్త వెంకటమ్మ అలియాస్ లక్ష్మమ్మ (60)లు భూత్పూర్‌కు బబయలుదేరారు. భూత్పూర్ మున్సిపల్ హైసూనకల్ వద్ద తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా యూటర్న్ ఉండగా బైక్ అతివేగంగా రావడంతో అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆనంద్ తల డివైడర్‌ను ఢీకొట్టడంతో నుజునుజ్జుగా మారింది. ఘటనా స్థలానికి సిఐ రజితారెడ్డి, ఎస్సై భాస్కర్‌రెడ్డిలు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ రజితారెడ్డి మాట్లాడుతూ అతివేగం వల్లేప్రమాదం జరిగిందని బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం కూడా ఇందుకు కారణమని పేర్కొన్నారు. వాహనదారులు నిదానంగా ప్రయాణించాలని సూచించారు.

## బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం

### పిల్లలను చూడకుండా పదేళ్లుగా అక్కడే ఉద్యోగం

### ఇంటికొచ్చిన గంటలోనే కొడుకు మృతితో విషాదం



శివకార్తిక్ (ఫైల్)

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందుల వల్ల కుటుంబ పోషణకై చౌట్‌పల్లి మోహన్ గల్ఫ్ వెళ్లి డబ్బు సంపాదించుకొని వద్దామని వెళ్లి పది సంవత్సరాలు అక్కడే ఉండి ఇంటి కొచ్చిన గంటలోనే కొడుకు మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నా యి. తండ్రి తన కొడుకు పుట్టిన రెండేళ్లకే ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్ వెళ్లాడు. పదేళ్ల పాటు అక్కడే ఉండి ఒక్కసారి కూడా ఇంటి ముఖం చూడలేదు. కుటుంబ వ్యవహారాలు,పిల్లల బాగోగులు ఫోన్‌లో మాట్లాడి తెలుసుకునేవాడు చాలాకాలం నిరీక్షణ పూర్తయ్యాక ఎట్టకేలకు ఇంటికి బయటు దేరాడు. కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టుకు వచ్చి ప్రేమతో ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికెళ్లిన తర్వాత తాగడానికి నీరు లేకపోవడంతో నీటి డబ్బా తీసుకొస్తానని బైక్‌పైవెళ్లిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయాడు. విగత జీవిగా పడి ఉన్న కొడుకుని చూసి తండ్రి కుప్పకూలి పోయాడు. ఈ ఘటన జగిత్యాలలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన చౌట్‌పల్లి మోహన్, పద్మిని దంపతులకు కుమార్తె హర్ష, కుమారుడు శివకార్తిక్ (12) ఉన్నారు. తండ్రి మోహన్ ఉపాధి నిమిత్తం పదేళ్ల క్రితమే సౌదీ అరేబియా వెళ్లారు. సోమవారం ఆయన గల్ఫ్ నుంచి స్వదేశానికి తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టుకు వెళ్లి తోడ్కొని వచ్చారు. ఇంట్లో తాగునీరు అయి పోవడంతో తాను తీసుకొస్తానని శివకార్తిక్ ద్విచక్రవాహనంపై వెళ్లాడు.బైపాస్ రహదారిలోని దేవిశ్రీ గార్డెన్ సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు .తీవ్రగాయాలవడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యం లోనే చనిపోయాడు. పదేళ్ల తర్వాత తన కొడుకును చూసుకున్న ఆ తండ్రి ఆనందం అంతలోనే మాయమైపోయిందని అంతా కంటతడి పెట్టారు.

## మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి

## లైంగిక వేధింపులు దేశానికే అవమానం




ప్రదర్శనలో పాల్గొన్న సిపిఐ నేతలు అజీజ్ పాషా, సాంబశివరావు, వెంకట్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 9, ప్రభాతవార్త:** ఒలింపిక్, కామన్వెల్త్ పోటీలలో పతకాలను సాధించి భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి బ్రిజ్‌భూషన్‌శరన్‌సింగ్ లైంగిక వేదింపులకు పాల్పడటం దేశానికి అవమానకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అగ్రహాం వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషన్ వంటి నిందితులను కాపాడుతూ న్యాయకోసం పోరాడుతున్న మహిళా క్రీడాకారులను అవమానపరుస్తూ బిజెపి దేశ పరువు ప్రతిష్టలను దిగదార్చు తున్నదని వారు ధ్వజమెత్తారు. గత కొన్ని రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న రెజ్లర్లులకు సంఘీభావంగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్ నుంచి హిమాయత్‌నగర్‌లోని వైజంక్షన్ వరకు మంగళవారం ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే బ్రిజ్‌భూషన్‌ను అరెస్టు చేయాలని, మహిళా రెజ్లర్లుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మైనర్‌తోసహా 7గురు రెజ్లర్లుపై లైంగిక వేధింపులకు పాల్పడిన శరణ్‌సింగ్ విషయంలో బిజెపి కేంద్ర నాయకత్వం ఎందుకు మౌనంగా ఉంటుందని వారు ప్రశ్నించారు. రెజ్లర్లుకు న్యాయం జరిగేంతవరకు సిపిఐ దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, టి.శ్రీనివాస్‌రావు, శంకర్, ఎన్.బాలమల్లేష్, ఇటి నరసింహా , పశ్య పద్మ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాల్‌రాజ్, ఎం.డి.యూసఫ్, బి.హేమంత్‌రావు, ఎస్.ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఆయన నోటికి అడ్డూ.. అదుపు లేదు!

### పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన మంత్రి తలసాని

**హైదరాబాద్ (బేగంపేట), మే 9, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం నూత నంగా నిర్మించి ప్రారంభించిన సచివాలయంపై విపక్షాలు బిఆర్‌ఎస్ సర్కారుపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. మంగళవారం బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ ధనియాలగుట్టలో రూ 8కోట్ల 54లక్షలతో అత్యా ధునికంగా నిర్మించిన వైకుంఠధామాన్ని మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి తలసాని మాట్లాడుతూ తీవ్రపదజాలంతో ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. సెక్రటేరియట్ అనేది ఈ రాష్ట్ర పౌరులందరికీ సంబంధించిన విషయం.. ఈ రాష్ట్రంలోని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం, అందించాలంటే సచివాలయమే కేంద్ర స్థానం. పాత సెక్రటేరియట్ స్థానంలో నూతన భవనాన్ని నిర్మిస్తామంటే ఆరోజు (విపక్షాలు) ఎన్ని గొడవలు చేసారో అందరికీ తెలుసు. కోర్టులను కూడా ఆశ్రయించారు. ఈ రోజు వీరంతా సచివాలయంలోకి మేం కూడా వస్తాం అంటారు. అని నిప్పులు చెరిగారు. ఇది అద్భుతమైన సెక్రటేరియట్ అని, చూస్తే అమెరికాలోని వైట్‌హౌస్ చూడాలి. లేకపోతే తెలంగాణలో మన సచివాలయాన్ని చూడాలి అని తలసాని అభివర్ణించారు. రాజ్యాం గాన్ని తెలంగాణలో అమలు చేస్తున్నామని, సచివాలయానికి కూడా అంబేద్కర్ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో తలసాని టీపీసీసీ చీఫ్ రేవంత్‌పై ఘాటైన పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేసారు. నిన్న ఆమె(ప్రియాంక గాంధీ) వచ్చింది. ఆమె ఒక డిక్లరేషన్ ఇచ్చింది. ఆ పొట్టివాడు డిక్లరేషన్ గురించి మాట్లాడుతాడు. ఆయన నోటికి అడ్డు అదుపు లేదు. ఎమ్మెల్యే, మంత్రి లేదు. అందరి గురించి అవాకులు, చవా కులు మాట్లాడుతాడు అంటూ రేవంత్‌రెడ్డి గురించి పరుషంగా మాట్లా డుతూ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించారు. ఇంకొకరు మతాల మధ్య చిచ్చుపెట్టేలా ప్రవర్తిస్తున్నారు. వీరు మాకు బొట్టు పెట్టుకోవడం నేర్పు తారా? వారు సొంతంగా ఏమైనా ఆలయాలు నిర్మించారా? మతాల మధ్య, కులాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపు కోవాలని చూడటం దారుణమైన చర్య అన్నారు. చేసిన అభివృద్ధి ఏమి లేనపుడే ఇలా రెచ్చగొడుతుంటారని, ప్రజలకు అభివృద్ధి ఎవరూ చేస్తున్నారన్న విషయం ఇప్పటికే పూర్తిగా అర్థమైందని, ప్రజలు అలాంటి పగటి వేషగాళ్లను నమ్మరని తలసాని అన్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా తార్నాక ఆర్టీసి ఆస్పత్రి

### ● అందుబాటులోకి మరో 25 ఐసియు పడకలు: ఎండి విసి సజ్జనార్



తార్నాక ఆర్టీసి హాస్పిటల్‌లో ఆపరేషన్ థియేటర్లను ప్రారంభిస్తున్న ఎండి విసి సజ్జనార్

**హైదరాబాద్ (తార్నాక), మే 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల ఆరోగ్యానికి సంస్థ పెద్ద పీట వేస్తూ కార్పొరేట్ హాస్పిటల్‌ళ్లకు ధీటుగా ఆసుపత్రిలో సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీఎస్‌ఆర్టీసీ ఎండి వీసి సజ్జనార్ పేర్కొన్నారు. తార్నాక ఆర్టీసీ హాస్పిటల్లో నూతనంగా నిర్మించిన 4సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు 15 బెండ్ల మెడికల్, 10 బెడ్ల సర్జికల్ ఐసీయూలను మంగళవారం ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ థియేటర్లలోని వైద్య పరికరాలను పరిశీలించి హాస్పిటల్లో సిబ్బందికి అందుతున్న వైద్య సేవలను డాక్టర్లతో అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్య సంక్షేమంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించిచడంతో పాటు సంస్థ అభ్యున్నతి దిశగా తీసుకెళ్లడానికి అందరి సహకారంతో ముందుకు వెళ్లుతున్నానని వెల్లడించారు. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో కూడిన 4సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్)లో మద్ద తుతో 25 ఐసీయూ బెడ్లతో పాటు అవసరమైన పరికరాలను సమకూ ర్చుకుం టున్నామని చెప్పారు. ఈ ఆసుపత్రిపై గతంలో చాలా ఫిర్యాదులు వచ్చేయని నేడు ఆ పరస్థితిలేకపోవడం మంచి పరిణామం అన్నారు.

**ఉద్యోగుల ఆరోగ్యం కోసం**

**హెల్త్ వలంటీర్ల వ్యవస్థ: ఎండి సజ్జనార్**

తార్నాక ఆర్టీసీ హాస్పిటల్లో ఉద్యోగుల సౌకర్యం కోసం కొత్తగా వాలంటీర్లను అన్ని డిపోలల్లో ఏర్పాటు చేస్తున్నామని ఎండి సజ్జనార్ పేర్కొన్నారు. వీరు ఉద్యోగుల ఆరోగ్యకరమైన అలవాట్లపై మాట్లాడుతారని, నిత్యం కౌన్సిలింగ్‌తో పాటు పలు సూచనలు చేస్తారని వెల్లడించారు. డాక్టర్లు సూచించిన సమయానికి అనుగుణంగా మందులు వేసుకునేలా, ఆహారపు అలవాట్లపై వీరు సూచిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, సీపీఎం ఎస్.కృష్ణకాంత్, సీసీవోఎస్ విజయభాస్కర్, సీసీఈ రాంప్రసాద్, తార్నాక హాస్పిటల్లో ఓఎస్డీ సైదిరెడ్డి, ఆసుపత్రి సూపరెండెంట్ డా. శైలజామూర్తి, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డా. శ్రీనివాస్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గెలుపు కోసం కాంగ్రెస్ వ్యూహం

### రాష్ట్రమంతా విలేజ్ కమిటీల ఏర్పాటు

### కాంగ్రెస్ వర్సెస్ బిఆర్‌ఎస్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ దృష్టి సారించింది. అందులో భాగంగానే విలేజ్ కమిటీలపై దృష్టి సారించింది. ఇక రానున్న రోజుల్లో కాంగ్రెస్ త్రిముఖ పోటీ పడే అవకాశం కనిపిస్తుంది. బిఆర్‌ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మద్య పోటీ నెలకొందని చెప్పొచ్చు. అందులో భాగంగానే గ్రామీణ ఎన్నికల బృందాలపై దృష్టిసారించింది. ప్రతి మండలంలో కనీసం 25 మంది సభ్యులతో ఎన్నికల బృందాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇందులో 40 శాతం మంది మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బిసిలతో పాటు 50 సంవత్సరాలలోపు వారు ఉంటారు. ఈ నెలాఖరులోగా రూరల్ ఎన్నికల టీమ్‌లు అన్ని అందుబాటులోకి రానున్నాయి. ముందస్తు ప్రచారశిక్షణ తరగతుల అనం తరం ఆ బృందం గ్రామాల్లో ప్రచారం చేయ నున్నారు. తెలంగాణలో ఉన్న 119 నియోజకవర్గాలోని 600 మండలాలలో 13 వేలకు గ్రామపంచాయతీలు ఉన్నాయి.

### ఇంటర్‌లో ఫెయిల్ అవుతానని..

## ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి ఉత్తీర్ణత



కృష్ణ (ఫైల్)

**కేసముద్రం, మే 9, ప్రభాతవార్త:** ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అవుతా నేమోనన్న భయంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి తీరా ఫలితాలు వచ్చిన తర్వాత ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించిన సంఘటన మహబూ బాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో చోటు చేసుకుంది. అప్పటికే కొడుకును పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంతో ఉన్న ఆ తల్లిదండ్రులు తమ వాడు ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడయ్యాడని తెలిసి గుండెలవిసేలా రోదిస్తు న్నారు. కేసముద్రం మండలంలో పీక్లాతండా శివారు బోడగుట్టతండా ఈ విశాదానికి వేదికగా నిలిచింది. తండాకు చెందిన గుగులోతు లచ్చు, జో  ్యతిలకు ఒక కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్దవాడైన గుగులోతు కృష్ణ (19) ఇటీవల ఏటూరునాగారం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి వార్షిక పరీక్షలకు హాజరయ్యాడు. మొదటి నుండి డాక్టర్ కావాలని కలలు కంటూ శ్రద్దగా చదివి ఇంటర్మీడియట్ బైపీసి పూర్తి చేసాడు. డాక్టర్ కావాలనుకున్న తన కోరికను కూడా ఇంట్లోని తన గదిలో నినాదాల రూపంలో రాసుకున్నాడు. పరీక్షలు రాసి ఇంటికొచ్చిన కృష్ణ ఒకరోజు తల్లి దండ్రులు ఇంట్లోలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటర్ పరీక్షలు తాను సరిగా రాయలేకపోయానని, డాక్టర్ కావాలనుకున్న కోరిక తీరని పరిస్థితి ఉందని అందుకే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఉరివేసుకునే ముందు కృష్ణ వదిలిన సూసైడ్ నోట్‌లో పేర్కొ నడంతో అప్పుడు దీనిపై పోలీసు కేసు కూడా నమోదైంది. కాగా మంగళవారం వెలువడిన ఇం టర్ ఫలితాల్లో కృష్ణ 1000మార్కులకు 892 మార్కులు సాధించి ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడయ్యాడు.

# ఓఆర్‌ఆర్ పచ్చదనానికి ముగ్గురు ఐఎఫ్‌ఎస్‌ల బృందం

### డ్రిప్ సిస్టమ్, పూలమొక్కలపై అధ్యయనం

### పచ్చదనం ప్రత్యేకతలను వివరించిన డైరెక్టర్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ఔటర్‌రింగ్ రోడ్డు పచ్చదనాన్ని చూసి ఇండియన్ ఫారెస్టు సర్వీస్ అధికారులు ఫిదా అయిపోయారు. దేశంలో ఎక్కడా లేదనివిధంగా ఏకంగా 160 కిలోమీటర్ల మేరకు పచ్చదనం నిర్వహణ కోసం నిరంతరంగా పనిచేసే ఓఆర్‌ఆర్ డ్రిప్ సిస్టం స్కోడా సెంటర్ పనితీరును ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం అధ్యయనం చేసింది. 1989 నుంచి 2014 బ్యాచ్‌లకు చెందిన తొమ్మిది రాష్ట్రాల నుంచి 16 మంది ఐఎఫ్ఎస్ అధికారుల బృందం 'ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్ మెంట్ : నీడ్ అండ్ మెథడ్స్ ఫర్ అసెస్‌మెంట్' అనే అంశంపై కంపల్సరీ ట్రైనింగ్ కోర్సులో భాగంగా మంగళవారం ఓఆర్‌ఆర్ గ్రీనరిని ఆద్యంతరం సందర్శించారు. వీరిలో 1989 బ్యాచ్‌కు చెందిన సీనియర్ పిసిసిఎఫ్ ఓంప్రకాష్ సింగ్ ఉన్నారు. ఓఆర్‌ఆర్ నిర్వహణలో తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎండిఎ అర్బన్ ఫారెస్టు డైరక్టర్ డా.బి.ప్రభాకర్ ఓఆర్‌ఆర్ గ్రీనరి నిర్వహణలో తీసుకుంటున్న మెలకువలను వివరించారు. వరల్డ్ గ్రీన్ అవార్డు అందుతున్న తరువాత తమ బాధ్యత ఎంతో పెరిగిందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ మార్గదర్శకంతో, మెట్రోపాలిటన్ కమిషనర్ అరవింద్‌కుమార్ పర్యవేక్షణలో అనతి కాలంలోనే ఔటర్ రింగ్ రోడ్డు గ్రీనరి నిర్వహణ కోసం ప్రత్యేకంగా డ్రిప్ సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఓఆర్‌ఆర్ మొత్తం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు జరిగాయని ప్రభాకర్ వారికి వివరించారు. ఓఆర్‌ఆర్ క్షేత్రస్థాయి పర్యటన తదుపరి నానక్‌రాం గూడలోని ఓఆర్‌ఆర్ డ్రిప్ ఆటోమేషన్ సెంటర్ పనితీరును ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం అధ్యయనం చేసింది, ఓఆర్‌ఆర్ మీద వివిధ రకాల ఫ్లవరింగ్ ప్లాంట్లు చూసి అధికారులు ముగ్ధులయ్యారు. యేడాది పొడవుగా ఔటర్ రింగ్‌రోడ్డుపై పూల మొక్కలు కనువిందు చేస్తాయని ప్రభాకర్ వారికి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంట సర్వీస్ రోడ్డులో ఉన్న సోలార్ సైకిల్ ట్రాక్ పనులను కూడా ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం పరిశీలించింది. ఆ తరువాత వారు హెచ్‌ఎండిఏ దుండిగల్ నర్సరీని పరిశీలించారు.



మహేశ్వరం నియోజకవర్గంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్న సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క తదితరులు

## భూములను దోపిడీ చేస్తున్న

## కెసిఆర్ సర్కార్‌ను గద్దె దింపుతాం

### పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సిఎల్పీ నేత భట్టి విక్రమార్క

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మే 9, ప్రభాతవార్త:** గత కాంగ్రెస్ పాలనలో పేదలకు, రైతులకు ఇచ్చిన భూములను దోపిడీ చేస్తున్న బిఆర్‌ఎస్ ప్రభు త్వాన్ని గద్దె దింపుతామని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్యాయానికి గురవుతున్న ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోల్పోయిన భూములను, ఇంటి స్థలాలను ప్రజలకు తిరిగి పంపిణీ చేస్తామని ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్ మార్చ్ పేరిట భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర మహేశ్వరం నియోజకవర్గానికి చేరుకుంది. 54వ రోజు పాదయాత్ర మంగళవారం నియోజకవర్గంలోని జిల్లెలగూడ నుండి ప్రారంభమై మీర్‌పేట్, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్, నాదర్‌గుల్‌ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదలకు, రైతులకు ఇచ్చిన భూముల వివరాలను నియోజకవర్గాల వారీగా లెక్కలు తీస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 25 లక్షల కోట్ల విలువ చేసే ప్రజల భూములను కెసిఆర్ ప్రభుత్వం బలవంతంగా లాక్కున్నదనీ ఇది అతిపెద్ద కుట్ర అని ఆయన అభివర్ణించారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఫార్మాసిటీ కోసం రైతులకు చెందిన 500 ఎకరాల భూమిని బలవంతంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుందనీ మరో 400 ఎకరాలు బఫర్ జోన్‌లో పెట్టి ప్రజలకు అన్యాయం చేసిందని భట్టి ఆరోపించారు. ప్రభుత్వం బలవంతంగా గుంజుకున్న భూముల్లో బాధితులతోనే దున్నిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం...

**-ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్**

**కొల్లిపర,మే 9 ప్రభాతవార్త:** అకాల వర్షాలకు తడిచి పోయి పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు.మంగళవారం మండల పరిధిలోని చివలూరు,కొల్లిపర,తూములూరు,అన్నవరం తదితర గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న,జొన్న,వసువు పంటలను వ్యవసాయ



అధికారులు,నాయకులతో కలసి ఆయన పరిశీలించారు.జరిగిన పంట నష్టంపై రైతులను వివరాలు అడిగారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని రైతులు బాధలు,నష్టాలు,కష్టాలు తనకు తెలుసు అన్నారు.పది రోజుల పాటు పడిన వర్షానికి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించానన్నారు.పంట నష్టంపై కలెక్టర్..జిల్లా వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్ళి రైతులను ఏ విధంగా ఆదుకోవాలో చర్చిస్తామన్నారు.ఇప్పటికే పంట నష్టంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టి తీసుకెళ్ళటం జరిగిందన్నారు.కొందరు రైతులు ఎండు పసుపుకు ధర లేదని..అకాల వర్షాలకు తడవటంతో పంటను కొనే నాథుడు కరువయ్యారని చెప్పటం జరిగిందన్నారు.రైతులను ఆదుకోవటం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.అనంతరం చివలూరులో శిధిలావస్థకు చేరుకున్న కాలినడక వంతెనను పరిశీలించారు.కార్యక్రమంలో చివలూరు సర్పంచ్ బొంతు వేణుగోపాలరెడ్డి,ఎంపిడిఓ శ్రీనివాసులు,తెనాలి ఏడిఏ వెంకట్రావు,ఉద్యానశాఖాధికారి విజయ్‌మోహన్,వైసీపీ మండల కన్వీనర్ ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి,వల్లభాపురం ఉప సర్పంచ్ అవుతు పోతిరెడ్డి,మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి,నాయకులు కళ్ళం వీరారెడ్డి,ఈమని హరికోటిరెడ్డి,జొన్నల శివారెడ్డి,పచ్చవ రమేష్,తాతా శ్రీనివాసరావు,ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి,ఈదా హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టేలా

## చర్యలు తీసుకోండి

### జాతీయ బిసి కమిషన్ చైర్మన్‌కు ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్ మే 9, ప్రభాతవార్త:** దేశంలోని 56శాతం గల బిసిల జనాభా అభివృద్ధికి కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని అలాగే కేంద్రబడ్జెట్‌లో రెండులక్షకోట్లు, పార్లమెంట్‌లో బిసిబిల్లుపెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారామ్‌ను ఎంపి.ఆర్.కృష్ణయ్య



జాతీయ బిసి కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారామ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య తదితరులు

కోరారు. ఈమేరకు హైదరాబాద్ పర్యటనలో ఉన్న చైర్మన్‌ను మంగళవారం తన బృందంతో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గత 75ఏళ్లుగా దేశ జనాభాలో సగభాగం ఉన్న బిసిలకు విద్యా,ఉద్యోగ, ఆర్థిక , రాజకీయ ,సామాజిక రంగాల్లో అన్యాయం చేస్తున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశం కనుక అన్నికులాల వారికి వారివారి జనాభా ప్రకారం వాటా దక్కాలన్నారు. కానీ మనదేశంలో బిసిలకులాలకు ఏరంగంలో కూడా వాటా దక్కలేదన్నారు. అందుకే రాజ్యాంగబద్ధమైన జాతీయ బిసి కమిషన్ జోక్యం చేసుకుని బిసిలకు అన్నిరంగాల్లో వాటా దక్కేలా చూడాలని కోరినట్లు తెలిపారు. చైర్మన్ కలిసిన జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీల వెంకటేష్,నందగోపాల్, వేముల రామకృష్ణ, సుధాకర్, జోషి రాఘవ,నిఃల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



# భద్రం బికేర్‌ఫుల్‌బ్రదరూ!

## కోహ్లీకి రవిశాస్త్రి హెచ్చరిక

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్‌కోహ్లీకి మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి కీలక హెచ్చరికలుచేసాడు. మైదానంలో జాగ్రత్తగా ఉండాలని సూచించాడు. కెమేరాలన్నీ కోహ్లీచుట్టూనే ఉంటాయని, డ్రెస్సింగ్‌రూమ్‌కువెళ్లేవరకూ జాగ్రత్తగా నడుచుకోవాలన్నాడు. ఐపిఎల్ 2023సీజన్‌లోభాగంగా లక్నో సూపర్‌జెయింట్స్‌తోజరిగిన మ్యాచ్ అనంతరం కోహ్లీ గౌతమ్ గంభీర్‌ల వాగ్యుద్ధం వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈసంఘటనపై కోహ్లీ, ధోనీఇలకు కొన్ని సూచనలు చేయాలనుకుంటున్నా, మహేంద్రసింగ్‌దోనీకి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఆతను పక్కాప్రొఫెషనల్. ధోనీ ఎక్కడుంటే అక్కడ కెమేరాలు ఉంటాయన్న అంశం ఆతనికి బాగా తెలుసు. క్రికెట్ రంగానికి ఆతడుచేసిన సేవలకు దక్కిన గుర్తింపు అది. సచిన్‌టెండూల్కర్‌కూడా అంతే సచిన్ ఎక్కడుంటే కెమేరాలన్నీ అటువైపే తిరుగుతాయి. ఈ ఇద్దరిలాగే కోహ్లీకూడా ఈ విషయం గుర్తించాలి. ప్రతినిమిషం అప్రమత్తంగా ఉండాలని రవిశాస్త్రిసూచించాడు. మ్యాచ్ అయిపోయాకా కూడా కెమేరాలన్నీ తనవైపే ఉన్నాయన్నది గుర్తిస్తే చాలు. మన మాటలు చేతలు అదుపులో ఉంటాయి. కెమేరాలద్వారామనం జనాల మనసులు గెలుచుకోవచ్చు. ఎందరికో ఆదర్శంగా మారవచ్చని తెలిపాడు. అలాగే ఒక్కరోజులోనే విలన్‌గా కూడా మారవచ్చని కాబట్టి కోహ్లీ జాగ్రత్తపడితే బెటర్ అన్నాడు.

# ధోనీ వచ్చే ఐపిఎల్‌లో కూడా ఆడటం ఖాయం: సురేష్ రైనా

**చెన్నై:** చెన్నై సూపర్‌కింగ్స్ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఈ ఏడాదే ఐపిఎల్‌కి రిటైర్మెంట్ ప్రకటిస్తాడని కొన్నిరోజులుగా అందుతున్న ఊహాగానాలపై ఆతనికి అత్యంత సన్నిహితుడు అయిన క్రికెటర్ సురేష్‌రైనా అసలు వాస్తవం బయటపెట్టాడు. ధోనీ వచ్చే ఏడాదికూడా ఐపిఎల్‌లో ఆడతాడని ధీమా వ్యక్తంచేసాడు. ఇటీవలే చెన్నైలోని చేపాక్‌స్టేడియంలో ముంబయి ఇండియన్స్‌తో మ్యాచ్ ఢీకొట్టింది. చెన్నై విజయం సాధించగా ఆ మ్యాచ్‌కి కామెంటేటర్‌గా రైనా వ్యవహరించాడు. ధోనీతోకలిసి చేపాక్ స్టేడియంలోరైనా మాట్లాడుతూ కనిపించాడు. ఆ టైమ్‌లో ధోనీ తన రిటైర్మెంట్‌గురించి చెప్పిన వ్యాఖ్యల్ని రైనా బహిర్గతంచేసాడు. ఐపిఎల్ టైటిల్ గెలిచిన తర్వాత మరో ఏడాదికూడా తాను ఐపిఎల్ ఆడతానని ధోనీ నాతో చెప్పాడు. ధోనీ మంచి ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్నాడు. అలాగే చెన్నై టీమ్ కాంబినేషన్‌కూడా బాగుంది. అన్నింటికీ మించి చాలామంది ఆటగాళ్లు ధోనీనుంచి చాలా అంశాలను నేర్చుకుంటున్నారని కానీ ఆతని శరీరం ఏమేరకు సహకరిస్తుందనేదానిపై ఐపిఎల్ భవిష్యత్తు ఉంటుందని, తాను ధోనీతో మాట్లాడిన తర్వాత అర్థమయింది ఏమిటంటే కచ్చితంగా మరో ఏడాది ఐపిఎల్‌లో ఆడతాడని రైనా తెలిపాడు. ఈసీజన్‌లో ఇప్పటివరకూ 11 మ్యాచ్‌లు ఆడిన చెన్నై జట్టు ఆరుమ్యాచ్‌ల్లో విజయం సాధించింది. నాలుగుమ్యాచ్‌ల్లో ఓటమి పాలుకాగా ఒక మ్యాచ్‌వర్షం కారణంగా ఫలితం రాలేదు. 13 పాయింట్లతో సిఎస్కే పాయింట్ల పట్టికలో రెండోస్థానంలో ఉంది. వచ్చే మ్యాచ్‌ను ఢిల్లీకేపిటల్స్‌తో బుధవారం చెన్నైలో ఆడుతుంది.







# గంభీర్ పెద్దమనసు వెల్లడించిన రాహుల్‌శర్మ

**న్యూఢిల్లీ:** ఆర్సీబీ కెప్టెన్‌తో జరిగిన ఘర్షణతో వార్తల్లోకెక్కిన లక్నోజట్టు మెంటార్ గౌతమ్‌గంభీర్ పెద్దమనసు కూడా ఇటీవల వార్తల్లోకి వచ్చింది. గౌతమ్ గంభీర్ తమ కుటుంబానికిచేసిన సాయాన్ని భారత మాజీ క్రికెటర్ రాహుల్‌శర్మ వెల్లడించాడు. గతనెల తనకు ఎంతోకష్టంగా గడిచిందని, మా అత్తకు బ్రెయిన్ హ్యామరేజి వచ్చిందని, తనపరిస్థితి విషమంగా మారిందని, కష్టకాలంలో గంభీర్ అన్న సాయం చేసాడని వెల్లడించాడు. తక్కువసమయంలోనే బెస్ట్ న్యూరాలజిస్ట్ ఆసుపత్రిని అందించారని, మా అత్తకు విజయవంతంగా సర్జరీ జరిగిందని ఆమె ఇపుడు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని వివరించాడు. గౌతమ్ గంభీర్‌కు ఆయన పిఎ గౌరవ్ అరోరాకు ధన్యవాదాలని ఎంతోజాగ్రత్తగాచూసిన గంగారాం ఆసుపత్రికి వారిసి బ్బందికి ధన్యవాదాలని, శ్రద్ధతో చికిత్స అందించిన డాక్టర్ మనీష్ చుగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలని రాహుల్‌శర్మ వెల్లడించాడు. తనభార్య అత్తతోకలిసి దిగినఫోటోలను కూడా తన పోస్టులో షేర్‌చేసాడు.

# ప్లే ఆఫ్స్ రేసుకోసం పోటాపోటీ

## నేడు చేపాక్‌లో సిఎస్కే వర్సెస్ ఢిల్లీకేపిటల్స్



**చెన్నై:** ఐపిఎల్ 2023 సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరువగా ఉన్న చెన్నై సూపర్‌కింగ్స్ మరో ఆసక్తికరపోరుకు సిద్ధం అవుతోంది. ఢిల్లీకేపిట ల్స్‌తో బుధవారం చెన్నై చేపాక్‌లో జరిగే మ్యాచ్‌లో ధోనీ సేన గట్టిపో టీ ఇచ్చేందుకు సిద్ధం అవుతోంది. వరుసగా రెండు ఓటముల తర్వాత ముంబయి ఇండియన్స్‌పై మంచి విజయం సాధించిన చెన్నై ఆరువిజయాలతో పాయింట్స్ టేబుల్‌లో రెండోస్థానంలో ఉంది. ప్లే ఆఫ్స్ చేరాలంటే చెన్నై చివరిమూడు మ్యాచ్‌ల్లోరెండింటిలో గెలవాలి. ఈనేప థ్యంలోనే ఢిల్లీకేపిటల్స్‌ను ఎలాగైనా ఓడించాలని ఆజట్టు భావిస్తోంది.

మరోవైపు వరుస పరాజయాల తర్వాత పుంజుకున్న ఢిల్లీ నాలుగు విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో చివరిస్థానంలో నిలిచింది. ప్లే ఆఫ్స్‌రేసులో నిలవాలంటే ఆ జట్టుప్రతిమ్యాచ్ గెలవాల్సిందే. ఈమ్యా చ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అలాగే సిఎస్కే జట్టు కాంబినేషన్‌పైనా చర్చ సాగుతోంది. మోకాలి గాయంతో జట్టుకు దూరం అయిన బెన్ స్టోక్స్ ఫిట్ అయ్యాడని అంచనా. స్టోక్స్ నెట్‌ప్రాక్టీస్ సెషన్‌కు సంబం ధించిన ఫోటోలు, విడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే బెన్‌స్టోక్స్ జట్టులోకి తీసుకుంటే ఎవరిని పక్కనపెట్టాలనేది సిఎస్కేకు తలనొప్పిగా మారింది. బ్యాటింగ్‌కోచ్ మైక్ హస్సీకూడా ఇదేభావనతో ఉన్నాడు. బెన్‌స్టోక్స్ ఫిట్ అయినా ఆతడు బెంచ్‌కే పరిమితం అయ్యే ఛాన్స్ ఎక్కువ ఉంది.

తుదిజట్టులో ఆడుతున్న మోయిన్ ఆలీ, మతీష పతిరణ, మహేశ్ తీక్షణ, మిచెల్‌శాంట్నర్‌లు అద్భుతంగా రాణిస్తుండ టంతో బెన్‌స్టోక్స్‌ను జట్టులోకి తీసుకునే ఛాన్స్‌లేదు. అలాగే ఈమ్యాచ్ లో అదనపు స్పిన్నర్‌తో బరిలోకి దిగుతోంది. సూపర్‌ఫామ్‌లో ఉన్న బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎలాంట ఇమార్పులు ఉండే అవకాశం లేదు. ఇంపాక్ట్‌ప్లేయర్‌గా అంబటిరాయుడు, తుషార్‌దేశ్‌పాండేలు ఉన్నారు. ముందుగా బౌలింగ్‌చేస్తే తుషార్‌దేశ్‌పాండే, బ్యాటింగ్‌చేస్తే అంబటి రాయుడు బరిలోకి వస్తారు. తుదిజట్టుపరంగా డేవాన్ కాన్వే, రుతురాజ్‌గైక్వాడ్, అజింక్యా రహానే, అంబటిరాయుడు, శివమ్‌దూబే, మొయిన్ ఆలీ, రవీంద్రజడేజా, మహేంద్రసింగ్‌ధోనీ, దీపక్‌చాహర్, మహీశ్‌తీక్షణ, మహీశ్‌పతిరణలుంటారు. ఇంపాక్ట్‌ప్లేయర్‌గా తుషార్‌దేశ్ పాండే ఉంటాడని అంచనా.

# స్టార్‌పేసర్ జోఫ్రా ఆర్చర్ స్వదేశానికి పయనం



**ముంబయి:** ఐపిఎల్‌సీజన్‌లో ముంబయి ఇండియన్స్‌కు గట్టిషాక్ తగిలింది. ఆజట్టు స్టార్‌పేసర్ జోఫ్రా ఆర్చర్ ఐపిఎల్ 16 సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరం అయ్యాడు. ఆర్చర్ ఇంకా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో స్వదేశానికి తిరుగుముఖం పట్టాడు. ఆతడి స్థానంలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ క్రిస్ జోర్డాన్‌ను జట్టులోకి తీసుకుంటున్నట్లు ముంబయి ఇండియన్స్ ట్విట్టర్‌ద్వారా వెల్లడించింది. క్రిస్ జోర్డాన్‌తో ముంబయి రెండుకోట్లకు ఒప్పందం చేసుకుంది. అయితే ఈసీజన్‌లో ఆర్చరన ఆశించినమేకు రాణించలేకపోయాడు. ఐదు మ్యాచ్‌లు ఆడి 9.50 ఎకానమీతో రెండు వికెట్లు మాత్రమే తీసాడు. 2016లో ఐపిఎల్ అరంగేట్రంచేసిన క్రిస్ జోర్డాన్ వివిధ సీజన్లలో ఆర్సీబీ సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్‌కింగ్స్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల తరపున ఆడాడు. మొత్తం 28 మ్యాచ్‌లు ఆడి 9.32 ఎకానమితో 27 వికెట్లుతీసాడు. ముంబయి ఇండియన్స్‌పరంగా ఈసీజన్‌లో ఇప్పటివరకూ 10 మ్యాచ్‌లు ఆడ ఇఐదు విజయాలు ఐదు ఓటములతో పాయింట్లపట్టికలో ఎనిమిదోస్థానంలో ఉంది.

# భారత్ స్టాక్ మార్కెట్లలోకి రష్యా ఇన్వెస్టర్లు

**న్యూఢిల్లీ, మే 9:** ఉక్రెయిన్‌పై దాడి అనంతరం రష్యాపై అమెరికా, ఐరోపాలు ఆంక్షలు విధించడంతో, రష్యా ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు భారత స్టాక్ మార్కెట్ల వైపు అడుగులు వేస్తున్నారు. రష్యాకు చెందిన రెండు సంస్థలు సెబి నుంచి 3 విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పిఐ) లైసెన్సులు పొందడం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఎఫ్‌పిఐలుగా సెబి వద్ద నమోదైన ఈ సంస్థలు మాస్కో కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆల్ఫా కేపిటల్ మేనేజ్‌మెంట్ కంపెనీ కేటగిరి-1, కేటగిరి-2 విభాగాల్లో, సెవోలాడ్ రోజనోవ్ కేటగిరి-1 విభాగంలో నమోదైనట్లు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ వద్ద లభ్యమవుతున్న గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. పైగా వీటికి జారీచేసిన లైసెన్సులు మూడేళ్ల పాటు అంటే 2026 ప్రారంభం వరకు చెల్లుబాటు కానున్నాయి. కాగా భారత్‌లో పెట్టుబడుల కోసం రష్యా ఇన్వెస్టర్లు ఎఫ్‌పిఐ మార్గాన్ని ఎంచుకోవడం ఇదే మొదటిసారి. సాధారణంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మార్గానికే వీళ్ల ప్రాధాన్యమిస్తుంటారు. పెట్టుబడులు పెట్టేందుకు భారత మార్కెట్ల వైపు రష్యా ఇన్వెస్టర్లు దృష్టిసారిస్తుండడం, కొత్త ఆర్థిక పరిణామాలకు దారి చూపొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. డాలరుకు ప్రత్యామ్నాయ కరెన్సీపై విస్తృతంగా చర్చ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో రష్యా ఇన్వెస్టర్లు, సంస్థలు భారత కేపిటల్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టేందుకు యోచన చేస్తుండడాన్ని కూడా అదే కోణంలో చూడాల్సి ఉంటుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ముఖ్య పెట్టుబడుల వ్యూహకర్త వి.కె.విజయకుమార్ చెబుతున్నారు. పెట్టుబడుల పరంగా భౌగోళిక వైవిధ్యం ఉండడం కూడా భారత్‌కు మంచిదేనని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే అదానీ షేర్లలో ఎఫ్‌పిఐలు పెట్టుబడుల వ్యవహారం తీవ్ర వివాదాస్పదం అయిన నేపథ్యంలో వెల్లడి నిబంధనలను సెబి మరింత కఠినం చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.



# బెంగళూరులో ఫాక్స్‌కాన్ స్థల సేకరణ

**బెంగళూరు, మే 9:** తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఫాక్స్‌కాన్ బెంగళూరు శివారులో పెద్ద మొత్తంలో స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని కంపెనీ లండన్ స్టాక్ ఎక్ఛేంజీకి తెలియచేసింది. చైనా వెలుపలకు ప్రాధాన్యం ఇస్తున్న విషయం విదితమే. ఆపిల్ ఐఫోన్ల అసెంబ్లింగ్‌ను చేపడుతన్న ప్రధాన కంపెనీల్లో ఫాక్స్‌కాన్ ఒకటి. ప్రస్తుతం ఈ కంపెనీ కార్యకలాపాలు చైనాలో కేంద్రీకృతమై ఉన్నాయి. కానీ అక్కడ తలెత్తిన వివిధ సమస్యల వల్ల తయారీని ఇతర దేశాలకు విస్తరిస్తోంది. భారత్‌లో వ్యాపార విస్తరణకు అపార అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్న ఆపిల్ కూడా ఇక్కడి మార్కెట్‌పై దృష్టిసారించింది. బెంగళూరు ఎయిర్ పోర్టుకు సమీపంలో ఉన్న దేవణహల్లి ప్రాంతంలో 1.2 మిలియన్ చదరపు మీటర్ల స్థలాన్ని ఫాక్స్‌కాన్ కొనుగోలు చేసింది. దీని కోసం అనుబంధ సంస్థ ఫాక్స్‌కాన్ హాన్ హాయ్ టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ దాదాపు రూ.300 కోట్లు చెల్లించినట్లు తెలిసింది. మరోవైపు వియత్నాంలోనూ ఫాక్స్‌కాన్ 4,80,000 చదరపు మీటర్ల స్థలం కొనుగోలు చేసింది. త్వరలోనే రాష్ట్రంలో కొత్త తయారీ



తయారీ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఫాక్స్‌కాన్ భారత్‌కు అధిక కేంద్రంలో ఆపిల్ తమ ఐఫోన్లను తయారు చేయనుందని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై మార్చిలో ప్రకటించిన విషయం విదితమే.

# హెచ్‌ఎస్‌బిసి బ్యాంకుపై ఆర్‌బిఐ భారీ జరిమానా..

**న్యూఢిల్లీ, మే 9:** నిబంధనలు పాటించని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా కొరడా ఝుళిపిస్తూ ఉంటుంది. ఇటీవల కొన్నింటిపై అపరాధ రుసుము విధించగా, మరికొన్నింటి లైసెన్సులు రద్దుచేసింది. తాజాగా హెచ్‌ఎస్‌బిసికి కేంద్ర బ్యాంకు వాత పెట్టింది. ఈ మేరకు భారీగా ఫైన్ కట్టాలని ఆదేశించింది. భారతీయ నిబంధనలను పాటించనందుకు హెచ్‌ఎస్‌బిసిపై రూ.1.73 కోట్ల జరిమానా విధించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. సేవల్లో లోపాలపై ఆధారపడి ఈ చర్య తీసుకున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. మార్చి 31, 2021 నాటికి ఆ బ్యాంకు ఆర్థిక స్థితి, రిస్క్ అసెస్‌మెంట్ రిపోర్ట్ తయారు చేసేందుకు జరిపినప్పుడు దీనిని గుర్తించినట్లు పేర్కొంది. బకాయిలు లేని వివిధ క్రెడిట్ కార్డులకు సంబంధించి మొత్తం నాలుగు క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలకు హెచ్‌ఎస్‌బిసి తప్పుడు సమాచారం అందించినట్లు ఆర్‌బిఐ గుర్తించింది. తద్వారా రిజర్వ్ బ్యాంకు నిబంధనలను అతిక్రమించినందుకు ఈ బ్యాంకుపై చర్యలకు ఉపక్రమించింది. దీని గురించి లోతైన దర్యాప్తు కోసం బ్యాంకుకు నోటీసు కూడా ఇచ్చినట్లు ఆర్‌బిఐ తెలిపింది. సిఐసి నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎందుకు జరిమానా విధించకూడదో కారణం చెప్పాలని హెచ్‌ఎస్‌బిసికి ఆర్‌బిఐ నోటీసులు పంపింది. అందుకు అది ఇచ్చిన సమాచారం, వ్యక్తిగత విచారణ సమయంలోని మౌఖిక సమర్పణలను పరిగణలోని తీసుకున్న తర్వాత, నగదు పెనాల్టీ విధించాలని నిర్ధారణకు వచ్చింది.



# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, మే 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిసాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు మధ్యాహ్నానికి ఇంట్రాడే గరిష్టాలకు చేరాయి. తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి మళ్లాయి. మరోవైపు ఐటిసి, ఎస్‌బిఐ, బజాజ్ ఫైనాన్స్ వంటి దిగ్గజ షేర్లు నష్టపోవడం కూడా మార్కెట్లను కలవరపెట్టింది. చివరికి సెన్సెక్స 2.92 పాయింట్ల స్వల్ప నష్టంతో 61,761.33 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 1.55 పాయింట్ల స్వల్ప లాభంతో 18,265.95 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, టిసిఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఏసియన్ పెయింట్స్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి వంటి షేర్లు అత్యధికంగా పుంజుకున్నాయి. ఐటిసి, ఎస్‌బిఐ, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టిపిసి, పవర్‌గ్రిడ్‌కార్పొరేషన్, ఐసిఐసిఐబ్యాంకు, సన్ ఫార్మా, కోటాక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. భవిష్యత్తు వృద్ధిపై మెరుగైన అంచనాల నేపథ్యంలో జిందాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ షేరు ఇంట్రాడేలో రూ.740 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరింది. చివరికి 9.63 శాతం పెరిగి రూ.696.75 వద్ద నిలిచిందిద. గణేశ్ హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు ఒక్కో షేరుపై రూ.2.40 డివిడెండ్‌ను ప్రకటించింది. దీంతో ఇంట్రాడేలో కంపెనీ షేరు 8శాతం వరకు పెరిగింది. చివరికి ఎన్ఎస్ఇలో 4.41 శాతం పెరిగి రూ.362.00 వద్ద నిలిచింది.

# లింక్డ్‌ఇన్ 716 మంది తొలగింపు

**ముంబై, మే 9:** అంతర్జాతీయంగా వ్యాపార పరిస్థితులు చాలా డైనమిక్‌గా మారాయి. మైక్రోసాఫ్ట్ యాజమాన్యంలోని జాబ్స్ సెర్చ్ యాప్ లింక్డ్‌ఇన్ తాజాగా ఉద్యోగుల తొలగింపును ప్రకటించింది. జాబ్ సెర్చ్ దిగ్గజం లింక్డ్‌ఇన్ దాదాపు 716 మంది ఉద్యోగులను తగ్గించాలని నిర్ణయించింది. ఇదేసమయంలో అమెరికాకంపెనీ చైనా-ఫోకస్డ్ జాబ్ అప్లికేషన్‌ను మూసివేయడానికి సిద్ధమైంది. బలహీనపడుతున్న ప్రపంచ ఆర్థిక దృక్పథం, డిమాండ్ తగ్గుదల మధ్య తాజా నిర్ణయం వెలువడింది. లింక్డ్‌ఇన్‌లో దాదాపు 20వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గతసంవత్సరం ప్రతి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం పెరిగినప్పటికీ, దాని మాతృసంస్థ మైక్రోసాఫ్ట్‌తో సహా కార్మికులను తొలగించడంలో ప్రధాన సాంకేతిక సంస్థల హోస్ట్‌లోచేరింది. ఇది దాదాపు 3.5 శాతం ఉద్యోగాల కోతలకు దారి తీసింది. కార్యక్రమాలను క్రమబద్ధీకరించడంతో పాటు నిర్ణయాలు వేగవంతం చేసేందుకు తగిన రూట్ ఏర్పాటు చేస్తామని సిఇఒ ర్యాన్ రోస్లాన్స్కీ ఉద్యోగులకు లేఖ ద్వారా తెలిపారు.

# వాణిజ్యం

# గో ఫస్ట్‌పై కేంద్ర మంత్రి క్లారిటీ..

**ముంబై, మే 9:** డబ్బు కొరతతో నేలకొరిగిన గోఫస్ట్ విహంగాలను తిరిగి గాల్లోకి తీసుకొచ్చేందుకు వాడియా గ్రూప్ ప్రయత్నాలను కొనసాగిస్తోంది. ప్రభుత్వం నుంచి ఏ చిన్న సాయం అందినా తాము తిరిగి సేవలను పునరుద్ధిస్తామని కంపెనీ సిఇఒ ఇటీవల ధీమాగా తెలిపారు. అయితే ఎయిర్‌లైన్ ఆశలు అడియాశలుగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈవ్యవహారంపై కేంద్ర సహాయమంత్రి వికె సింగ్ తాజాగా స్పందించారు. అమెరికాకు చెందిన ప్రాట్ అండ్ విట్నీతో ఇంజిన్‌ల సరఫరా సమస్యను పరిష్కరించే వరకు నగదు కొరతతో ఉన్న గోఫస్ట్ ఎయిర్ లైన్స్‌కు ప్రభుత్వం బెయిలౌట్ చేసే అవకాశం లేదని వెల్లడించారు. నగదు కొరతతో విమాన సేవలను అకస్మాత్తుగా రద్దు చేస్తున్నట్లు కంపెనీ గతవారం ప్రకటిస్తూ స్వచ్ఛందంగా దివాలా కోసం ఎయిర్‌లైన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. కంపెనీ ఎదుర్కొంటున్న తాజా పరిస్థితులకు ఇంజిన్-మేకర్ ప్రాట్ అండ్ విట్నీని నిందించింది. లోపభూయిష్ట ఇంజిన్‌ల కారణంగా 54 ఎయిర్‌బస్ ఎ320 నోయిస్ విమానాల్లో 50శాతం గ్రౌండింగ్ అయ్యాయని గో ఫస్ట్ ఆరోపించింది. ఈ సంక్షోభ సమయంలో విమానాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు లీజర్లు కోర్టును ఆశ్రయించినందున ఎయిర్‌లైన్ దివాలా పిటిషన్‌పై ఉత్తర్వులు జారీచేయాలని గో ఫస్ట్ లాయర్లు ట్రిబ్యునల్‌కు తెలిపారు. ఈ వివాదం కొనసాగుతుండగా విమాన టిక్కెట్ల విక్రయాన్ని కంపెనీ వెంటనే నిలిపివేయాలని డిజిసిఎ కంపెనీకి నోటీసులు జారీచేసింది. అయితే గోఫస్ట్ విమానాలను త్వరగా తిరిగి ప్రారంభించలేక పోతే కంపెనీ తన స్లాట్లను కోల్పోవచ్చని తెలుస్తోంది.



# మ్యాన్‌కైండ్ ఐపిఒ భేష్..

**ముంబై, మే 9:** చాలా కాలంగా మార్కెట్లలో మంచి ఐపిఒ కోసం ఎదురు చూసిన ఇన్వెస్టర్లకు మంచి కాలం వచ్చింది. ప్రఖ్యాత దేశీయఫార్మా సంస్థ మ్యాన్‌కైండ్ ఐపిఒ మంగళవారం స్టాక్‌మార్కెట్లోకి అడుగు పెట్టింది. మ్యాన్ కైండ్ ఫార్మా ఐపిఒలో షేర్లు పొందిన ఇన్వెస్టర్లు మంచి రాబడులను పొందారు. ఈ స్టాక్ బిఎస్ఇలో రూ.1300 వద్ద లిస్ట్ అయింది. అంటే షేర్లు మార్కెట్లో దాదాపు 20శాతం ప్రీమియం ధరకు ట్రేడింగ్ ప్రారంభించాయి. మధ్యాహ్నం సమయంలో స్టాక్ ధర రూ.1,375 వద్ద ఉంది. అలాగే ఇంట్రాడేలో గరిష్ట ధర రూ.1,414కు చేరింది. ఐపిఒ ప్రైస్ బ్యాంక్ గమనిస్తే ఒక్కో షేరు ధర రూ.1,026 నుంచి రూ.1,080 గా ఉంది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఒక్కో షేరుపై ఐపిఒలో స్టాక్స్ పొందిన ఇన్వెస్టర్లు రూ.295 లాభం పొందారు. దీనికి ముందు 2020లో గ్లాండ్ ఫార్మా కంపెనీ రూ.6,480 కోట్ల ఐపిఒ ఫ్లోట్ చేయగా, ఆ తర్వాత ఫార్మా రంగంలో వస్తున్న అతిపెద్ద ఐపిఒగా మ్యాన్ కౌండ్ నిలిచింది. ముఖ్యంగా అర్హత కలిగిన సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి బలమైన ప్రతిస్పందన లభించడంతో ఐపిఒ విజయవంతం అయింది. దాదాపు 50 రెట్లు అధికంగా బిడ్డింగ్ జరిగింది. తాజా ఐపిఒ ద్వారా కంపెనీ రూ.4,326 కోట్లను సమీకరించింది. ఈ ఐపిఒలో సిపిపిఐబి, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, గోల్డ్‌మన్ శాచ్స్, ఫిడిలిటీ, బ్లాక్‌రాక్, జిఐఎస్, నోమురా వంటి 16 మ్యాచువల్ ఫండ్స్ స్కీమ్స్ ఫార్మా ఐపిఒలో ఆసక్తిని కనబరిచాయి.





Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14